PRGI REGD No.: TGTEL/26/A4986

# ప్రభాత కిరణం

సత్యానికి వారధి

మేడ్చల్ మల్కాజిగిరి | సంపుటి : 01 | సంచిక : 017 | శనివారం | 11-07-2026 | పేజీలు : 08 | వెల: రూ.4/- www.prabhathakiranam.com

Medchal Malkajigiri | Volume : 01 | Issue : 017 | Saturday | 11-07-2026 | Pages: 08 | Price : Rs.4/- Circulated to Telangana | Published from Medchal Malkajgiri




## తక్కువ వడ్డీ మాయ

**తాకట్టులో తాకట్టు కనికట్టు • రూ.10 కోట్ల బంగారం గల్లంతు**

**ముత్తూట్ బ్రాంచ్‌లో భారీ మోసం • కస్టమర్ల నమ్మకానికే మేనేజర్ టోకరా**

సామాన్య ప్రజల నమ్మకాన్ని ఆసరాగా చేసుకుని కొత్త తరహా ఆర్థిక మోసాలు పెరుగుతున్నాయి. తక్కువ వడ్డీకి రుణాలు, అదనపు ప్రయోజనాలు, సులభ సేవలు అంటూ ఆకర్షించి చివరికి కష్టార్జిత సంపాదనను కాజేస్తున్నారు. తాజాగా కేపీహెచ్‌బీలో వెలుగులోకి వచ్చిన బంగారు రుణాల మోసం మరోసారి ప్రజలను అప్రమత్తం చేసింది. అధికారిక సంస్థలోనే పనిచేస్తున్న వ్యక్తి పేరును నమ్మి బంగారం తాకట్టు పెట్టిన కస్టమర్లు ఇప్పుడు తమ ఆభరణాల కోసం పోలీస్ స్టేషన్ చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఏర్పడింది.

(వివరాలు 3లో..)



## యూజర్‌నేమ్ ఫీచర్‌కు బ్రేక్

**వాట్సాప్‌కు కేంద్రం కఠిన హెచ్చరిక**

**కేంద్రానికి లిఖితపూర్వక సమాధానం**

వాట్సాప్‌లో ప్రవేశపెట్టాలని భావించిన యూజర్‌నేమ్ ఫీచర్ అంశంపై కేంద్ర ప్రభుత్వానికి మెటా సంస్థ లిఖితపూర్వక సమాధానం అందించింది. జూలై 9 సాయంత్రం ఈ వివరణను ఎలక్ట్రానిక్స్, సమాచార సాంకేతిక మంత్రిత్వ శాఖకు పంపినట్లు అధికారులు వెల్లడించారు. ప్రస్తుతం ఆ సమాధానాన్ని కేంద్రం సమగ్రంగా పరిశీలిస్తోంది. ప్రభుత్వ ఆందోళనలకు వాట్సాప్ ఇచ్చిన వివరణ సరిపోతుందా లేదా అనే అంశంపై త్వరలో నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. (వివరాలు 3లో..)



## రెండో పెళ్లి చేసుకుంటే మీ కర్మ

**బహుభార్యత్వంపై అసోం సీఎం శర్మ**

**ప్రభుత్వ ఉద్యోగాలకు చెల్లుచీటి**

**బడ్జెట్‌లో కీలక ప్రతిపాదనలు**

అస్సాం ప్రభుత్వం బహుభార్యత్వాన్ని అరికట్టేందుకు మరింత కఠిన చర్యలకు సిద్ధమైంది. ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ నాయకత్వంలోని ప్రభుత్వం 2026-27 రాష్ట్ర బడ్జెట్ లో కీలక ప్రతిపాదనలు చేసింది. ఒకటి కంటే ఎక్కువ వివాహాలు చేసుకున్న పురుషులకు ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు నిలిపివేయడంతో పాటు, ప్రభుత్వ ఉద్యోగులైతే ఉద్యోగాల నుంచి తొలగించే నిబంధనలు తీసుకురావాలని నిర్ణయించింది. (వివరాలు 3లో..)




## హీరో ఛాన్స్ పేరుతో కోట్ల మోసం

- రూ.3.5 కోట్ల చీటింగ్ ఆరోపణలు
- 'పిల్ల జమిందార్' దర్శకుడిపై కేసు

తెలుగు సినీ పరిశ్రమలో హీరోగా అవకాశం ఇప్పిస్తామని చెప్పి భారీ మొత్తంలో డబ్బులు తీసుకున్నారనే ఆరోపణలతో టాలీవుడ్‌లో సంచలనం రేగింది. ప్రముఖ చిత్రం 'పిల్ల జమిందార్' దర్శకుడు గుడ్లూరి అశోక్ బాబు, నిర్మాత విజయలక్ష్మిపై సైబరాబాద్ పోలీసులు కేసు నమోదు చేశారు.




## మిస్సింగ్ మిస్టరీ

- దంపతుల కేసులో ట్విస్ట్
- రూ.50 కోట్ల మోసంపై దర్యాప్తు

హైదరాబాద్‌లోని చర్లపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో అదృశ్యమైన దంపతుల కేసు కొత్త మలుపు తిరిగింది. తొలుత మిస్సింగ్ కేసుగా నమోదైన ఈ ఘటనలో ఇప్పుడు భారీ ఆర్థిక మోసం ఆరోపణలు వెలుగులోకి రావడంతో పోలీసులు అన్ని కోణాల్లో దర్యాప్తు చేపట్టారు. దంపతుల అదృశ్యం వెనుక పెట్టుబడుల పేరుతో జరిగిన మోసం కూడా ఉండొచ్చనే అనుమానాలు



- 117 సీట్ల లక్ష్యంతో కాంగ్రెస్‌కు పవర్
- రాహుల్‌ను ప్రధాని చేయడమే లక్ష్యం
- రైతు సభలో సీఎం ఎన్నికల శంఖారావం

# రాముడిపై ఒట్టు.. రేవంత్ కొత్త ట్విస్టు..

**ఖమ్మం జిల్లా మధిర నియోజకవర్గంలోని జగన్నాథపురంలో నిర్వహించిన రైతు ఆశీర్వాద సభ రాజకీయంగా కీలక వేదికగా మారింది. రైతు భరోసా తుది విడత నిధుల విడుదల కోసం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎన్నికల వ్యూహాలపై సంచలన వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్ లక్ష్యం కేవలం తెలంగాణలో అధికారాన్ని కొనసాగించడం మాత్రమే కాదని, దేశంలో రాహుల్ గాంధీని ప్రధానమంత్రిగా చూడడమే తమ ప్రధాన లక్ష్యమని ప్రకటించారు. తెలంగాణలో పార్లమెంట్ స్థానాలు పెరిగితే 26కు 26 ఎంపీ స్థానాలు కాంగ్రెస్ గెలవాలని, ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో కనీసం 20 ఎంపీ స్థానాలు గెలిపించాలని ప్రజలకు పిలుపునిచ్చారు.**

### 182లో 117 సీట్లు గెలుస్తాం

తెలంగాణలో అసెంబ్లీ స్థానాలు 119 నుంచి 182కు పెరిగే అవకాశం ఉందని రేవంత్ రెడ్డి అన్నారు. లోక్‌సభ స్థానాలు కూడా 17 నుంచి 26కు పెరుగుతాయని తెలిపారు. ఈ మార్పుల తర్వాత 2029లో జరిగే ఎన్నికల్లో కాంగ్రెస్ 182 స్థానాల్లో కనీసం 117 అసెంబ్లీ స్థానాలు గెలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ 20 ఎంపీ స్థానాలను గెలుచుకుంటుందని తేల్చి చెప్పారు. ఈ మాటను భద్రాచలం శ్రీరాముడిపై ఒట్టేసి చెబుతున్నానని వ్యాఖ్యానించారు. తెలంగాణలో మరోసారి కాంగ్రెస్ ప్రభుత్వమే ఏర్పడుతుందని స్పష్టం చేశారు.



వివరాలు 2లో..




## 'అక్క రాజ్యం' తెస్తా..

**రైతుకు గౌరవం, గిరిజనులకు హక్కులు**

**తెలంగాణ రక్షణ సేన కవిత హామీలు**

తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ప్రజలకు కీలక హామీలు ఇచ్చారు. తమ పార్టీని గెలిపిస్తే రైతును నిజమైన రాజుగా నిలబెడతానని ప్రకటించారు. తమ ప్రభుత్వం ఏర్పడితే ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో రైతుకు ప్రత్యేక కుర్చీ ఏర్పాటు చేసి గౌరవం కల్పిస్తామని చెప్పారు. అన్న రాజ్యం కాదు, అక్క రాజ్యం ఎలా ఉంటుందో ప్రజలకు చేసి చూపిస్తానని పేర్కొన్నారు. కొత్త పార్టీ కొత్త ఆలోచనలతో ముందుకు సాగుతుందని, 'పాంచజన్యం' పేరుతో ప్రజా ఉద్యమాన్ని విస్తరిస్తామని వెల్లడించారు. మహిళల అభ్యున్నతి కోసం ప్రత్యేక కార్యాచరణ రూపొందించానని కవిత తెలిపారు. త్వరలోనే ఆ ప్రణాళికను ప్రజలకు ప్రకటిస్తామని చెప్పారు. సమాజంలో మహిళల పాత్రను మరింత బలోపేతం చేసే విధంగా కార్యక్రమాలు అమలు చేస్తామని పేర్కొన్నారు. మహిళలకు ఆర్థిక, సామాజిక భద్రత కల్పించడమే తమ లక్ష్యమని అన్నారు. కొత్త రాజకీయానికి మహిళలే బలమైన శక్తిగా నిలుస్తారని విశ్వాసం వ్యక్తం చేశారు.

## ఫాతిమా కాలేజీపైకి హైడ్రా ఎందుకు వెళ్లదు?

**కాంగ్రెస్, ఎంఐఎంపై బండి విమర్శలు**

కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ మరోసారి ఫాతిమా మహిళా కళాశాల అంశాన్ని ప్రస్తావిస్తూ తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం, ఎంఐఎం పార్టీపై తీవ్ర విమర్శలు చేశారు. ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీకి చెందిన ఫాతిమా మహిళా కళాశాల సకలం చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉందని ఆయన ఆరోపించారు. ఈ విషయం అందరికీ కనిపిస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం మాత్రం చూసినట్లు చూడడం లేదని మండిపడ్డారు.




ఈ అంశంపై సామాజిక మాధ్యమ వేదిక ఎక్స్‌లో ఆయన చేసిన వ్యాఖ్యలు రాజకీయంగా చర్చనీయాంశమయ్యాయి.




**కా**ళేశ్వరం ప్రాజెక్టు అంశం తెలంగాణ రాజకీయాల్లో మరోసారి తీవ్ర దుమారం రేపుతోంది. మూడు నెలలు అవకాశం ఇస్తే నీటి సమస్యలు పరిష్కరిస్తానన్న బీఆర్ఎస్ నేత హరీశ్ రావు వ్యాఖ్యలకు కాంగ్రెస్ నాయకత్వం వరుసగా కౌంటర్లు ఇస్తోంది. టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, ముందు కాంగ్రెస్‌లో చేరితేనే అవకాశం గురించి ఆలోచిస్తామని వ్యంగ్యంగా స్పందించగా, జలవనరుల మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పదేళ్లు అధికారంలో ఉండి చేయలేనిది ఇప్పుడు ఎలా చేస్తారని ప్రశ్నించారు. కాళేశ్వరం నిర్మాణం కమిషన్ల కోసమే జరిగిందని, హరీశ్‌ను కేసీఆరే నీటిపారుదల శాఖ నుంచి తప్పించారని ఉత్తమ్ ఆరోపించారు. మరోవైపు బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ మాత్రం కాంగ్రెస్, బీఆర్ఎస్ రెండూ రాజకీయాలకే పరిమితమయ్యాయని మండిపడ్డారు. అవినీతి జరిగి ఉంటే దోషులను కఠినంగా శిక్షించాలని, అదే సమయంలో ప్రజల డబ్బుతో నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టును రైతుల ప్రయోజనాల కోసం వెంటనే వినియోగించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఒకవైపు హరీశ్ ప్రభుత్వంపై ఒత్తిడి పెంచుతుండగా, కాంగ్రెస్ ఎదురుదాడి చేస్తోంది. మధ్యలో ఈటల ప్రజల ప్రయోజనాలే ముఖ్యమంటూ రెండు పార్టీలకూ హెచ్చరికలు జారీ చేయడంతో కాళేశ్వరం చుట్టూ రాజకీయ సవాళ్లు మరింత ఉత్కంఠ రేపుతున్నాయి.

### మంత్రి పదవి కావాలా..!

- ముందు పార్టీలోకి రండి
- • హరీశ్‌కు పీసీసీ చీఫ్ కౌంటర్

### కమిషన్ల కోసమే నాడు కాళేశ్వరం

- హరీశ్‌ను అసమర్థుడని కేసీఆరే గుర్తించారు
- కాళేశ్వరం నిర్మాణంపై ఉత్తమ్ ఘాటు విమర్శలు

### కాళేశ్వరంపై కాంగ్రెస్ వైఫల్యం

- ప్రాజెక్టులు నడపలేక రైతులు బలి
- కన్నెపల్లి పంపులు వెంటనే ఆన్ చేయండి
- రేవంత్ సర్కారుపై హరీశ్ రావు నిప్పులు

### కాళేశ్వరంపై కాంగ్రెస్, బీఆర్ఎస్ డ్రామాలు

రైతులతో రాజకీయాలు ఆపండి: ఎంపీ ఈటల




## సుప్రీంకోర్టులో కలకలం

- జడ్జీలపై పేపర్లు విసిరివేత
- విచారణ మధ్యలో అనూహ్య ఘటన
- న్యాయమూర్తులపై భద్రతపై ప్రశ్నలు




## పక్కాగా సర్ లెక్కలు

**రెండు చోట్ల ఓటుంటే ఏడాది జైలు**

**89 లక్షల అనుమానాస్పద ఓట్ల గుర్తింపు**

ఓటర్ల జాబితా ప్రక్షాళన వేగవంతం

98% ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ పూర్తి

# 'అక్క రాజ్యం' తెస్తా..

- రైతుకు గౌరవం గిరిజనులకు హక్కులు
- తెలంగాణ రక్షణ సేన కవిత హామీలు
- గిరిజన సమస్యలపై పోరాటం



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట మండలంలోని కొత్త గంగారం గ్రామం, నాయకపోడు గిరిజన ప్రాంతాలను సందర్శించిన కవిత అక్కడి ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. రాజకీయాల కోసం కాదని, ప్రజల సమస్యలు తెలుసుకోవడానికే తాను గ్రామాలకు వస్తున్నానని చెప్పారు. వెనుకబడిన గిరిజనుల హక్కుల కోసం తెలంగాణ రక్షణ సేనను ఏర్పాటు చేశానని వివరించారు. గిరిజనుల సమస్యల పరిష్కారం కోసం అవసరమైతే ఢిల్లీ వరకు పోరాటం చేస్తామని స్పష్టం చేశారు. నాయకపోడు గిరిజనులను 'గోండు నాయకపోడు'గా పిలవడం బాధాకరమని కవిత అన్నారు. 1950 రికార్డుల్లో నాయకపోడు జాతి పేరు లేకపోవడం అన్యాయమని పేర్కొన్నారు. గిరిజనులకు పూర్తి గుర్తింపు, హక్కులు కల్పించేందుకు నిరంతర పోరాటం చేస్తామని హామీ ఇచ్చారు. వారి సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

**రుణాలు, విద్యపై డిమాండ్లు**

ఆదివాసీ యువతకు బైక్ కొనాలన్నా బ్యాంకులు రుణాలు ఇవ్వడం లేదని కవిత ఆరోపించారు. పెద్ద ఎత్తున రుణాలు తీసుకున్న వారిని ఆదుకున్న ప్రభుత్వాలు గిరిజనులను ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు. విదేశాల్లో ఉన్న విధానాల మాదిరిగా ఆదివాసీలకు రూ.2 లక్షల నుంచి రూ.2 కోట్ల వరకు బ్యాంకు రుణాలు అందించాలని డిమాండ్ చేశారు. గిరిజన పిల్లలకు ఉచిత విద్య, ఉచిత వైద్యం కల్పించడం ప్రభుత్వ బాధ్యత అని అన్నారు. తెలంగాణలో ఇప్పటికీ నిరుద్యోగం, విద్యుత్ సమస్యలు పూర్తిగా పరిష్కారం కాలేదని కవిత విమర్శించారు. ఎస్టీల కోసం కేటాయించిన వేల కోట్ల రూపాయలను ప్రభుత్వం ఇతర అవసరాలకు మళ్లిస్తోందని ఆరోపించారు. రైతులు, మహిళలు, గిరిజనులు కేంద్రంగా రాజకీయాలు చేస్తామని స్పష్టం చేశారు. ప్రజల ఆశీర్వాదంతో తెలంగాణ రక్షణ సేనను బలోపేతం చేసి ప్రత్యామ్నాయ రాజకీయ శక్తిగా నిలబెడతామని కవిత తెలిపారు.

# రాముడిపై ఒట్టు.. రేవంత్ కొత్త ట్విస్టు..

- 117 సీట్ల లక్ష్యంతో కాంగ్రెస్‌కు పవర్
- రాహుల్‌ను ప్రధాని చేయడమే లక్ష్యం
- రైతు సభలో సీఎం ఎన్నికల శంఖారావం



**182లో 117 సీట్లు గెలుస్తాం**

తెలంగాణలో అసెంబ్లీ స్థానాలు 119 నుంచి 182కు పెరిగే అవకాశం ఉందని రేవంత్ రెడ్డి అన్నారు. లోక్‌సభ స్థానాలు కూడా 17 నుంచి 26కు పెరుగుతాయని తెలిపారు. ఈ మార్పుల తర్వాత 2029లో జరిగే ఎన్నికల్లో కాంగ్రెస్ 182 స్థానాల్లో కనీసం 117 అసెంబ్లీ స్థానాలు గెలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ 20 ఎంపీ స్థానాలను గెలుచుకుంటుందని తేల్చి చెప్పారు. ఈ మాటను భద్రాచలం శ్రీరాముడిపై ఒట్టేసి చెబుతున్నానని వ్యాఖ్యానించారు. తెలంగాణలో మరోసారి కాంగ్రెస్ ప్రభుత్వమే ఏర్పడుతుందని స్పష్టం చేశారు.



**కేసీఆర్ కుటుంబంపై ఘాటు విమర్శలు**

మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, కల్వకుంట్ల కుటుంబంపై రేవంత్ రెడ్డి తీవ్ర విమర్శలు గుప్పించారు. కల్వకుంట్ల కుటుంబాన్ని తెలంగాణ రాజకీయాల నుంచి పూర్తిగా పక్కకు తప్పించే వరకు కాంగ్రెస్ కార్యకర్తలు విశ్రాంతి తీసుకోరని అన్నారు. కేసీఆర్‌ను ఇప్పటికే ఫామ్‌హౌస్‌కే పరిమితం చేశామని పేర్కొన్నారు. అధికారం కోల్పోయిన తర్వాత బీఆర్ఎస్ నాయకులు ప్రజల్లో అపోహలు సృష్టించే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. బావా, బామ్మర్ది కలిసి రాష్ట్రమంతా తిరుగుతున్నారని ఎద్దేవా చేశారు.

**హరీశ్ రావుకు రాముడిపై ఒట్టు సవాల్**

హరీశ్ రావు బీజేపీ నేతలతో చర్చలు జరుపుతున్నారా లేదా అన్న విషయాన్ని భద్రాచలం శ్రీరాముడిపై ఒట్టేసి చెప్పాలని రేవంత్ రెడ్డి సవాల్ విసిరారు. తాను బీఆర్ఎస్‌లోనే కొనసాగుతానని కేసీఆర్‌పై ఒట్టేసి చెప్పాలని కూడా డిమాండ్ చేశారు. బీఆర్ఎస్‌ను బీజేపీలో విలీనం చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయని, ఈ విషయాన్ని ఆ పార్టీకి చెందిన వారే చెబుతున్నారని ఆరోపించారు. ఈ వ్యాఖ్యలు సభలో రాజకీయ వేడిని మరింత పెంచాయి.

**రైతులకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం**

రైతు భరోసా తుది విడత నిధులను ముఖ్యమంత్రి సభ వేదికపైనే విడుదల చేశారు. రైతుల ఖాతాల్లో నిధులు జమ చేసినట్లు ప్రకటించారు. గత రెండున్నరేళ్లలో రైతుల సంక్షేమం కోసం రూ.1.70 లక్షల కోట్లకు పైగా ఖర్చు చేసినట్లు వెల్లడించారు. వరి కొనుగోలుతో పాటు బోనస్ కూడా అందిస్తున్నామని చెప్పారు. రైతు కళ్లల్లో ఆనందం చూడటమే ప్రభుత్వానికి నిజమైన ఆశీర్వాదమని పేర్కొన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే కరెంట్ ఉండదని గతంలో చేసిన ప్రచారం పూర్తిగా అబద్ధమని విమర్శించారు. ఉచిత విద్యుత్ కాంగ్రెస్ హక్కు అని స్పష్టం చేశారు.

**బీఆర్ఎస్ పాలనపై విమర్శలు**

పదేళ్లపాటు బీఆరెస్ పాలనలో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని రేవంత్ రెడ్డి ఆరోపించారు. రైతులకు సంకెళ్లు వేసిన పాలనకు ప్రజలు ముగింపు పలికారని అన్నారు. ఖమ్మం జిల్లాలో బీఆరెస్‌కు ప్రజలు పూర్తిగా దూరమయ్యారని వ్యాఖ్యానించారు. 2023లో పొంగులేటి శ్రీనివాసరెడ్డి కాంగ్రెస్‌లో చేరిన తర్వాత జిల్లాలో రాజకీయ పరిస్థితులు పూర్తిగా మారిపోయాయని చెప్పారు. అప్పటి నుంచి జరిగిన ప్రతి ఎన్నికలో కాంగ్రెస్ విజయపథంలోనే సాగుతోందని గుర్తు చేశారు.

**భవిష్యత్ ఎన్నికలపై ధీమా**

రానున్న ఎన్నికల్లో కూడా కాంగ్రెస్ విజయయాత్ర కొనసాగుతుందని రేవంత్ రెడ్డి విశ్వాసం వ్యక్తం చేశారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజలకు పూర్తి నమ్మకం ఉందని అన్నారు. రైతు సంక్షేమం, అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలుతో ప్రజల మద్దతు మరింత పెరిగిందని చెప్పారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో భారీ మెజారిటీతో కాంగ్రెస్ మరోసారి అధికారంలోకి వస్తుందని, పార్లమెంట్ ఎన్నికల్లో కూడా అత్యధిక స్థానాలు సాధించి జాతీయ రాజకీయాల్లో కీలక పాత్ర పోషిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. సభ మొత్తం ఎన్నికల ప్రచార వాతావరణాన్ని తలపించేలా సాగింది.

# ఫాతిమా కాలేజీపైకి హైడ్రా ఎందుకు వెళ్లదు?

**కాంగ్రెస్, ఎంఐఎంపై బండి విమర్శలు**
**హైడ్రా చర్యలపై ప్రశ్నలు**



పేదల ఇళ్లను హైడ్రా పేరుతో కూల్చివేస్తున్న ప్రభుత్వం ఈ కళాశాల విషయంలో మాత్రం ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని బండి సంజయ్ ప్రశ్నించారు. ఒకే చట్టం అందరికీ సమానంగా అమలు కావాలని, ఎంపిక చేసిన ప్రాంతాల్లో మాత్రమే చర్యలు తీసుకోవడం సరైన విధానం కాదని విమర్శించారు. సకలం చెరువు పరిధిలో నిర్మాణం ఉందనే ఆరోపణలపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు.

**కాంగ్రెస్‌పై ఘాటు వ్యాఖ్యలు**

కాంగ్రెస్ ప్రభుత్వం ఎంఐఎంకు అనుకూలంగా వ్యవహరిస్తోందని బండి సంజయ్ ఆరోపించారు. రాజకీయ ప్రయోజనాల కోసం ప్రభుత్వ వ్యవస్థలను వినియోగిస్తున్నారని విమర్శించారు. అవసరమైన చోట ఫుల్ ట్యాంక్ లెవల్ నిబంధనలను అమలు చేస్తూ, తమకు అనుకూలంగా ఉన్న ప్రాంతాల్లో మాత్రం వాటిని పట్టించుకోవడం లేదని అన్నారు. ఈ వైఖరి ప్రజల్లో అనుమానాలకు తావిస్తోందని వ్యాఖ్యానించారు.

**వ్యంగ్యంగా కంటి పరీక్షల వ్యాఖ్య**

కాంగ్రెస్ నాయకులకు కంటి పరీక్షలు చేయించాల్సిన అవసరం ఉందంటూ బండి సంజయ్ వ్యంగ్య వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రవ్యాప్తంగా బీజేపీ కార్యకర్తలు ఉచిత కంటి పరీక్ష శిబిరాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. ఆ పరీక్షల తర్వాత కూడా ఫాతిమా కళాశాల కనిపించకపోతే సమస్య కళ్లలో లేదని, రాజకీయ దృష్టిలో ఉందని ఎద్దేవా చేశారు. ఈ వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో చర్చకు దారితీశాయి.

**రాజకీయంగా వేడెక్కిన వివాదం**

సకలం చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో ఫాతిమా మహిళా కళాశాల ఉందనే అంశంపై ఇప్పటికే రాజకీయ చర్చ కొనసాగుతోంది. అదే అంశాన్ని మరోసారి ప్రస్తావించిన బండి సంజయ్ కాంగ్రెస్ ప్రభుత్వం ద్వంద్వ వైఖరిని అవలంబిస్తోందని ఆరోపించారు. ఈ వివాదంపై ప్రభుత్వం నుంచి అధికారిక స్పందన రావాల్సి ఉంది. బండి సంజయ్ చేసిన తాజా ఆరోపణలతో ఈ అంశం తెలంగాణ రాజకీయాల్లో మరోసారి ప్రధాన చర్చగా మారింది.

# మంత్రి పదవి కావాలా..!

- ముందు పార్టీలోకి రండి
- హరీశ్‌కు పీసీసీ చీఫ్ కౌంటర్



బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్ రావు చేసిన వ్యాఖ్యలకు టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ ఘాటుగా స్పందించారు. మూడు నెలలు నీటిపారుదల శాఖ బాధ్యత ఇస్తే రాష్ట్రంలోని నీటి సమస్యలను పరిష్కరిస్తానన్న హరీశ్ వ్యాఖ్యలను ఆయన తీవ్రంగా తప్పుబట్టారు. ముందు హరీశ్ రావు కాంగ్రెస్ పార్టీలో చేరాలని, ఆ తర్వాతే ఆయనకు అవకాశం ఇవ్వాలా వద్దా అనే అంశంపై చర్చిస్తామని వ్యాఖ్యానించారు. హరీశ్ నిజంగా కాంగ్రెస్‌లోకి రావాలని కోరితే రాజకీయ వ్యవహారాల కమిటీలో చర్చించి నిర్ణయం తీసుకుంటామని తెలిపారు.

**పదేళ్లు మంత్రిగా ఏం చేశారు?**

పదేళ్లపాటు అధికారంలో ఉండి నీటిపారుదల శాఖను నిర్వహించిన హరీశ్ రావు ఇప్పుడు మూడు నెలల్లో అద్భుతాలు చేస్తానని చెప్పడం ఆశ్చర్యంగా ఉందని మహేశ్ కుమార్ గౌడ్ అన్నారు. జలవనరుల శాఖ మంత్రిగా ఉన్న సమయంలో నిర్మించిన ప్రాజెక్టులే కుంగిపోయాయని గుర్తు చేశారు. ఆ విషయంపై ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. పదేళ్లలో పరిష్కరించని సమస్యలను మూడు నెలల్లో ఎలా పరిష్కరిస్తారని ప్రశ్నించారు.

**బీఆర్ఎస్ నిధులపై వ్యాఖ్యలు**

బీఆర్ఎస్ పార్టీ నిధులపై ఎమ్మెల్సీ కవిత చేసిన వ్యాఖ్యల్లో నిజం ఉందని మహేశ్ కుమార్ గౌడ్ అభిప్రాయపడ్డారు. ఒక ప్రాంతీయ పార్టీకి రూ.1,400 కోట్ల నిధులు ఎలా వచ్చాయనే ప్రశ్నకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత బీఆర్ఎస్ నాయకులపై ఉందన్నారు. ఈ అంశంపై ప్రజలకు పూర్తి వివరాలు వెల్లడించాలని కోరారు. పార్టీ ఆర్థిక వ్యవహారాలపై పారదర్శకత అవసరమని పేర్కొన్నారు.

**కాంగ్రెస్‌లో విభేదాలు సహజమే**

కాంగ్రెస్ పార్టీలో వ్యక్తమవుతున్న భిన్నాభిప్రాయాలపై కూడా మహేశ్ కుమార్ గౌడ్ స్పందించారు. పెద్ద రాజకీయ పార్టీల్లో అభిప్రాయ భేదాలు సహజమేనని చెప్పారు. వరంగల్‌లో మంత్రి కొండా సురేఖ, ఎమ్మెల్యే కడియం శ్రీహరి మధ్య నెలకొన్న విభేదాలతో పాటు తుంగతుర్తిలో ఏర్పడిన సమస్యలను కూడా త్వరలో పరిష్కరిస్తామని తెలిపారు. ఇరు వర్గాల అభిప్రాయాలను విని అందరికీ ఆమోదయోగ్యమైన నిర్ణయం తీసుకుంటామని వెల్లడించారు.

**సీనియర్ నేతలకు బాధ్యతలు**

పార్టీలో తలెత్తిన వివాదాల పరిష్కారం కోసం ఇద్దరు సీనియర్ నేతలను పరిశీలకులుగా నియమించినట్లు టీపీసీసీ చీఫ్ తెలిపారు. వరంగల్ వ్యవహారాన్ని సచిన్ సావంత్‌కు అప్పగించామని, తుంగతుర్తి బాధ్యతను జగ్గారెడ్డికి అప్పగించినట్లు చెప్పారు. క్రమశిక్షణ పేరుతో వెంటనే సస్పెండ్ చేయడం పరిష్కారం కాదని స్పష్టం చేశారు. చర్చల ద్వారా సమస్యలకు పరిష్కారం కనుగొనడమే కాంగ్రెస్ విధానమని పేర్కొన్నారు.

**విమర్శలకు సమాధానం**

గత ప్రభుత్వ పాలనలో జరిగిన తప్పులను సరిదిద్దే పనిలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉందని మహేశ్ కుమార్ గౌడ్ చెప్పారు. ప్రభుత్వం కూలిపోతుందని బీఆర్ఎస్ నాయకులు చేస్తున్న ప్రచారాన్ని ప్రజలు నమ్మడం లేదన్నారు. నీటి సమస్యలు, అభివృద్ధి అంశాలపై విమర్శలు చేసే ముందు గత పాలనలో జరిగిన పరిణామాలను గుర్తు చేసుకోవాలని బీఆర్ఎస్ నాయకులకు సూచించారు. ప్రజలకు ఇచ్చిన హామీల అమలుపైనే కాంగ్రెస్ ప్రభుత్వం దృష్టి పెట్టిందని ఆయన స్పష్టం చేశారు.

# కాళేశ్వరంపై కాంగ్రెస్ వైఫల్యం

- ప్రాజెక్టులు నడపలేక రైతులు బలి
- కన్నెపల్లి పంపులు వెంటనే ఆన్ చేయండి
- రేవంత్ సర్కారుపై హరీశ్ రావు నిప్పులు
- కాళేశ్వరం ప్రాజెక్టులను వినియోగించాలి



మాజీ మంత్రి, బీఆర్ఎస్ అగ్రనేత హరీశ్‌రావు కాళేశ్వరం ప్రాజెక్టు నిర్వహణపై కాంగ్రెస్ ప్రభుత్వాన్ని తీవ్రంగా విమర్శించారు. కాళేశ్వరం నిర్మాణంపై రాజకీయ విమర్శలు చేయడం కంటే ఇప్పటికే సిద్ధంగా ఉన్న ఎత్తిపోతల వ్యవస్థను వినియోగించి రైతులకు నీరు అందించాలని డిమాండ్ చేశారు. కన్నెపల్లి పంప్‌హౌస్ నుంచి వెంటనే నీటిని ఎత్తిపోసి అన్నారం, సుందిళ్ల మీదుగా ఎల్లంపల్లి రిజర్వాయర్‌కు తరలించాలని సూచించారు. నీళ్లు అందుబాటులో ఉన్నా పంపులు ఆన్ చేయకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యమని ఆరోపించారు.

మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలు భారీ వరదలను కూడా తట్టుకున్నాయని హరీశ్‌రావు పేర్కొన్నారు. ఇప్పుడు లక్ష క్యూసెక్కుల ప్రవాహం ఉన్నా ప్రమాదం జరుగుతుందనే భయాలు సృష్టించడం సరికాదన్నారు. కాళేశ్వరం అంటే కేవలం ఒక బ్యారేజీ కాదని, మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల, మిడ్ మానేరు, ఎల్లంపల్లి, రంగనాయకసాగర్, మల్లన్నసాగర్, కొండపోచమ్మసాగర్ వంటి అనుసంధాన ప్రాజెక్టుల సమాహారమని గుర్తు చేశారు. వాటిని పూర్తిస్థాయిలో వినియోగించకుండా పక్కనబెట్టడం రైతాంగానికి నష్టమని విమర్శించారు.

**ఎల్లంపల్లి నిల్వలపై ఆందోళన**

ఎల్లంపల్లి ప్రాజెక్టు సామర్థ్యం 20.18 టీఎంసీలు కాగా ప్రస్తుతం కేవలం 5.48 టీఎంసీల నీరు మాత్రమే ఉందని హరీశ్‌రావు తెలిపారు. డెడ్ స్టోరేజీ స్థాయికి చేరువలో ఉన్నా ప్రభుత్వం స్పందించడం లేదన్నారు. ఎల్లంపల్లి నుంచి సాగునీరు, మిషన్ భగీరథ, హైదరాబాద్ తాగునీరు, విద్యుత్ ఉత్పత్తి, పరిశ్రమలకు భారీగా నీటి అవసరం ఉంటుందని చెప్పారు. ఇలాంటి పరిస్థితిలో రిజర్వాయర్లను నింపకపోతే భవిష్యత్తులో తీవ్ర నీటి సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని హెచ్చరించారు.

**దేవాదుల, సీతారామ ప్రాజెక్టుల ప్రస్తావన**

దేవాదుల ఎత్తిపోతల పథకంలో పది మోటార్లు ఉన్నా ప్రభుత్వం ఒకటి, రెండు మాత్రమే నడుపుతోందని హరీశ్‌రావు ఆరోపించారు. సగానికి పైగా పంపులు నిలిపివేయడం వల్ల రైతులకు నీరు అందడం లేదన్నారు. కేసీఆర్ హయాంలో నిర్మించిన సీతారామ ఎత్తిపోతల ద్వారా ఖమ్మం రైతులకు గోదావరి జలాలు చేరుతున్నాయని, అలాంటి ప్రాజెక్టులను కూడా పూర్తిస్థాయిలో వినియోగించకుండా ప్రభుత్వం వ్యవహరిస్తోందని విమర్శించారు. నల్లగొండతో పాటు పలు జిల్లాల్లో సాగునీటి కోసం రైతులు ఆందోళనలు చేస్తున్నా ప్రభుత్వం స్పందించడం లేదని పేర్కొన్నారు.

**ఏపీకి నీరు.. తెలంగాణకు నిరీక్షణ**

తెలంగాణలో గోదావరి జలాలు అందుబాటులో ఉన్నా వాటిని వినియోగించకుండా దిగువకు వదిలేస్తున్నారని హరీశ్‌రావు ఆరోపించారు. మరోవైపు ఆంధ్రప్రదేశ్‌లో పట్టిసీమ, తాడిపూడి, పురుషోత్తమపట్నం, పుష్కర ఎత్తిపోతల పథకాల ద్వారా గోదావరి జలాలను వినియోగిస్తున్నారని గుర్తు చేశారు. తెలంగాణ ప్రభుత్వం మాత్రం సిద్ధంగా ఉన్న బాహుబలి పంపులను కూడా నడపడం లేదని విమర్శించారు. వెంటనే కన్నెపల్లి పంపులు ఆన్ చేసి ఎల్లంపల్లి, రంగనాయకసాగర్, మల్లన్నసాగర్, ఇతర రిజర్వాయర్లను నింపాలని బీఆర్ఎస్ తరఫున ఆయన డిమాండ్ చేశారు. రైతుల ప్రయోజనాల కంటే రాజకీయ ద్వేషానికి ప్రాధాన్యం ఇవ్వడం తెలంగాణ భవిష్యత్తుకు ప్రమాదకరమని హరీశ్‌రావు వ్యాఖ్యానించారు.

# కమిషన్ల కోసమే నాడు కాళేశ్వరం



- హరీశ్‌ను అసమర్థుడని కేసీఆరే గుర్తించారు
- కాళేశ్వరం నిర్మాణంపై ఉత్తమ్ ఘాటు విమర్శలు
- హరీశ్ రావుపై వ్యక్తిగత విమర్శలు

కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం ప్రజల అవసరాల కోసం కాదని, భారీ కమిషన్ల కోసమే చేపట్టారని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తీవ్ర ఆరోపణలు చేశారు. ఎక్కువ వ్యయం చూపిస్తే అధిక కమిషన్లు వస్తాయనే ఉద్దేశంతోనే ప్రాజెక్టు రూపకల్పన జరిగిందని విమర్శించారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ పేరును తొలగించి కాళేశ్వరం పేరుతో ప్రాజెక్టును ముందుకు తీసుకెళ్లారని ఆరోపించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో తీసుకున్న నిర్ణయాల వల్లే ఈ పరిస్థితి వచ్చిందని అన్నారు.

మాజీ మంత్రి హరీశ్ రావుపై ఉత్తమ్ కుమార్ రెడ్డి ఘాటు వ్యాఖ్యలు చేశారు. నీటిపారుదల శాఖ మంత్రిగా హరీశ్ రావు సమర్థంగా పని చేయలేదని, అందుకే కేసీఆరే ఆయనను ఆ బాధ్యత నుంచి తప్పించారని విమర్శించారు. అది హరీశ్ అసమర్థతకు నిదర్శనమని పేర్కొన్నారు. రూ.38 కోట్లతో ప్రారంభించిన తమ్మిడిహెట్టి ప్రాజెక్టును కూడా పూర్తి చేయలేకపోయారని ఆరోపించారు. ఇప్పుడు కాళేశ్వరం విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శించే నైతిక హక్కు బీఆర్ఎస్‌కు లేదని అన్నారు.

**మట్టి పరీక్షలు చేయకుండానే నిర్మాణం**

కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో ప్రాథమిక సాంకేతిక ప్రమాణాలను కూడా పాటించలేదని ఉత్తమ్ ఆరోపించారు. మట్టి పరీక్షలు నిర్వహించకుండా, అధికారులు సూచించిన ప్రదేశానికి బదులుగా ఐదు కిలోమీటర్ల దూరంలో ఇసుక ప్రాంతంలో పునాది వేశారని చెప్పారు. దీంతో ప్రాజెక్టు భద్రతపై అప్పుడే అనుమానాలు వ్యక్తమయ్యాయని వివరించారు. సేఫ్టీ అధికారులు ముందుగానే హెచ్చరించినా బీఆర్ఎస్ ప్రభుత్వం పట్టించుకోలేదని విమర్శించారు.

**డ్యామ్ సేఫ్టీ హెచ్చరికలను విస్మరించారు**

జాతీయ డ్యామ్ సేఫ్టీ బృందం కూడా ప్రాజెక్టు భద్రతపై హెచ్చరికలు జారీ చేసినా బీఆర్ఎస్ నాయకులు వాటిని పట్టించుకోలేదని మంత్రి ఆరోపించారు. ప్రస్తుతం కూడా అధికారులు నీటిని నిల్వ చేయొద్దని సూచిస్తున్నప్పటికీ ప్రజలను తప్పుదోవ పట్టించే వ్యాఖ్యలు చేస్తున్నారని మండిపడ్డారు. ఈ పరిస్థితికి పూర్తి బాధ్యత బీఆర్ఎస్ ప్రభుత్వానిదేనని స్పష్టం చేశారు.

**కాంగ్రెస్ ప్రభుత్వం సరిదిద్దుతోంది**

తెలంగాణను అప్పుల ఊబిలోకి నెట్టిన బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన తప్పులను కాంగ్రెస్ ప్రభుత్వం సరిదిద్దుతోందని ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. డ్యామ్ సేఫ్టీ అధికారుల సూచనల ప్రకారం అవసరమైన మరమ్మతులు పూర్తి చేసి ప్రాజెక్టును సురక్షితంగా తీర్చిదిద్దుతామని హామీ ఇచ్చారు. సూర్యాపేటకు ప్రస్తుతం అందుతున్న నీరు ఎస్సారెస్పీ స్టేజ్-2 ద్వారా వస్తోందని, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత కాళేశ్వరం నుంచి ఒక్కసారి కూడా నీటిని విడుదల చేయలేదని స్పష్టం చేశారు.

**హుజూర్‌నగర్‌లో అభివృద్ధి పనుల ప్రారంభం**

సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్‌లో రూ.20 కోట్లతో చేపడుతున్న మోడల్ కాలనీ అభివృద్ధి పనులకు ఉత్తమ్ కుమార్ రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజల డబ్బుతో నిర్మించిన ప్రాజెక్టులు ప్రజల ప్రయోజనాల కోసమే ఉండాలని అన్నారు. గత ప్రభుత్వం చేసిన తప్పులను పునరావృతం చేయకుండా పారదర్శకంగా పనులు పూర్తి చేస్తామని తెలిపారు. రైతుల ప్రయోజనాలు, రాష్ట్ర నీటి భద్రతే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు.

# కాళేశ్వరంపై కాంగ్రెస్, బీఆర్ఎస్ డ్రామాలు

**రైతులతో రాజకీయాలు ఆపండి: ఎంపీ ఈటల**



కాళేశ్వరం ప్రాజెక్ట్ విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం, బీఆర్ఎస్ రాజకీయ డ్రామాలు చేస్తున్నాయని బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ తీవ్ర విమర్శలు చేశారు. ప్రాజెక్టు పునరుద్ధరణలో కావాలనే జాప్యం చేస్తున్నారని ఆరోపించారు. కాళేశ్వరం నిర్మాణంలో అవినీతి జరిగిందా లేదా అన్నది వేరే అంశమని, ప్రస్తుతం రైతులకు నీళ్లు అందించడమే ప్రభుత్వ తొలి బాధ్యత కావాలని స్పష్టం చేశారు. రాజకీయాల పేరుతో రైతుల జీవితాలతో చెలగాటం ఆడొద్దని హెచ్చరించారు.

**• కాళేశ్వరం వాడండి.. దోషులను శిక్షించండి**

కాళేశ్వరం ప్రాజెక్టుపై విచారణ పూర్తయిందని, తప్పు చేసిన వారిని గుర్తించి శిక్షించాలని ఈటల డిమాండ్ చేశారు. అవినీతి జరిగి ఉంటే బాధ్యులను అరెస్టు చేయాలని అన్నారు. అయితే మొత్తం ప్రాజెక్టును నిరుపయోగంగా మార్చడం సరైన నిర్ణయం కాదని చెప్పారు. లక్ష్మీ బ్యారేజ్‌లో నీళ్లు నిల్వ చేయాలని తాను కోరడం లేదని, ప్రస్తుతం నదిలో వృథాగా పోతున్న నీటిని కన్నెపల్లి పంప్‌హౌస్‌ల ద్వారా ఎత్తిపోసి రైతులకు అందించాలని ప్రభుత్వాన్ని కోరారు. ప్రజల సొమ్ముతో నిర్మించిన ప్రాజెక్టును ప్రజల కోసమే వినియోగించాలని సూచించారు.

**• కరువు ముంచుకొస్తోంది**

ఎల్‌నినో ప్రభావంతో తీవ్ర కరువు వచ్చే ప్రమాదం ఉందని అంతర్జాతీయ సంస్థలు హెచ్చరిస్తున్నాయని ఈటల గుర్తుచేశారు. అయినా ప్రభుత్వం అప్రమత్తంగా వ్యవహరించడం లేదని విమర్శించారు. ఉత్తర తెలంగాణ రైతులు ఇప్పటికే రెండోసారి విత్తనాలు వేయాల్సిన పరిస్థితి ఎదుర్కొంటున్నారని చెప్పారు. పంటను కాపాడుకోవడానికి రైతులు వేల రూపాయలు అదనంగా ఖర్చు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి సమయంలో నదిలోకి వెళ్లిపోతున్న నీటిని ఎత్తిపోసే అవకాశం ఉన్నా ప్రభుత్వం చర్యలు తీసుకోవడం లేదని మండిపడ్డారు.

**• బీఆర్ఎస్, కాంగ్రెస్‌పై విమర్శలు**

కాళేశ్వరం అంశాన్ని కాంగ్రెస్, బీఆర్ఎస్ పరస్పర విమర్శలకు మాత్రమే పరిమితం చేశాయని ఈటల ఆరోపించారు. ఒకవైపు బీఆర్ఎస్ తమ పాలనను సమర్థించుకుంటోందని, మరోవైపు కాంగ్రెస్ రాజకీయ లబ్ధి కోసమే ఆలస్యం చేస్తోందని అన్నారు. ప్రజలకు నీళ్లు అందించడం కంటే రాజకీయ ఆరోపణలకే ప్రాధాన్యం ఇస్తున్నారని విమర్శించారు. ఉత్తర తెలంగాణ ప్రజలను, హైదరాబాద్ ప్రజలను ఇబ్బందులకు గురిచేయడం సరికాదన్నారు. రెండు పార్టీలూ రాజకీయాలను పక్కనపెట్టి ప్రజల ప్రయోజనాలపై దృష్టి పెట్టాలని సూచించారు.

**• హైదరాబాద్‌కు తాగునీటి హెచ్చరిక**

హైదరాబాద్ నగరానికి ఇప్పటికే తాగునీటి సరఫరా తగ్గిందని ఈటల చెప్పారు. ఇదే పరిస్థితి కొనసాగితే భవిష్యత్తులో తాగునీటి సమస్య తీవ్రంగా మారే అవకాశం ఉందని హెచ్చరించారు. మిడ్ మానేరు ఉత్తర తెలంగాణకు నీటి జంక్షన్ అని, అక్కడి నుంచి సమర్థంగా నీటిని వినియోగిస్తే రైతులకు, నగరాలకు ఉపశమనం లభిస్తుందని వివరించారు. కరువు పరిస్థితులను ముందుగానే అంచనా వేసి చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు.

**• తెలంగాణ ముందా.. పార్టీ ముందా?**

తనకు పార్టీ కంటే తెలంగాణ ముఖ్యమని ఈటల రాజేందర్ స్పష్టం చేశారు. తాను తెలంగాణ ఉద్యమకారుడినని, ప్రజా సమస్యలపై ఎప్పటికీ రాజీ పడనని అన్నారు. ఎవరి స్క్రిప్ట్‌తో మాట్లాడే వ్యక్తిని కాదని, ప్రజల కోసం అవసరమైతే ఏ ప్రభుత్వాన్నైనా ప్రశ్నిస్తానని చెప్పారు. రైతుల కళ్లలో నీళ్లు కనిపిస్తే తాను మౌనంగా ఉండబోనని, నీటి సమస్యపై పోరాటం కొనసాగిస్తానని స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే నిపుణులతో సమావేశం నిర్వహించి, సాధ్యమైనంత త్వరగా నీటిని ఎత్తిపోసే చర్యలు ప్రారంభించాలని ఆయన డిమాండ్ చేశారు.

# సుప్రీంకోర్టులో కలకలం

- జడ్జీలపై పేపర్లు విసిరివేత
- విచారణ మధ్యలో అనూహ్య ఘటన
- న్యాయమూర్తులపై భద్రతపై ప్రశ్నలు



దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టులో శుక్రవారం అనూహ్య ఘటన చోటుచేసుకుంది. కేసులో స్వయంగా వాదనలు వినిపించేందుకు వచ్చిన ఓ వ్యక్తి న్యాయమూర్తుల ఎదుట అసంబద్ధంగా మాట్లాడిన తర్వాత ఒక్కసారిగా పత్రాల కట్టను బెంచ్ వైపు విసిరేశాడు. దీంతో కోర్టు మందిరంలో కొద్దిసేపు ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. అక్కడ ఉన్న న్యాయవాదులు, అధికారులు, ఇతరులు ఒక్కసారిగా ఆశ్చర్యానికి గురయ్యారు.

## న్యాయమూర్తులతో అసాధారణ సంభాషణ

జస్టిస్ కె.వి. విశ్వనాథన్, జస్టిస్ అలోక్ అరాధే ధర్మాసనం ఎదుట హాజరైన ఆ వ్యక్తి కొద్దిసేపు అర్థం కాని రీతిలో మాట్లాడాడు. లక్నోకు చెందిన ఓ సీనియర్ పోలీసు అధికారిపై చర్యలు తీసుకోవాలని న్యాయస్థానాన్ని ఆదేశించే ధోరణిలో మాట్లాడినట్లు సమాచారం. దీనిపై జస్టిస్ విశ్వనాథన్ స్పందిస్తూ తాము ఆదేశాలు తీసుకోవాల్సిన వారమా అని ప్రశ్నించారు. అందుకు అతడు తాను సార్వభౌముడినని చెబుతూ స్పష్టతలేని సమాధానం ఇచ్చాడు.

## పత్రాలు విసిరి కలకలం

కొద్ది సేపటికే తన ఫైల్‌లో ఉన్న విడి పత్రాలను బయటకు తీసి నేరుగా బెంచ్ వైపు విసిరేశాడు. ఆ పత్రాలు గాల్లో ఎగిరిపడి కోర్టు హాలులో చెల్లాచెదురయ్యాయి. వెంటనే అప్రమత్తమైన భద్రతా సిబ్బంది అతడిని అదుపులోకి తీసుకుని కోర్టు హాలులో నుంచి బయటకు తీసుకెళ్లారు. న్యాయమూర్తులు ప్రశాంతంగా వ్యవహరించగా విచారణ కొద్దిసేపు అంతరాయం ఎదుర్కొంది.

## గత ఘటనలు గుర్తుచేసిన పరిణామం

ఈ సంఘటనతో గతంలో సుప్రీంకోర్టులో జరిగిన భద్రతా ఉల్లంఘనలు మరోసారి చర్చకు వచ్చాయి. గత ఏడాది అక్టోబర్‌లో అప్పటి ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బి.ఆర్. గవాయ్ నేతృత్వంలోని ధర్మాసనం ఎదుట ఓ న్యాయవాది వస్తువును విసిరి నినాదాలు చేశాడు. ఆ సమయంలో కూడా భద్రతా సిబ్బంది వెంటనే స్పందించి అతడిని బయటకు తీసుకెళ్లారు. అయితే కోర్టు ధిక్కరణ చర్యలు చేపట్టకుండా జస్టిస్ గవాయ్ ఆ ఘటనను ముగించారు.

## చరిత్రలో మరిన్ని భద్రతా లోపాలు

సుప్రీంకోర్టు చరిత్రలో ఇలాంటి సంఘటనలు ఇదే మొదటిసారి కావు. 2009లో ఓ మహిళ జస్టిస్ అరిజిత్ పసాయత్‌పై చెప్పు విసిరింది. అది న్యాయమూర్తిని తాకకుండా తప్పిపోయింది. అనంతరం ఆమెను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అంతకంటే తీవ్రమైన ఘటన 1968లో జరిగింది. కత్తితో వచ్చిన ఓ వ్యక్తి ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎం. హిదాయతుల్లా ధర్మాసనంపై దాడికి యత్నించాడు. ఆ సమయంలో జస్టిస్ హిదాయతుల్లా స్వయంగా దుండగుడిని పట్టుకుని అదుపులో ఉంచగా భద్రతా సిబ్బంది వచ్చి అరెస్టు చేశారు. ఈ ఘటనలో జస్టిస్ ఏ.ఎన్. గ్రోవర్ గాయపడ్డారు.

## భద్రతపై మళ్లీ చర్చ

తాజా పరిణామంతో సుప్రీంకోర్టు భద్రతా వ్యవస్థపై మరోసారి చర్చ మొదలైంది. న్యాయస్థానాల్లో విచారణలు ప్రశాంతంగా సాగేందుకు మరింత కట్టుదిట్టమైన భద్రత అవసరమనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రవేశ విధానాలు, తనిఖీ ప్రక్రియలు, కోర్టు భద్రతను మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని న్యాయ వర్గాలు భావిస్తున్నాయి.




# యూజర్‌నేమ్ ఫీచర్‌కు బ్రేక్

- వాట్సాప్‌కు కేంద్రం కఠిన హెచ్చరిక
- కేంద్రానికి లిఖితపూర్వక సమాధానం

వాట్సాప్‌లో ప్రవేశపెట్టాలని భావించిన యూజర్‌నేమ్ ఫీచర్ అంశంపై కేంద్ర ప్రభుత్వానికి మెటా సంస్థ లిఖితపూర్వక సమాధానం అందించింది. జూలై 9 సాయంత్రం ఈ వివరణను ఎలక్ట్రానిక్స్, సమాచార సాంకేతిక మంత్రిత్వ శాఖకు పంపినట్లు అధికారులు వెల్లడించారు. ప్రస్తుతం ఆ సమాధానాన్ని కేంద్రం సమగ్రంగా పరిశీలిస్తోంది. ప్రభుత్వ ఆందోళనలకు వాట్సాప్ ఇచ్చిన వివరణ సరిపోతుందా లేదా అనే అంశంపై త్వరలో నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది.

## యూజర్‌నేమ్ ఫీచర్‌పై ఎందుకింత ఆందోళన?

వాట్సాప్ ప్రతిపాదించిన కొత్త ఫీచర్ ప్రకారం మొబైల్ నంబర్‌కు బదులుగా యూజర్‌నేమ్ మాత్రమే ఇతరులకు కనిపించే అవకాశం ఉంటుంది. ఈ విధానం అమల్లోకి వస్తే నకిలీ ఖాతాలు సృష్టించడం, ఫిషింగ్ మోసాలు, డిజిటల్ అరెస్ట్ పేరుతో జరుగుతున్న మోసాలు, ఇతరుల పేరుతో మోసపూరిత సందేశాలు పంపడం వంటి సైబర్ నేరాలు పెరిగే ప్రమాదం ఉందని కేంద్ర ప్రభుత్వం భావిస్తోంది. ప్రజల భద్రత దృష్ట్యా పూర్తి స్థాయి సంప్రదింపులు పూర్తయ్యే వరకు ఈ ఫీచర్‌ను భారత్‌లో అమలు చేయవద్దని ఇప్పటికే స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది.

## వాట్సాప్‌కు గడువు పొడిగింపు

ప్రభుత్వ నోటీసుకు మొదట జూలై 4లోగా సమాధానం ఇవ్వాల్సి ఉన్నప్పటికీ, వాట్సాప్ మరికొంత గడువు కోరింది. చర్చలు పూర్తయ్యే వరకు భారత్‌లో యూజర్‌నేమ్ ఫీచర్‌ను విడుదల చేయబోమని సంస్థ హామీ ఇచ్చింది. ఆ హామీ మేరకే ఇప్పుడు పూర్తి వివరణను కేంద్రానికి సమర్పించింది. ఆ సమాధానాన్ని సాంకేతిక, న్యాయపరమైన కోణాల్లో అధికారులు పరిశీలిస్తున్నారు.

## ఐటీ చట్టం ప్రకారం ప్రభుత్వ వాదన

భారత్‌లో 80 కోట్లకు పైగా వినియోగదారులు ఉన్న వాట్సాప్‌ను సిగ్నిఫికెంట్ సోషల్ మీడియా ఇంటర్మీడియరీగా ప్రభుత్వం పరిగణిస్తోంది. సమాచార సాంకేతిక చట్టం-2000, ఐటీ నిబంధనలు-2021 ప్రకారం ఇలాంటి వేదికలు ప్రత్యేక బాధ్యతలు నిర్వర్తించాల్సి ఉంటుందని కేంద్రం పేర్కొంది. అందుకే ప్రజల భద్రతకు సంబంధించిన అంశాల్లో ప్రభుత్వం జోక్యం చేసుకునే అధికారం ఉందని స్పష్టం చేసింది.

## టెలిగ్రామ్, సిగ్నల్‌కూ నోటీసులు

వాట్సాప్‌కు మాత్రమే కాకుండా టెలిగ్రామ్, సిగ్నల్, అరట్టై వంటి మెసేజింగ్ వేదికలకూ కేంద్ర ప్రభుత్వం ఇదే అంశంపై నోటీసులు పంపింది. ఈ యాప్‌లలో ఇప్పటికే యూజర్‌నేమ్ ఆధారిత వ్యవస్థ అందుబాటులో ఉంది. ఆయా సంస్థల నుంచి సమాధానాలు రావాల్సి ఉందని ఐటీ శాఖ కార్యదర్శి ఎస్. కృష్ణన్ తెలిపారు. అన్ని సంస్థల వివరణలను పరిశీలించిన తర్వాత కేంద్ర ప్రభుత్వం తదుపరి చర్యలపై నిర్ణయం తీసుకోనుంది. దీంతో భారత్‌లో యూజర్‌నేమ్ ఫీచర్ భవిష్యత్తుపై ఆసక్తి నెలకొంది.

# రెండో పెళ్లి చేసుకుంటే మీ కర్మ

- బహుభార్యత్వంపై అసోం సీఎం శర్మ
- ప్రభుత్వ ఉద్యోగాలకు చెల్లుచీటి
- బడ్జెట్‌లో కీలక ప్రతిపాదనలు

అస్సాం ప్రభుత్వం బహుభార్యత్వాన్ని అరికట్టేందుకు మరింత కఠిన చర్యలకు సిద్ధమైంది. ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ నాయకత్వంలోని ప్రభుత్వం 2026-27 రాష్ట్ర బడ్జెట్‌లో కీలక ప్రతిపాదనలు చేసింది. ఒకటి కంటే ఎక్కువ వివాహాలు చేసుకున్న పురుషులకు ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు నిలిపివేయడంతో పాటు, ప్రభుత్వ ఉద్యోగులైతే ఉద్యోగాల నుంచి తొలగించే నిబంధనలు తీసుకురావాలని నిర్ణయించింది. మహిళల సాధికారత, లింగ సమానత్వం, బాధ్యతాయుత పౌరసత్వాన్ని ప్రోత్సహించడమే ఈ నిర్ణయాల ప్రధాన ఉద్దేశమని ప్రభుత్వం తెలిపింది.

## ప్రభుత్వ ఉద్యోగులకు కఠిన నిబంధనలు

రాష్ట్ర ఆర్థిక మంత్రి జయంత మల్లా బరువా బడ్జెట్‌ను ప్రవేశపెడుతూ ఈ ప్రతిపాదనలను ప్రకటించారు. బహుభార్యత్వాన్ని అనుసరిస్తున్నట్లు చట్టపరంగా నిర్ధారణ అయితే ప్రభుత్వ ఉద్యోగులపై క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఇందుకోసం అస్సాం సర్వీసెస్ (డిసిప్లిన్ అండ్ అప్పీల్) రూల్స్-1964లో సవరణలు చేయనున్నట్లు వెల్లడించారు. కొత్త నిబంధనలు అమల్లోకి వస్తే బహుభార్యత్వం నిరూపితమైన ప్రభుత్వ ఉద్యోగి సేవల నుంచి తొలగింపునకు గురయ్యే అవకాశం ఉంటుంది.

## సంక్షేమ పథకాలకు అనర్హత

బహుభార్యత్వాన్ని పాటిస్తున్న పురుషులకు రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాల కింద ఎలాంటి ప్రయోజనాలు ఇవ్వకూడదని ప్రభుత్వం ప్రతిపాదించింది. అంతేకాకుండా ఏదైనా క్రిమినల్ కేసులో శిక్ష పడిన వ్యక్తులు కూడా రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించే సంక్షేమ పథకాల లబ్ధిని పొందకుండా చర్యలు తీసుకోవాలని నిర్ణయించింది. ప్రభుత్వ నిధులు బాధ్యతాయుతంగా జీవించే పౌరులకు మాత్రమే అందేలా ఈ మార్పులు తీసుకొస్తున్నట్లు ప్రభుత్వం పేర్కొంది.

## రూ.6 వేల కోట్ల సంక్షేమ పథకాలు

ఎన్నికల కారణంగా తాత్కాలికంగా నిలిచిన సంక్షేమ పథకాలను ఆగస్టు నుంచి మళ్లీ ప్రారంభించనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. ఈ పథకాల అమలుకు రూ.6 వేల కోట్లకు పైగా నిధులు కేటాయించింది. ఆధార్ ధృవీకరణ ఆధారంగా ఒకే డిజిటల్ వేదిక ద్వారా లబ్ధిదారులకు ప్రయోజనాలు అందించనున్నట్లు బడ్జెట్‌లో వెల్లడించింది. పారదర్శకత పెంచడంతో పాటు అర్హులైన వారికి వేగంగా సేవలు అందించడమే లక్ష్యమని ప్రభుత్వం తెలిపింది.

## గత ఏడాది చట్టానికి కొనసాగింపు

ఈ ప్రతిపాదనలు గత ఏడాది అస్సాం అసెంబ్లీ ఆమోదించిన అస్సాం ప్రొహిబిషన్ ఆఫ్ పాలిగమీ బిల్లు-2025కు కొనసాగింపుగా వస్తున్నాయి. ఆ చట్టం ప్రకారం మొదటి వివాహం చట్టబద్ధంగా కొనసాగుతున్న సమయంలో మరో వివాహం చేసుకున్నా, అలాంటి వివాహాన్ని దాచిపెట్టినా ఏడేళ్ల వరకు జైలు శిక్షతో పాటు జరిమానా విధించే అవకాశం ఉంది. అయితే ఆరో షెడ్యూల్ పరిధిలోని ప్రాంతాలు, రాజ్యాంగ రక్షణ పొందిన షెడ్యూల్డ్ తెగల సభ్యులకు ఈ చట్టం వర్తించదు.

## యూనిఫామ్ సివిల్ కోడ్ దిశగా అడుగులు

ఈ ఏడాది మే నెలలో అస్సాం ప్రభుత్వం యూనిఫామ్ సివిల్ కోడ్ బిల్లును కూడా అసెంబ్లీలో ప్రవేశపెట్టింది. ఈ బిల్లులో బహుభార్యత్వంపై నిషేధంతో పాటు సహజీవన సంబంధాల నమోదు తప్పనిసరి చేయడం, వివాహాలు, విడాకులు, వారసత్వానికి ఒకే విధమైన నిబంధనలు అమలు చేయడం వంటి ప్రతిపాదనలు ఉన్నాయి. రాష్ట్రంలోని ప్రతి పౌరుడికి ఒకే చట్టపరమైన వ్యవస్థ ఉండేలా సంస్కరణలు చేపట్టడమే ప్రభుత్వ లక్ష్యంగా పేర్కొంది. ఈ తాజా ప్రతిపాదనలు అమల్లోకి వస్తే అస్సాంలో కుటుంబ చట్టాలకు సంబంధించిన వ్యవస్థలో మరింత కీలక మార్పులు చోటుచేసుకునే అవకాశం ఉంది.




# రాశి ఫలితాలు

## 10.07.2026 శుక్రవారం

**మేష రాశి :** మిత్రుల ద్వారా పనులు పూర్తి చేస్తారు. కళా రంగ ం ఇన్సూరెన్స్ రంగాల వారికి ఆర్థిక అభివృద్ధి. మృష్టాన్న భోజనము చేస్తారు. పెళ్లిచూపులు భజంత్రీలు మోగేదాకా వెళతాయి. విలువైన వస్తువులు కొనుగోలు చేస్తారు. గృహిణులు మీ ప్రేమానురాగాలతో కుటుంబ సభ్యులను మెప్పిస్తారు.

**వృషభ రాశి :** తలపెట్టిన పనులను పట్టుదలతో సాధిస్తారు. వేడి చేసే ఆహారాన్ని తక్కువగా తీసుకోగలరు. వ్యాపారం లాభదాయకమే. ఉద్యోగస్తులు తమ సామర్థ్యాన్ని కనపరుస్తారు. విద్యార్థులకు సుదినమే. నూతన పరిచయాలు లాభ స్థాయి. జిల్లేడు మొక్కను నాటి సంరక్షించటం వలన గ్రహదోష తీవ్రత తగ్గును.

**మిధున రాశి :** : ఉద్యోగంలో శత్రువుల కుయుక్తులను అధికమిస్తారు. వ్యాపారస్తులకు ఆర్థిక సర్దుబాట్లు ఉంటాయి . గృహిణులు భర్తతో కుటుంబ సభ్యులతో సఖ్యతను పెంచుకోవలెను. నూతన విద్యా సంవత్సరం ప్రారంభించే విద్యార్థులకు పేమెంట్ సీట్ వచ్చేందుకు ఆస్కారం ఉన్నది. సూర్య భగవానుడికి ప్రాతఃకాలం నందు అర్ఘ్యాన్ని ఇవ్వగలరు.

**కర్కాటక రాశి:** విందు వినోదాలలో ఉత్సాహంగాను ఆకర్షణీయంగాను కనబడతారు. దైవ దర్శనం చేసుకుంటారు. నూతన ఆలోచనలతో తమ ప్రతిభను కనపరుస్తారు. ఆర్థిక సర్దుబాట్లను సమర్థతతో పరిష్కరిస్తారు. ఇద్దరి మధ్య వివాదము కు మధ్యవర్తిత్వం వహించి న్యాయంగా ఉండే విధంగా తీర్పునిస్తారు.

**సింహరాశి:** సమయాన్ని సద్వినియోగం చేసుకుంటారు. ఉద్యోగస్తులు సమర్థవంతంగా పనిచేసే అందరితో శభాష్ అనిపించుకుంటారు. వైద్యరంగం వారికి లాభదాయకం. శుభకార్యాలలో ఆకర్షణీయంగా నిలుస్తారు. యోగ్యత గల వారికి దానధర్మాలు చేస్తారు. యోగ్యత గల విద్యార్థులకు& ఇతరులకు దానధర్మాలు చేస్తారు. విదేశాలలో విద్యను అభ్యసించాలి అనుకునే వారికి అనుకూల గ్రహస్థితి.

**కన్యారాశి :** స్థిరాస్తిక సంబంధించిన విషయాలు చర్చల అనంతరం కొలిక్కి వచ్చే ఆస్కారం ఉన్నది. అదృష్టం దూరంగా ఉన్నా సమర్థత సమయస్ఫూర్తితో పనులు సానుకోవడం చేస్తారు. హితోతికంగా సాయం చేస్తారు. భాగస్వామ్య వ్యాపారం సామాన్యంగా ఉండును. వ్యాపారస్తులకు రాని బాకీల బెడద ఉండును. భాగస్వామ్య వ్యాపారం సామాన్యంగా ఉండును.

**తులారాశి :** అసహనానికి, ఆక్రోశానికి లోను కాకుండా నేర్పు ఓర్పుతో పనులు ముందుకు తీసుకు వెళ్ళగలరు. భార్య ఆరోగ్యంపై శ్రద్ధ వహించగలరు. లౌక్యంగా మాట్లాడగలరు. వ్యాపారస్తులకు రాలు బాకీల బెడద ఉండును. అన్ని రంగాలలోని వారు ముఖ్యమైన పనులను వాయిదా వేసుకోవటం మంచిది.

**వృశ్చిక రాశి:** ఆకస్మిక ప్రయాణాలు. అధికారులు కఠినంగా వ్యవహరిస్తారు. ధూమపానం వంటి వ్యసనాలకు పోవద్దు. ఉద్యోగస్తులకు స్థానచలన ఆస్కారం ఉంది. భార్య ఆరోగ్యం పై శ్రద్ధ వహించాలి. అనవసర విషయాల కు దూరంగా ఉండటం మంచిది. జిల్లేడు మొక్కను నాటి సంరక్షించటం వలన గ్రహదోష తీవ్రత తగ్గును.

**ధనస్సు రాశి :** మొండితనానికి పోవద్దు. మత్తు పదార్థాలకు దూరంగా ఉండండి. ఆదాయాన్ని బట్టి ఖర్చు చెయ్యాలనే భావనను మర్చిపోవద్దు. నిరుద్యోగులకు నిరాశాజనకమే. బంధు వర్గాలతో సఖ్యతను పెంచుకోవాలి. వ్యాపారస్తులకు కొద్దిపాటి చికాకులు ఉంటాయి. మామిడి మొక్క నా టి సంరక్షించగలరు. రావి చెట్టు ప్రదక్షణ గ్రహదోష తీవ్రతను తగ్గించగలదు.

**మకర రాశి:** బంధుమిత్రులతో లౌక్యంగా మాట్లాడగలరు. రియల్ ఎస్టేట్ వ్యాపారులకు సామాన్యంగా ఉంది. ఈర్ష్యా ద్వేషాలను పక్కన పెట్టకపోతే నష్టపోతారు. నిడారంబరంగా ఉంటూ ఇతరుల విషయాల జోలికి వెళ్లకపోవడం మంచిది. విద్యార్థులు తల్లి సేవ చేయటం వలన గ్రహదోష తీవ్రత తగ్గును.

**కుంభరాశి :** భార్యాభర్తలు సఖ్యతతో ఉంటే మనస్పర్థలు రాకుండా ఉంటాయి. స్థిరాస్తుల కొనుగోలు వాయిదా వేయటం మంచిది. డ్రైవింగ్ స్పీడ్ తగ్గించాలి. మిత్రులతో తక్కువగా మాట్లాడటం మంచిది. భాగస్వామ్య వ్యాపారస్తులు సఖ్యతగా మెలగాలి. కుటుంబ సౌఖ్యం తగ్గింది. సోలార్ ఎనర్జీ వ్యాపారస్తులకు సు దినం. విలువైన వస్తువులను కొనుగోలు చేస్తారు. వెంకటేశ్వర స్వామి దర్శనం ఆరాధన శుభాన్నిస్తుంది.

**మీన రాశి :** తొందద్దు ప్రమాదాలు తృతిలో తప్పుతాయి. ఆరోగ్యంపై శ్రద్ధ వహించండి. భార్యాభర్తలు సఖ్యతగా మెలగాలి. విదేశీ విద్యకు అనుకూలం. ఉన్నత విద్యను అభ్యసించాలనుకునేవారు శుభవార్త వింటారు. గరిక నీరుతో ఈశ్వరునికి అభిషేకం చేయించగలరు.

*టీటీడీ అనుబంధ సంస్థ*
*సమరసత సిద్ధాంతి*
*'దైవజ్ఞ ' పులిపాక చంద్రశేఖర శర్మ*
*శ్రీ చక్ర పంచాంగ కర్త 9440783005*



# పక్కాగా సర్ లెక్కలు

- రెండు చోట్ల ఓటుంటే ఏడాది జైలు
- 89 లక్షల అనుమానాస్పద ఓట్ల గుర్తింపు
- ఓటర్ల జాబితా ప్రక్షాళన వేగవంతం
- 98% ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ




తెలంగాణలో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్‌ఐఆర్) ప్రక్రియ ప్రశాంతంగా కొనసాగుతోందని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి తెలిపారు. ఇప్పటివరకు 98 శాతం ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ పూర్తయిందని వెల్లడించారు. ఈ నెల 24 వరకు ఫారాల డిజిటలైజేషన్ ప్రక్రియ కొనసాగుతుందని చెప్పారు. ఎవరికైనా ఎన్యూమరేషన్ ఫారం అందకపోతే ఆగస్టులో ఫారం6, ఫారం8 ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. ఓటు ఉండి కూడా ఫారం అందని వారు తమ బీఎల్‌వోను సంప్రదించాలని కోరారు.

## 89 లక్షల అనుమానాస్పద ఓటర్ల గుర్తింపు

తెలంగాణలో తప్పుడు వివరాలు ఉన్నట్లు భావిస్తున్న 89 లక్షల ఓటర్లను ఎన్నికల సంఘం గుర్తించిందని సుదర్శన్ రెడ్డి తెలిపారు. అక్షర దోషాలు, ఇతర వివరాల్లో వ్యత్యాసాలు ఉన్న ఓటర్లకు త్వరలో నోటీసులు జారీ చేయనున్నట్లు చెప్పారు. ఓటర్ల జాబితాను పూర్తిగా ప్రక్షాళన చేయడమే ఈ ప్రత్యేక సర్వే లక్ష్యమని వివరించారు. 2002కు సంబంధించిన వివరాలు లేని ఓటర్లకు కూడా ప్రత్యేక నోటీసులు ఇచ్చి మరోసారి పరిశీలన చేపట్టనున్నట్లు వెల్లడించారు.

## రెండు చోట్ల ఓటు ఉంటే శిక్ష

ఎస్‌ఐఆర్ ప్రక్రియ పూర్తైన తర్వాత ఒక వ్యక్తికి రెండు చోట్ల ఓటు ఉన్నట్లు తేలితే చట్టపరమైన చర్యలు తప్పవని సీఈవో హెచ్చరించారు. దేశవ్యాప్తంగా డీఎస్‌ఏ సాఫ్ట్‌వేర్ ద్వారా ద్వంద్వ ఓటర్లను గుర్తించి తొలగించే ప్రక్రియ చేపడతామని చెప్పారు. రెండు చోట్ల ఓటు ఉన్నట్లు నిర్ధారణ అయితే ఏడాది వరకు జైలు శిక్ష పడే అవకాశం ఉందని స్పష్టం చేశారు. ఓటరు జాబితాలో పారదర్శకత తీసుకురావడమే ఎన్నికల సంఘం ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు.

## వేగవంతం చేయాలని ఆదేశాలు

ఎస్‌ఐఆర్ 2026 పురోగతిపై భారత ఎన్నికల కమిషన్ సీనియర్ ఉప ఎన్నికల కమిషనర్ డాక్టర్ పవన్ కుమార్ శర్మ అధ్యక్షతన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజిగిరి, సంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల్లో డిజిటలైజేషన్ ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ప్రతి జిల్లా రోజువారీ లక్ష్యాలను తప్పనిసరిగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు.

## ఉత్తమ విధానాలు అమలు చేయాలి

ఎస్‌ఐఆర్ ప్రక్రియను సమర్థంగా నిర్వహిస్తున్న జిల్లాల అధికారులతో కేంద్ర ఎన్నికల సంఘం ప్రత్యేకంగా మాట్లాడింది. వారు అమలు చేస్తున్న ఉత్తమ విధానాలను ఇతర జిల్లాలు కూడా అనుసరించాలని సూచించింది. ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ, సేకరణ, డిజిటలైజేషన్ ప్రక్రియలను ప్రతిరోజూ సమీక్షిస్తూ నిర్ణీత గడువులో పూర్తి చేయాలని రాష్ట్ర అధికారులకు ఆదేశాలు ఇచ్చింది.

## ఓటరు నమోదు నిరంతర ప్రక్రియ

ఓటరు నమోదు, సవరణ అనేది నిరంతర ప్రక్రియ అని సుదర్శన్ రెడ్డి స్పష్టం చేశారు. ఎస్‌ఐఆర్ పూర్తయిన తర్వాత కొత్త ఓటర్ల నమోదు కార్యక్రమం ప్రారంభమవుతుందని చెప్పారు. కొత్తగా నమోదు చేసుకున్న వారికి నెల రోజుల్లో ఎన్నికల సంఘం ఓటరు గుర్తింపు కల్పిస్తుందని తెలిపారు. ఏజెన్సీ ప్రాంతాల్లో ఇప్పటికే 59 శాతం ఫారాలు తిరిగి వచ్చాయని వెల్లడించారు. పాతబస్తీ ఏడు నియోజకవర్గాల్లో కూడా ఫారాల సేకరణ పూర్తై డిజిటలైజేషన్ కొనసాగుతోందన్నారు. ఓటు లేకుంటే ప్రభుత్వ సంక్షేమ పథకాలపై ప్రభావం ఉంటుందా లేదా అనేది రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయమని సుదర్శన్ రెడ్డి స్పష్టం చేశారు.

# తక్కువ వడ్డీ మాయ

(మొదటి పేజీ తరువాయి..)

హైదరాబాద్‌లోని కేపీహెచ్‌బీ కాలనీలో భారీ బంగారు రుణాల మోసం వెలుగులోకి వచ్చింది. తక్కువ వడ్డీకే బంగారు రుణాలు ఇప్పిస్తానని నమ్మించి కస్టమర్ల నుంచి కోట్ల రూపాయల విలువైన బంగారాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఆరోపణలు వచ్చాయి. ఈ వ్యవహారంలో సుమారు రూ.10 కోట్ల విలువైన బంగారు ఆభరణాలు అక్రమంగా దారి మళ్లినట్లు సమాచారం. మోసం బయటపడడంతో బాధితులు పోలీసులను ఆశ్రయించారు.

## 50 పైసల వడ్డీ పేరుతో ఆకర్షణ

పోలీసుల వివరాల ప్రకారం కవాడిగూడకు చెందిన ప్రియాంక రెడ్డి కేపీహెచ్‌బీ ఫేజ్ 6లోని ముత్తూట్ ఫైనాన్స్ శాఖలో బ్రాంచ్ మేనేజర్‌గా పనిచేస్తున్నారు. సంస్థ సాధారణంగా వసూలు చేసే వడ్డీ కంటే చాలా తక్కువగా కేవలం 50 పైసలకే రుణాలు ఇప్పిస్తానని కస్టమర్లను నమ్మించారు. ఆమె మాటలు నమ్మిన 40 మందికి పైగా వినియోగదారులు తమ బంగారు ఆభరణాలను తాకట్టు పెట్టారు.

## వ్యక్తిగత ఖాతాల్లోకి వడ్డీ డబ్బులు

వినియోగదారుల నుంచి వడ్డీ మొత్తాన్ని సంస్థ ఖాతాకు కాకుండా తన వ్యక్తిగత బ్యాంకు ఖాతాలో జమ చేయించుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. అంతేకాదు టాపప్ రుణం ఇప్పిస్తానని చెప్పి కస్టమర్ల నుంచి ఓటీపీలు తీసుకుని అదనపు రుణాలను కూడా తన ఖాతాలోకి మళ్లించినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. ఈ విధంగా పలువురు వినియోగదారులను ఒకే పద్ధతిలో మోసం చేసినట్లు దర్యాప్తులో వెల్లడవుతోంది.

## బంగారాన్ని మరో సంస్థకు తరలింపు

ముత్తూట్‌లో తాకట్టు పెట్టిన బంగారు ఆభరణాలను వినియోగదారులకు తెలియకుండా మరో ఫైనాన్స్ సంస్థలో తాకట్టు పెట్టినట్లు ఆరోపణలు ఉన్నాయి. అనంతరం వాటిని ఇతర సంస్థలకు అధిక వడ్డీపై ఇచ్చి భారీగా లాభాలు ఆర్జించినట్లు సమాచారం. బంగారం తిరిగి ఇవ్వాలని కోరిన కస్టమర్లకు కాలయాపన చేయడంతో అనుమానాలు మొదలయ్యాయి. చివరకు బంగారం ఇవ్వకపోవడంతో బాధితులు మోసాన్ని గుర్తించారు.

## ఫిర్యాదుతో కేసు నమోదు

ఓ వృద్ధుడు తన రుణం పూర్తిగా చెల్లించి బంగారం తీసుకునేందుకు వెళ్లిన సమయంలో ఈ వ్యవహారం బయటపడింది. బంగారం ఇవ్వకుండా మేనేజర్ పొంతనలేని సమాధానాలు చెప్పడంతో ఇతర వినియోగదారులు కూడా అప్రమత్తమయ్యారు. అందరూ కలిసి కేపీహెచ్‌బీ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు ఆర్థిక లావాదేవీలు, బంగారం బదిలీలు, సంబంధిత పత్రాలను పరిశీలిస్తున్నారు. ఈ ఘటనలో ఇప్పటివరకు 40 మందికి పైగా బాధితులు ఉన్నట్లు సమాచారం. అయితే దర్యాప్తు కొనసాగుతున్న నేపథ్యంలో మరింత మంది బాధితులు బయటపడే అవకాశం ఉందని పోలీసులు భావిస్తున్నారు. తక్కువ వడ్డీ పేరుతో అధికారిక నిబంధనలకు విరుద్ధంగా వ్యక్తిగత ఖాతాలకు చెల్లింపులు చేయవద్దని, ప్రతి లావాదేవీకి అధికారిక రసీదులు తీసుకోవాలని అధికారులు ప్రజలకు సూచిస్తున్నారు.

# హీరో ఛాన్స్ పేరుతో కోట్ల మోసం

**రూ.3.5 కోట్ల చీటింగ్ ఆరోపణలు**

**'పిల్ల జమిందార్' దర్శకుడిపై కేసు**

తెలుగు సినీ పరిశ్రమలో హీరోగా అవకాశం ఇప్పిస్తామని చెప్పి భారీ మొత్తంలో డబ్బులు తీసుకున్నారనే ఆరోపణలతో టాలీవుడ్‌లో సంచలనం రేగింది. ప్రముఖ చిత్రం 'పిల్ల జమిందార్' దర్శకుడు గుడ్లూరి అశోక్ బాబు, నిర్మాత విజయలక్ష్మిపై సైబరాబాద్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఓ యువకుడిని హీరోగా పరిచయం చేస్తామని నమ్మించి అతడి కుటుంబ సభ్యుల నుంచి విడతల వారీగా సుమారు రూ.3.5 కోట్లు తీసుకున్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. బాధితుల కథనం ప్రకారం, డబ్బులు తీసుకున్న తర్వాత చాలా కాలం గడిచినా సినిమా ప్రారంభించలేదని ఆరోపించారు. హీరోగా పరిచయం చేస్తామని ఇచ్చిన హామీ కూడా నెరవేర్చలేదని తెలిపారు. పలుమార్లు సంప్రదించినా సరైన సమాధానం ఇవ్వకపోవడంతో తాము మోసపోయామని గుర్తించామని చెప్పారు. అనంతరం చెల్లించిన డబ్బు తిరిగి ఇవ్వాలని కోరినా స్పందించలేదని ఆరోపించారు. బాధితుల ఫిర్యాదు ఆధారంగా సైబరాబాద్ ఆర్థిక నేరాల విభాగం కేసు నమోదు చేసింది. దర్శకుడు గుడ్లూరి అశోక్ బాబు, నిర్మాత విజయలక్ష్మిని అదుపులోకి తీసుకుని పోలీసులు విచారిస్తున్నట్లు సమాచారం. లావాదేవీలకు సంబంధించిన వివరాలు, ఇతర ఆధారాలను సేకరిస్తున్నారు. ఈ వ్యవహారంలో మరిన్ని విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. సినిమాల్లో అవకాశాల పేరుతో భారీ మొత్తంలో డబ్బులు తీసుకున్నారనే ఆరోపణలు టాలీవుడ్‌లో చర్చనీయాంశంగా మారాయి. ఈ కేసులో పోలీసుల దర్యాప్తు కొనసాగుతోంది. విచారణ అనంతరం వాస్తవాలు పూర్తిగా బయటకు వచ్చే అవకాశం ఉందని తెలుస్తోంది. సినీ అవకాశాల పేరుతో ఆర్థిక లావాదేవీలు చేసే సమయంలో అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచిస్తున్నారు.

ప్రభాత కిరణమ్
సత్యానికి వారధి

శనివారం 11 జులై 2026
www.prabhathakiranam.com

## వృత్తి గౌరవమే జర్నలిస్టుకు అసలైన గుర్తింపు

### మీడియాకు శ్రీనివాస్ రెడ్డి కీలక సందేశం

ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా నీతి, నిజాయితీ, నిర్భీతితో పనిచేసి వృత్తి గౌరవాన్ని కాపాడుకునే వారే నిజమైన జర్నలిస్టులని తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కె. శ్రీనివాస్ రెడ్డి అన్నారు. అలాంటి వారిని సమాజం ఎప్పటికీ గౌరవిస్తుందని ఆయన పేర్కొన్నారు. హైదరాబాద్ బషీర్‌బాగ్‌లోని సురవరం ప్రతాప్‌రెడ్డి ఆడిటోరియంలో తెలంగాణ వీడియో జర్నలిస్ట్స్ అసోసియేషన్ నిర్వహించిన కృతజ్ఞత సభలో ముఖ్య అతిథిగా పాల్గొని ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.

**అక్రెడిటేషన్ విలువ కాపాడాలి**

గతంలో అక్రెడిటేషన్ కార్డులను కొందరు అంగట్లో సరుకుగా మార్చి, దాని విలువ లేకుండా చేసారని, ఈ చర్య వల్ల సమాజంలో దుష్పరిణామాలు చోటు చేసుకున్నాయని శ్రీనివాస్ రెడ్డి విచారం వ్యక్తం చేసారు. అక్రెడిటేషన్ అనేది వృత్తి గౌరవాన్ని పెంచే విధంగా ఉండాలన్నారు. మీడియా రంగాన్ని కలుషితం చేస్తూ అపహాస్యానికి గురిచేస్తున్న వారిని గుర్తించి, వారికి తగిన గుణపాఠం చెప్పాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. .

**చట్టాలపై హెచ్చరిక**

మీడియా రంగంలో చోటుచేసుకుంటున్న పరిణామాలను కారణంగా చూపుతూ



జర్నలిస్టులు గతంలో సాధించుకున్న కొన్ని హక్కులు, సౌకర్యాలపై కేంద్ర ప్రభుత్వం కఠిన నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉందని శ్రీనివాస్ రెడ్డి హెచ్చరించారు. జర్నలిజం నిబద్ధతను నిరూపించగలిగితేనే ఆ హక్కులను కాపాడుకోవచ్చని చెప్పారు. వృత్తిపరమైన ప్రమాణాలు నిలబెట్టుకోవడం ద్వారా మాత్రమే మీడియాపై ప్రజల్లో విశ్వాసం పెరుగుతుందని వివరించారు.

## బద్వేలులో టీడీపీకి కొత్త ఊపు

### ఇంఛార్జిగా మంచూరు నియామకం

కడప జిల్లా బద్వేలు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇంఛార్జిగా మంచూరు సూర్యనారాయణ రెడ్డి నియామకం జరిగినట్లు పార్టీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. ఇటీవల ఆయన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడిని కలిసి నియోజకవర్గ రాజకీయ పరిస్థితులపై చర్చించినట్లు సమాచారం. బద్వేలులో పార్టీని మరింత బలోపేతం చేసి కార్యకర్తలను సమన్వయం చేసుకుంటూ ముందుకు వెళ్లాలని సీఎం సూచించినట్లు తెలుస్తోంది. మంత్రి నారా లోకేశ్ కూడా స్థానిక నాయకులు, కార్యకర్తలు మంచూరు సూర్యనారాయణ రెడ్డి నాయకత్వంలో సమష్టిగా పనిచేయాలని సూచించినట్లు సమాచారం. ఏపీ టీడీపీ అధ్యక్షుడు కూడా బద్వేలు నియోజకవర్గంలో పార్టీకి మళ్లీ పూర్వవైభవం తీసుకురావడంలో మంచూరు కీలక పాత్ర పోషిస్తారనే అభిప్రాయం వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. వైఎస్సార్‌సీపీకి బలమైన కంచుకోటగా భావించే బద్వేలు నియోజకవర్గంలో మంచూరు సూర్యనారాయణ రెడ్డి రాకతో రాజకీయ సమీకరణాలు మారే అవకాశం ఉందని పార్టీ శ్రేణులు భావిస్తున్నాయి. కొత్త నాయకత్వంతో కార్యకర్తల్లో ఉత్సాహం పెరిగిందని,



రాబోయే ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని పార్టీ మరింత దూకుడుగా పనిచేసే అవకాశాలు కనిపిస్తున్నాయని స్థానిక నాయకులు అభిప్రాయపడుతున్నారు.

# కేబినెట్‌లో కీలక నిర్ణయం

- సోషల్ మీడియాపై ఉక్కుపాదం
- ప్రత్యేక టాస్క్‌ఫోర్స్‌కు సీఎం ఆదేశాలు


వివరాలు5లో..

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సోషల్ మీడియా దుర్వినియోగాన్ని అరికట్టేందుకు కీలక నిర్ణయం తీసుకుంది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధ్యక్షతన జరిగిన కేబినెట్ సమావేశంలో ఈ అంశంపై విస్తృతంగా చర్చ జరిగింది. రాజకీయ నాయకులు, ప్రభుత్వంపై అసత్య ప్రచారం, పరువునష్టం కలిగించే పోస్టులు, తప్పుడు వార్తల వ్యాప్తిని కట్టడి చేయాలని ముఖ్యమంత్రి పోలీసు శాఖకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. చట్టాన్ని ఉల్లంఘించే వారిపై వేగంగా చర్యలు తీసుకునేలా ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేయాలని సూచించారు.

**• ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు**

సోషల్ మీడియా వేదికలపై జరుగుతున్న దుష్ప్రచారాన్ని పర్యవేక్షించేందుకు ప్రత్యేక టాస్క్‌ఫోర్స్‌ను వెంటనే ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ బృందం తప్పుడు సమాచారాన్ని గుర్తించడం, పరువునష్టం కలిగించే ప్రచారాన్ని అడ్డుకోవడం, చట్టవిరుద్ధ పోస్టులపై చర్యలు తీసుకోవడం వంటి బాధ్యతలు నిర్వహించనుంది. అవసరమైతే ప్రభుత్వానికి వెలుపల ఉన్న సాంకేతిక నిపుణుల సేవలను కూడా వినియోగించుకోవచ్చని కేబినెట్ అభిప్రాయపడింది.

## ఉపా కేసుపై విపక్ష పోరు

- ప్రశ్న రావణ్‌పై కేసు రద్దు చేయాలి
- ఐక్య ఉద్యమాలకు విపక్షాల పిలుపు
- రౌండ్‌టేబుల్‌లో ఏకగ్రీవ డిమాండ్

7లో..

## 30కిపైగా అంశాలకు ఆమోదం

### తాగునీటి నుంచి పర్యాటకం వరకు
### ఏపీ కేబినెట్ కీలక నిర్ణయాలకు గ్రీన్ సిగ్నల్

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన అమరావతిలో జరిగిన ఆంధ్రప్రదేశ్ మంత్రివర్గ సమావేశంలో 30కిపైగా కీలక అంశాలకు ఆమోదం లభించింది. గ్రామీణాభివృద్ధి, తాగునీటి సరఫరా, రాజధాని ప్రాంత రైతుల సంక్షేమం, విద్య, పర్యాటకం, పెట్టుబడులు, మౌలిక సదుపాయాల అభివృద్ధికి సంబంధించిన పలు ప్రతిపాదనలకు కేబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ప్రజలకు దీర్ఘకాలిక ప్రయోజనం కలిగించే పథకాలపై ప్రభుత్వం దృష్టి సారించినట్లు సమావేశ నిర్ణయాల ద్వారా స్పష్టమైంది. (వివరాలు 5లో..)

## రాజధాని రైతులకు గుడ్ న్యూస్

- అమరావతిపై కీలక నిర్ణయాలు
- రుణమాఫీ, యాన్యుటీ పెంపునకు గ్రీన్‌సిగ్నల్

మంత్రివర్గ సమావేశంలో అమరావతి రాజధాని ప్రాంతానికి సంబంధించిన పలు కీలక నిర్ణయాలకు ఆమోదం లభించింది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన జరిగిన సమావేశంలో రాజధాని రైతుల సంక్షేమానికి సంబంధించిన ప్రతిపాదనలను కేబినెట్ పరిశీలించి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. భూములు ఇచ్చిన రైతులకు యాన్యుటీ పెంపు, నిర్వాసిత కుటుంబాలకు ఆర్థిక సాయం పెంపు, భూసమీకరణ పరిధిలోని రైతులకు రుణమాఫీ అమలు వంటి అంశాలకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. (5లో..)



## ప్రజా సమస్యలు పక్కన పెట్టారు

### కేబినెట్‌పై అంబటి తీవ్ర విమర్శలు

వైఎస్సార్‌సీపీ నేత, మాజీ మంత్రి అంబటి రాంబాబు రాష్ట్ర ప్రభుత్వ కేబినెట్ సమావేశాలపై తీవ్ర విమర్శలు చేశారు. ప్రజల సమస్యల పరిష్కారం కోసం కాకుండా పోర్టులు, విలువైన భూములను తమకు అనుకూలంగా ఉన్న వారికి కేటాయించే ఉద్దేశంతోనే సమావేశాలు నిర్వహిస్తున్నారని ఆరోపించారు. కేబినెట్ సమావేశానికి ఐదుగురు మంత్రులు గైర్హాజరయ్యారని గుర్తు చేస్తూ, ప్రభుత్వం ఈ సమావేశాలను ఎంత నిర్లక్ష్యంగా తీసుకుంటోందో ఇదే నిదర్శనమని వ్యాఖ్యానించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలుపై చర్చించకుండా ఇతర అంశాలకే ప్రాధాన్యం ఇస్తున్నారని విమర్శించారు.
(వివరాలు 5లో..)



# ఇరాన్ టార్గెట్ నెం.1 నేనే

- ఏదో రోజు వాళ్లు సఫలం కావొచ్చు
- ట్రంప్ సంచలన ఆరోపణలు

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి ఇరాన్‌పై సంచలన వ్యాఖ్యలు చేశారు. ఇరాన్ చంపాలనుకుంటున్న హిట్ లిస్టులో తాను అగ్రస్థానంలో ఉన్నానని, ఇప్పటివరకు అదృష్టం కలిసి వచ్చిందని, అయితే అది ఎప్పటికీ కొనసాగకపోవచ్చని అన్నారు. టర్కీలో జరిగిన నాటో సదస్సు సందర్భంగా మీడియాతో మాట్లాడిన ట్రంప్, ఇరాన్ తనను హత్య చేయాలని చూస్తోందని ఆరోపించారు. "ప్రతి జాబితాలో నా పేరే ఉంది. ఇప్పటివరకు నేను అదృష్టవంతుడిని. కానీ అది ఎంతకాలం ఉంటుందో చెప్పలేను" అని వ్యాఖ్యానించారు. ఇటీవల అమెరికా ఇరాన్‌లోని పలు లక్ష్యాలపై దాడులు జరిపిన తర్వాత ఇరు దేశాల మధ్య ఉద్రిక్తతలు మరింత పెరిగాయి. ఇరాన్‌తో ఉన్న అవగాహన ప్రక్రియ ముగిసిపోయిందని ట్రంప్ ప్రకటిస్తూ, అక్కడి చర్చల ప్రతినిధులపై తీవ్ర విమర్శలు చేశారు. చర్చలు కొనసాగినా వాటి వల్ల ప్రయోజనం ఉండదనే అభిప్రాయం వ్యక్తం చేశారు. మరోవైపు, ఇరాన్ మాజీ అత్యున్నత నాయకుడి అంత్యక్రియల సందర్భంగా ట్రంప్, ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహుపై వ్యతిరేక నినాదాలు వినిపించాయి. ట్రంప్‌ను హత్య చేయాలని పిలుపునిచ్చే పోస్టర్లు, నినాదాలు కూడా అక్కడ కనిపించాయని అంతర్జాతీయ మీడియా వెల్లడించింది. ఈ పరిణామాలు అమెరికా–ఇరాన్ సంబంధాల్లో ఉద్రిక్తతలను మరింత పెంచే అవకాశముందని విశ్లేషకులు భావిస్తున్నారు.


7లో..

## వాట్ నెక్ట్స్

### కోడింగ్‌కు కౌంట్‌డౌన్.. ఏఐదే భవిష్యత్!
### ఐటీలో సమూల మార్పులకు రంగం సిద్ధం

కృత్రిమ మేధస్సు ప్రపంచాన్ని ఊహించని వేగంతో మార్చేస్తోంది. ఒకప్పుడు భద్రమైన ఉద్యోగంగా భావించిన కోడింగ్ రంగం కూడా ఇప్పుడు ఏఐ ప్రభావానికి గురవుతోంది. భవిష్యత్‌లో ముందుగా కోడింగ్ పనులు పూర్తిగా ఆటోమేట్ అవుతాయని, ఆ తర్వాత సాఫ్ట్‌వేర్ ఇంజినీరింగ్‌లోని చాలా బాధ్యతలను కూడా ఏఐ నిర్వహించే స్థాయికి చేరుకుంటుందని ఆంత్రోపిక్ సీఈఓ డారియో అమోడీ పేర్కొన్నారు. అయితే మానవ ఆలోచన, సృజనాత్మకత, నిర్ణయ సామర్థ్యానికి ఇప్పటికీ ప్రత్యేక స్థానం ఉంటుందని స్పష్టం చేశారు. ఏఐతో పోటీ పడటం కంటే దాన్ని సమర్థంగా వినియోగించడం నేర్చుకుంటేనే భవిష్యత్‌లో విజయావకాశాలు ఎక్కువగా ఉంటాయని ఆయన యువతకు సూచించారు.


7లో..

## ఎలక్టోరల్ ఆటోక్రసీ

### ప్రతిపక్షాల వ్యూహంపై చర్చ
### భారత ప్రజాస్వామ్యంపై కొత్త వాదన
### విక్షాలకు యోగేంద్ర యాదవ్ సూచనలు

భారత ప్రజాస్వామ్య వ్యవస్థపై అంతర్జాతీయ స్థాయిలో జరుగుతున్న చర్చలకు తాజాగా రాజకీయ విశ్లేషకుడు యోగేంద్ర యాదవ్ వ్యాఖ్యలు మరింత ప్రాధాన్యం తెచ్చాయి. భారత రాజకీయ పరిస్థితిని కొన్ని అంతర్జాతీయ ప్రజాస్వామ్య పరిశోధనా సంస్థలు 'ఎలక్టోరల్ ఆటోక్రసీ'గా అభివర్ణిస్తున్న నేపథ్యంలో ప్రతిపక్ష పార్టీలు తమ రాజకీయ వ్యూహాలను పూర్తిగా మార్చుకోవాల్సిన అవసరం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. ప్రస్తుతం అమలులో ఉన్న సంప్రదాయ ఎన్నికల రాజకీయాలు మాత్రమే సరిపోవని స్పష్టం చేశారు.


5లో..

## ఎన్నికల బహిష్కరణ కాదు

### పోరాట రాజకీయాలే మార్గం
### ప్రతిపక్షాలకు యాదవ్ మూడు పాఠాలు

దేశంలో ఎన్నికల నిర్వహణ, ప్రజాస్వామ్య పరిస్థితులపై జరుగుతున్న చర్చల మధ్య రాజకీయ విశ్లేషకుడు యోగేంద్ర యాదవ్ కీలక అభిప్రాయాలు వ్యక్తం చేశారు. ఎన్నికలు పూర్తిగా నిష్పక్షపాతంగా లేవనే భావన పెరుగుతున్నా, వాటిని బహిష్కరించడం సరైన పరిష్కారం కాదని పేర్కొన్నారు. ఎన్నికల్లో లోపాలు ఉన్నాయని భావిస్తే వాటిని ప్రజల ముందుకు తీసుకెళ్లే రాజకీయ పోరాటమే అవసరమని సూచించారు. ఎన్నికల బహిష్కరణ ఒక ప్రశ్న కావొచ్చు కానీ ప్రస్తుతం అది సరైన సమాధానం కాదని ఆయన అభిప్రాయపడ్డారు.


7లో..

## రావణ్‌కు వైసీపీ సపోర్ట్

• సాక్ష్యాధారాలున్నాయ్ • మంత్రి కందుల దుర్గేశ్

యూట్యూబర్ బచ్చలకూరి జోసెఫ్ అలియాస్ రావణ్ వ్యవహారం వెనుక వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఉందని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేశ్ ఆరోపించారు. విజయవాడలోని తన క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ రావణ్‌కు వైసీపీ నాయకత్వం నుంచి మద్దతు లభిస్తోందని పేర్కొన్నారు. ఈ వ్యవహారం వెనుక రాజకీయ కుట్ర ఉందని ఆరోపిస్తూ పలు అంశాలను ప్రస్తావించారు.

# ఏపీ పెట్టుబడుల వేట

### ప్రపంచ ప్రసిద్ధ కంపెనీలతో లోకేశ్ చర్చలు
### సియోల్‌లో ఏపీ పెట్టుబడులపై ప్రచారం


7లో..

ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడులను భారీ స్థాయిలో ఆకర్షించాలనే లక్ష్యంతో రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ దక్షిణ కొరియా పర్యటనలో దూకుడు ప్రదర్శించారు. సియోల్‌లో నిర్వహించిన సీఐఐ పార్ట్‌నర్‌షిప్ సమ్మిట్ రోడ్‌షోలో పాల్గొని కొరియా పారిశ్రామికవేత్తలకు ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న పెట్టుబడి అవకాశాలను వివరించారు. ఏపీ–కొరియా భాగస్వామ్యం కొత్త దశలోకి అడుగుపెడుతోందని పేర్కొంటూ, పెట్టుబడిదారులతో దీర్ఘకాలిక భాగస్వామ్యాలే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. కియా మోటార్స్ పెట్టుబడి ఏపీపై కొరియా సంస్థలకు ఉన్న విశ్వాసానికి నిదర్శనమని చెప్పారు.

## కొడాలి చుట్టూ కేసుల ఉచ్చు

- ఫిర్యాదులతో కొత్త పరిణామం
- రాజకీయ వేడి మరింత పెరుగుతోందా?

మాజీ మంత్రి కొడాలి నాని చుట్టూ రాజకీయ పరిణామాలు వేగంగా మారుతున్నాయి. ఉపా చట్టాన్ని అపహాస్యం చేశారనే ఆరోపణలు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌పై చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో తెలుగుదేశం పార్టీ నాయకులు విజయవాడ వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరారు. ఇదే సమయంలో ప్రభుత్వాన్ని విమర్శించే వారిపై మరింత కఠిన చర్యలు తీసుకోవాలనే అంశంపై రాష్ట్ర కేబినెట్‌లో చర్చ జరిగినట్లు సమాచారం. సోషల్ మీడియా కార్యకలాపాలపై ప్రత్యేకంగా పవర్ పాయింట్ ప్రజెంటేషన్ నిర్వహించారు. అనంతరం ప్రత్యేక టాస్క్ ఫోర్స్ ఏర్పాటు చేయాలని కేబినెట్ నిర్ణయించింది.


5లో..



## దటీజ్ విజయ్

### కరూర్‌లో సీఎం భావోద్వేగం..
### జననాయగన్ చారిత్రాత్మక నిర్ణయం
### ఉద్యోగాలు, స్మారక చిహ్నం ప్రకటన
### హైకోర్టు గ్రీన్ సిగ్నల్‌తో ఉద్యోగాల పంపిణీ

తమిళనాడు ముఖ్యమంత్రి, తమిళగ వెట్రి కళగం అధ్యక్షుడు సి. జోసెఫ్ విజయ్ కరూర్ పర్యటనకు ముందు కీలక న్యాయ పరిణామం చోటుచేసుకుంది. 2025లో కరూర్ తొక్కిసలాటలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబ సభ్యులకు ప్రభుత్వ ఉద్యోగ నియామక పత్రాలు అందజేసే కార్యక్రమానికి మద్రాస్ హైకోర్టు మదురై ధర్మాసనం అనుమతి ఇచ్చింది. (వివరాలు 7లో..)

## ఏపీ జేఏసీ ఉద్యమానికి ప్రభుత్వ స్పందన

### మంత్రుల కమిటీతో నేడు కీలక చర్చలు

రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు, కాంట్రాక్ట్ సిబ్బంది, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం ఏపీ జేఏసీ అమరావతి చేపట్టిన ఉద్యమానికి ప్రభుత్వం స్పందించింది. ఉద్యోగ సంఘాలు ప్రకటించిన ఉద్యమ కార్యాచరణ నేపథ్యంలో ప్రభుత్వం చర్చలకు ముందుకు వచ్చింది. రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్, రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్ ఆధ్వర్యంలో ఏపీ జేఏసీ అమరావతి ప్రతినిధులతో తొలి సమావేశం నిర్వహించారు. ఉద్యోగుల ప్రధాన డిమాండ్లపై విస్తృతంగా చర్చించినట్లు జేఏసీ వెల్లడించింది. (7లో..)



## రామాలయ విరాళాల కేసు

• విచారించనున్న సీజేఐ బెంచ్ • సుప్రీంకోర్టులో 13న కీలక విచారణ



అయోధ్య శ్రీరామాలయానికి భక్తులు సమర్పించిన విరాళాల దుర్వినియోగం జరిగిందనే ఆరోపణలపై దాఖలైన పిటిషన్లను సుప్రీంకోర్టు జూలై 13న విచారించనుంది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ముగ్గురు సభ్యుల ధర్మాసనం ఈ కేసును పరిశీలించనుంది. వేసవి సెలవుల అనంతరం సుప్రీంకోర్టు తిరిగి ప్రారంభమైన తర్వాత ఈ అంశం మొదటిసారిగా విచారణకు రానుండటంతో దేశవ్యాప్తంగా ఆసక్తి నెలకొంది.

**మూడు పిటిషన్లు విచారణకు**

ఈ కేసులో మూడు వేర్వేరు పిటిషన్లు ఒకేసారి విచారణకు రానున్నాయి. విరాళాల వ్యవహారంపై సీబీఐ దర్యాప్తు చేపట్టాలని ఒక పిటిషన్ కోరుతోంది. ఎలక్ట్రానిక్ ఆధారాలను భద్రపరచాలని మరో పిటిషన్ విజ్ఞప్తి చేసింది. శ్రీరామ జన్మభూమి తీర్థక్షేత్ర ట్రస్ట్ ఆర్థిక లావాదేవీల పూర్తి వివరాలను ప్రజలకు వెల్లడించాలని మరో పిటిషన్ కోరుతోంది. ఈ అంశాలన్నింటినీ సుప్రీంకోర్టు సమగ్రంగా పరిశీలించనుంది. రాష్ట్రీయ జనతాదళ్ ఎంపీ సుధాకర్ సింగ్ దాఖలు చేసిన పిటిషన్‌లో ట్రస్ట్ ఏర్పడినప్పటి నుంచి అందిన నగదు, బ్యాంకు బదిలీలు, డిజిటల్ చెల్లింపులు, విదేశీ విరాళాలు, బంగారం, వెండి, ఇతర విలువైన కానుకల పూర్తి లెక్కలను సమర్పించాలని కోరారు. ఆ నిధులు ఎలా భద్రపరిచారు, ఎలా వినియోగించారు అనే వివరాలను కూడా వెల్లడించాలని విజ్ఞప్తి చేశారు. ప్రజల విశ్వాసాన్ని కాపాడేందుకు పారదర్శకత అత్యంత అవసరమని పిటిషన్‌లో పేర్కొన్నారు. (వివరాలు 5లో..)

# 30కిపైగా అంశాలకు ఆమోదం

- తాగునీటి నుంచి పర్యాటకం
- ఏపీ కేబినెట్ కీలక నిర్ణయాలకు గ్రీన్ సిగ్నల్



ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన అమరావతిలో జరిగిన ఆంధ్రప్రదేశ్ మంత్రివర్గ సమావేశంలో 30కిపైగా కీలక అంశాలకు ఆమోదం లభించింది. గ్రామీణాభివృద్ధి, తాగునీటి సరఫరా, రాజధాని ప్రాంత రైతుల సంక్షేమం, విద్య, పర్యాటకం, పెట్టుబడులు, మౌలిక సదుపాయాల అభివృద్ధికి సంబంధించిన పలు ప్రతిపాదనలకు కేబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ప్రజలకు దీర్ఘకాలిక ప్రయోజనం కలిగించే పథకాలపై ప్రభుత్వం దృష్టి సారించినట్లు సమావేశ నిర్ణయాల ద్వారా స్పష్టమైంది.

### తాగునీటి పథకాలకు భారీ నిధులు

గ్రామాల్లో తాగునీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు రూ.9,355 కోట్ల వ్యయంతో 10 భారీ మల్టీ విలేజ్ డ్రింకింగ్ వాటర్ స్కీమ్‌లను చేపట్టాలని కేబినెట్ నిర్ణయించింది. నీటి ఎద్దడి ఎక్కువగా ఉన్న ప్రాంతాల కోసం రూ.1,811 కోట్లతో 2,943 తాగునీటి పథకాలకు కూడా ఆమోదం తెలిపింది. పెద్దగెడ్డ రిజర్వాయర్ కమాండ్ ఏరియా ఆధునికీకరణకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. కుప్పంలోని ఫీడర్ ఛానెల్స్, బీరగానిపల్లె రిజర్వాయర్ అభివృద్ధి పనులకు కూడా అనుమతి లభించింది.

### రైతులకు ఊరట కలిగించే నిర్ణయాలు

రాజధాని అమరావతి రెండో విడత భూసమీకరణలో భాగంగా భూములు ఇచ్చిన ఏడు గ్రామాల రైతులకు సాగు రుణాల మాఫీకి కేబినెట్ ఆమోదం తెలిపింది. 2026 జనవరి 6కు ముందు తీసుకున్న రుణాలకు రూ.1.50 లక్షల వరకు మాఫీ వర్తించనుంది. భూములు ఇచ్చిన రైతులకు చెల్లించే వార్షిక కౌలు మొత్తాన్ని కూడా ప్రభుత్వం పెంచింది. మెట్ట భూములకు అదనంగా రూ.3 వేల చొప్పున, జరీబు భూములకు రూ.5 వేల చొప్పున పెంపు ఇవ్వనుంది. దీంతో మెట్ట భూముల కౌలు రూ.40 వేలకు, జరీబు భూముల కౌలు రూ.60 వేలకు చేరనుంది.

### భూకేటాయింపులు, పరిశ్రమలకు ప్రోత్సాహం

రెండో విడత భూసమీకరణ పరిధిలోని 307 ఎకరాల ఇనాం భూములకు దేవాదాయ శాఖకు రూ.159 కోట్ల పరిహారం చెల్లించేందుకు కేబినెట్ ఆమోదించింది. సీఆర్డీఏ పరిధిలో పలు సంస్థలకు భూకేటాయింపులు చేయాలని నిర్ణయించింది. ఈశా ఫౌండేషన్, ఆర్ట్ ఆఫ్ లివింగ్, సీఐఐ గ్లోబల్ లీడర్‌షిప్ సెంటర్, ఎన్ఎఫ్‌డీబీ భారీ అక్వేరియం కార్యాలయానికి స్థలాలు కేటాయించనుంది. తిరుపతి జిల్లాలో లాజిస్టిక్స్ పార్క్ ఏర్పాటుపై కూడా చర్చించింది. భారీ పెట్టుబడులను ఆకర్షించే ప్రతిపాదనలకు ప్రోత్సాహకాలు అందించాలని నిర్ణయించింది.

### పర్యాటకం, విద్యకు ప్రాధాన్యం

రాష్ట్రంలో పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేసేందుకు కొత్త విధానానికి కేబినెట్ ఆమోదం తెలిపింది. భారీ సంగీత, సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణకు ప్రత్యేక పాలసీ తీసుకురానుంది. పర్యాటక ప్రచారం కోసం రూ.50 కోట్లు కేటాయించింది. నెల్లూరు, కడప, విజయవాడలోని హోటళ్లకు ప్రత్యేక ప్రోత్సాహకాలు ఇవ్వాలని నిర్ణయించింది. కడపలో ఇంటిగ్రేటెడ్ ఎంటర్‌టైన్‌మెంట్ పార్క్ ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది.

### విద్య, భద్రత రంగాలకు ఊతం

విశాఖపట్నం, గుంటూరు, నెల్లూరు జిల్లాల్లో అంబేడ్కర్ గురుకుల సెంటర్స్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటు చేయాలని కేబినెట్ నిర్ణయించింది. ఐఐటీజేఈఈ, నీట్ పరీక్షలకు విద్యార్థులకు రెసిడెన్షియల్ కోచింగ్ అందించే ప్రతిపాదనకు ఆమోదం తెలిపింది. విశాఖపట్నంలో జాతీయ దర్యాప్తు సంస్థ ప్రత్యేక కోర్టు ఏర్పాటుకు కూడా గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది.

# రాజధాని రైతులకు గుడ్ న్యూస్

- అమరావతిపై కీలక నిర్ణయాలు
- రుణమాఫీ, యాన్యుటీ పెంపునకు గ్రీన్‌సిగ్నల్

మంత్రివర్గ సమావేశంలో అమరావతి రాజధాని ప్రాంతానికి సంబంధించిన పలు కీలక నిర్ణయాలకు ఆమోదం లభించింది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన జరిగిన సమావేశంలో రాజధాని రైతుల సంక్షేమానికి సంబంధించిన ప్రతిపాదనలను కేబినెట్ పరిశీలించి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. భూములు ఇచ్చిన రైతులకు యాన్యుటీ పెంపు, నిర్వాసిత కుటుంబాలకు ఆర్థిక సాయం పెంపు, భూసమీకరణ పరిధిలోని రైతులకు రుణమాఫీ అమలు వంటి అంశాలకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది.

### యాన్యుటీ పెంపుకు ఆమోదం

రాజధాని నగర భూసమీకరణ పథకం కింద భూములు ఇచ్చిన రైతులకు చెల్లించే వార్షిక యాన్యుటీని పెంచాలని ప్రభుత్వం నిర్ణయించింది. 2024 జూన్ 12 లేదా ఆ తర్వాత డీడ్ ఆఫ్ కాంట్రాక్ట్ అమలు చేసిన భూయజమానులకు ఈ పెంపు వర్తించనుంది. మెట్ట భూములకు ఎకరానికి ఇప్పటి వరకు ఉన్న రూ.30 వేల యాన్యుటీని రూ.40 వేలకు పెంచారు. జరీబు భూములకు ఎకరానికి రూ.50 వేల నుంచి రూ.60 వేలకు పెంచేందుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. దీనికి అనుగుణంగా ల్యాండ్ పూలింగ్ స్కీమ్ నిబంధనల్లో సవరణలు చేయనున్నారు.

### రైతులకు రుణమాఫీ, రెట్టింపు సాయం

రాజధాని ప్రాజెక్టు కారణంగా నిర్వాసితులైన 634 కుటుంబాలకు ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. ప్రస్తుతం నెలకు రూ.5 వేలుగా ఉన్న జీవనభృతి, అద్దె సాయాన్ని రూ.10 వేలకు పెంచాలని మంత్రివర్గం నిర్ణయించింది. ఈ పెంపు 12 నెలల పాటు అమలులో ఉంటుంది. నిర్వాసిత కుటుంబాలు ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కోకుండా ఆదుకోవాలనే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రభుత్వం తెలిపింది. భూసమీకరణ పథకం పరిధిలోని గుంటూరు, పల్నాడు జిల్లాల ఏడు గ్రామాల రైతులకు రుణమాఫీ అమలు చేయాలని కేబినెట్ ఆమోదించింది. ఈ పథకానికి సంబంధించిన మార్గదర్శకాలను రూపొందించే బాధ్యతను ఏపీ సీఆర్డీఏ కమిషనర్‌కు అప్పగించింది. అర్హులైన రైతులను గుర్తించేందుకు 2026 జనవరి 6ను కటాఫ్ తేదీగా నిర్ణయించింది. ఆ తేదీ వరకు ఉన్న బకాయి వ్యవసాయ రుణాలనే ఈ పథకంలో పరిగణనలోకి తీసుకోనున్నారు.

### రైతులకు మరింత భరోసా

రాజధాని నిర్మాణంలో భూములు ఇచ్చిన రైతులకు ఆర్థిక భరోసా కల్పించడమే ఈ నిర్ణయాల ప్రధాన ఉద్దేశమని ప్రభుత్వం భావిస్తోంది. యాన్యుటీ పెంపు వల్ల రైతులకు ప్రతి సంవత్సరం అధిక ఆదాయం లభించనుంది. రుణమాఫీ అమలు వల్ల అప్పుల భారం తగ్గే అవకాశం ఉంది. నిర్వాసిత కుటుంబాలకు జీవనభృతి పెంపు కూడా ఉపశమనంగా మారనుంది. రాజధాని ప్రాంత అభివృద్ధిని వేగవంతం చేయడంతో పాటు రైతుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం ఈ నిర్ణయాలు తీసుకుంది. భూసమీకరణలో భాగస్వాములైన రైతుల ప్రయోజనాలను కాపాడే దిశగా కేబినెట్ కీలక నిర్ణయాలు తీసుకోవడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ నిర్ణయాల అమలుతో అమరావతి ప్రాంత రైతులకు ఆర్థికంగా మరింత మద్దతు లభిస్తుందని ప్రభుత్వం భావిస్తోంది.

# కేబినెట్‌లో కీలక నిర్ణయం

- సోషల్ మీడియాపై ఉక్కుపాదం
- ప్రత్యేక టాస్క్‌ఫోర్స్‌కు సీఎం ఆదేశాలు

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సోషల్ మీడియా దుర్వినియోగాన్ని అరికట్టేందుకు కీలక నిర్ణయం తీసుకుంది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధ్యక్షతన జరిగిన కేబినెట్ సమావేశంలో ఈ అంశంపై విస్తృతంగా చర్చ జరిగింది. రాజకీయ నాయకులు, ప్రభుత్వంపై అసత్య ప్రచారం, పరువునష్టం కలిగించే పోస్టులు, తప్పుడు వార్తల వ్యాప్తిని కట్టడి చేయాలని ముఖ్యమంత్రి పోలీసు శాఖకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. చట్టాన్ని ఉల్లంఘించే వారిపై వేగంగా చర్యలు తీసుకునేలా ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేయాలని సూచించారు.

### ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు

సోషల్ మీడియా వేదికలపై జరుగుతున్న దుష్ప్రచారాన్ని పర్యవేక్షించేందుకు ప్రత్యేక టాస్క్‌ఫోర్స్‌ను వెంటనే ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ బృందం తప్పుడు సమాచారాన్ని గుర్తించడం, పరువు నష్టం కలిగించే ప్రచారాన్ని అడ్డుకోవడం, చట్టవిరుద్ధ పోస్టులపై చర్యలు తీసుకోవడం వంటి బాధ్యతలు నిర్వహించనుంది. అవసరమైతే ప్రభుత్వానికి వెలుపల ఉన్న సాంకేతిక నిపుణుల సేవలను కూడా వినియోగించుకోవచ్చని కేబినెట్ అభిప్రాయపడింది.

### పోలీసుల ప్రజెంటేషన్

కేబినెట్ సమావేశంలో డీజీపీ హరీశ్ కుమార్ గుప్తాతో పాటు ఉన్నతాధికారులు సోషల్ మీడియా దుర్వినియోగం, సైబర్ నేరాలు, తప్పుడు సమాచార వ్యాప్తిపై సమగ్ర ప్రజెంటేషన్ ఇచ్చారు. ప్రస్తుతం ఎదురవుతున్న సవాళ్లు, వాటిని ఎదుర్కొనే మార్గాలను వివరించారు. ఈ నేపథ్యంలో సైబర్ నేరాలపై పూర్తిస్థాయిలో దృష్టి పెట్టేందుకు ఇన్‌స్పెక్టర్ జనరల్ హోదా కలిగిన ప్రత్యేక అధికారిని నియమించాలని కూడా ప్రభుత్వం నిర్ణయించింది.

### భావ వ్యక్తీకరణకు గౌరవం

భావ వ్యక్తీకరణ స్వేచ్ఛకు ప్రభుత్వం పూర్తిగా గౌరవం ఇస్తుందని కేబినెట్ స్పష్టం చేసింది. అయితే ఆ స్వేచ్ఛ పేరుతో అసభ్యకర వ్యాఖ్యలు చేయడం, వ్యక్తిత్వ హననానికి పాల్పడడం, చట్టవిరుద్ధ ప్రచారం చేయడం సహించబోమని పేర్కొంది. చట్టాన్ని అతిక్రమించే ప్రతి ఘటనపై పోలీసు శాఖ వెంటనే స్పందించాలని ముఖ్యమంత్రి అధికారులకు ఆదేశాలు ఇచ్చారు.

### రాజకీయ ఆరోపణలపై స్పందన

సోషల్ మీడియాలో కొందరు ఉద్దేశపూర్వకంగా కులాల పేరుతో విభజన సృష్టించే ప్రయత్నాలు చేస్తున్నారని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆరోపించారు. రాజకీయ ప్రయోజనాల కోసం తప్పుడు కథనాలు ప్రచారం చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. అధికార కూటమి నాయకులు రెచ్చగొట్టే వ్యాఖ్యలకు ప్రతిస్పందించకుండా సంయమనం పాటించాలని కూడా ఆయన సూచించారు. చట్టపరమైన పరిధిలోనే వ్యవహరించాలని స్పష్టం చేశారు.

### సైబర్ నేరాలపై ప్రత్యేక దృష్టి

సైబర్ నేరాలను సమర్థంగా ఎదుర్కొనేందుకు ప్రత్యేక యంత్రాంగాన్ని బలోపేతం చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. సోషల్ మీడియా వేదికలపై జరిగే నేరాలను వేగంగా గుర్తించి చర్యలు తీసుకునే విధంగా వ్యవస్థను రూపొందించనుంది. వాట్సాప్ వంటి వేదికల్లో ప్రతిపాదిత యూజర్‌నేమ్ ఫీచర్ దుర్వినియోగానికి అవకాశం కల్పించే ప్రమాదం ఉందని డీజీపీ కేబినెట్ దృష్టికి తీసుకువచ్చినట్లు సమాచారం. మొత్తం మీద సోషల్ మీడియా ద్వారా వ్యాపిస్తున్న తప్పుడు ప్రచారం, పరువునష్టం కలిగించే కంటెంట్, సైబర్ నేరాలపై మరింత కఠిన వైఖరితో ముందుకు వెళ్లాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది.



# ఎన్నికల బహిష్కరణ కాదు

- పోరాట రాజకీయాలే మార్గం
- ప్రతిపక్షాలకు యాదవ్ 3 పాఠాలు

దేశంలో ఎన్నికల నిర్వహణ, ప్రజాస్వామ్య పరిస్థితులపై జరుగుతున్న చర్చల మధ్య రాజకీయ విశ్లేషకుడు యోగేంద్ర యాదవ్ కీలక అభిప్రాయాలు వ్యక్తం చేశారు. ఎన్నికలు పూర్తిగా నిష్పక్షపాతంగా లేవనే భావన పెరుగుతున్నా, వాటిని బహిష్కరించడం సరైన పరిష్కారం కాదని పేర్కొన్నారు. ఎన్నికల్లో లోపాలు ఉన్నాయని భావిస్తే వాటిని ప్రజల ముందుకు తీసుకెళ్లే రాజకీయ పోరాటమే అవసరమని సూచించారు. ఎన్నికల బహిష్కరణ ఒక ప్రశ్న కావొచ్చు కానీ ప్రస్తుతం అది సరైన సమాధానం కాదని ఆయన అభిప్రాయపడ్డారు.

### ప్రజాస్వామ్యంలో ఎన్నికల ప్రాధాన్యం

యోగేంద్ర యాదవ్ అభిప్రాయం ప్రకారం ఎన్నికలు కేవలం ప్రభుత్వాలను ఎన్నుకునే ప్రక్రియ మాత్రమే కాదు. విభిన్న అభిప్రాయాలు కలిగిన సమాజంలో శాంతియుతంగా అధికార మార్పిడికి అవి కీలక వేదికగా ఉంటాయి. అధికారంలో ఉన్నవారు ఓడిపోయే అవకాశం ఉండటం, ప్రతిపక్షాలు గెలిచే అవకాశం కొనసాగడం ప్రజాస్వామ్య బలానికి సూచికగా పేర్కొన్నారు. 1977లో అత్యవసర పరిస్థితి తర్వాత జరిగిన ఎన్నికలను ఆయన ఇందుకు ఉదాహరణగా ప్రస్తావించారు.

### ప్రతిపక్షాలకు 3 ప్రధాన సూచనలు

ప్రతిపక్షాలు ఎన్నికలను బహిష్కరించకుండా ప్రజల మధ్యకు వెళ్లాలని యాదవ్ సూచించారు. ఎన్నికల ప్రక్రియలో లోపాలు ఉన్నాయని భావిస్తే వాటిపై ప్రజల్లో అవగాహన కల్పించాల్సిన బాధ్యత ప్రతిపక్షాలదేనని చెప్పారు. ఎన్నికల సమయంలో ప్రజలను కలవడం, కొత్త కార్యకర్తలను తయారు చేయడం, పార్టీని బలోపేతం చేయడం, భవిష్యత్ నాయకత్వాన్ని పెంచడం వంటి అవకాశాలు లభిస్తాయని వివరించారు. ఈ వేదికను వదులుకోవడం వ్యూహాత్మకంగా కూడా సరైన నిర్ణయం కాదని అభిప్రాయపడ్డారు.

### ప్రపంచ దేశాల పాఠాలు

ప్రపంచ దక్షిణ దేశాల్లోని అనేక ప్రజాస్వామ్య అనుభవాల నుంచి భారత్ నేర్చుకోవాల్సిన అవసరం ఉందని యోగేంద్ర యాదవ్ పేర్కొన్నారు. బెలారస్ వంటి దేశాల్లో ప్రతిపక్షాలు ఎన్నికల్లో విజయం సాధించకపోయినా ప్రజాభిప్రాయాన్ని వెలుగులోకి తీసుకురావడం, ఎన్నికల లోపాలను బయటపెట్టడం, ప్రజాస్వామ్య విలువలను కాపాడేందుకు ఉద్యమాలను నిర్మించడం వంటి అంశాల్లో విజయవంతమయ్యాయని వివరించారు. ఎన్నికల బహిష్కరణ నిర్ణయం తీసుకునే ముందు ప్రజలకు నిజాలు తెలియజేసే అవకాశాలు ఇంకా ఉన్నాయా లేదా అన్నదే ప్రధాన ప్రమాణంగా చూడాలని సూచించారు.
సందే ఏక దటిబీ కీకాం
ఎన్నికల వ్యవస్థలో ఎలాంటి లోపాలు ఉన్నా ప్రజల్లో బలమైన వ్యతిరేకత ఏర్పడితే అధికార మార్పు సాధ్యమేనని యోగేంద్ర యాదవ్ అభిప్రాయపడ్డారు. ప్రజా ఉద్యమం బలపడితే ఎన్నికల ఫలితాలపై కూడా ప్రభావం చూపగలదని పేర్కొన్నారు. హంగేరీలో జరిగిన రాజకీయ మార్పులను, భారతదేశంలో 1977 ఎన్నికల ఫలితాలను ఉదాహరణగా ప్రస్తావించారు. ప్రజల మద్దతు పెరిగితే ఎంత బలమైన అధికార వ్యవస్థ అయినా మార్పును అడ్డుకోలేదని అన్నారు.

### చర్చకు దారితీసిన వ్యాసం

యోగేంద్ర యాదవ్ అభిప్రాయాలు రాజకీయ వర్గాల్లో కొత్త చర్చకు కారణమయ్యాయి. ఎన్నికల్లో పాల్గొనాలా, బహిష్కరించాలా అనే ప్రశ్న కంటే ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయడానికి ప్రతిపక్షాలు ఏ విధంగా పనిచేయాలనే అంశంపైనే దృష్టి పెట్టాలని ఆయన సూచించారు. ఎన్నికల వేదికను ప్రజలతో సంభాషించే అవకాశంగా ఉపయోగించుకోవాలని, ప్రజాస్వామ్య విలువలను కాపాడే నిరంతర రాజకీయ పోరాటాన్ని కొనసాగించాలని అభిప్రాయపడ్డారు.

# ప్రజా సమస్యలు పక్కన పెట్టారు

### కేబినెట్‌పై అంబటి తీవ్ర విమర్శలు

వైఎస్సార్‌సీపీ నేత, మాజీ మంత్రి అంబటి రాంబాబు రాష్ట్ర ప్రభుత్వ కేబినెట్ సమావేశాలపై తీవ్ర విమర్శలు చేశారు. ప్రజల సమస్యల పరిష్కారం కోసం కాకుండా పోర్టులు, విలువైన భూములను తమకు అనుకూలంగా ఉన్న వారికి కేటాయించే ఉద్దేశంతోనే సమావేశాలు నిర్వహిస్తున్నారని ఆరోపించారు. కేబినెట్ సమావేశానికి ఐదుగురు మంత్రులు గైర్హాజరయ్యారని గుర్తు చేస్తూ, ప్రభుత్వం ఈ సమావేశాలను ఎంత నిర్లక్ష్యంగా తీసుకుంటోందో ఇదే నిదర్శనమని వ్యాఖ్యానించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలుపై చర్చించకుండా ఇతర అంశాలకే ప్రాధాన్యం ఇస్తున్నారని విమర్శించారు.



### సోషల్ మీడియాపై ప్రభుత్వ వైఖరి

కేబినెట్ సమావేశంలో డీజీపీ సోషల్ మీడియాపై ప్రత్యేక ప్రజెంటేషన్ ఇవ్వడాన్ని అంబటి ప్రశ్నించారు. సోషల్ మీడియాను నియంత్రించేందుకు టాస్క్ ఫోర్స్ ఏర్పాటు చేయడం వెనుక రాజకీయ ఉద్దేశాలు ఉన్నాయని ఆరోపించారు. అధికార పార్టీకి అనుకూలంగా పనిచేసే వ్యక్తులు సామాజిక మాధ్యమాల్లో వైఎస్సార్‌సీపీ నాయకులపై వ్యక్తిత్వ హననానికి పాల్పడుతున్నారని అన్నారు. అలాంటి ఫిర్యాదులపై చర్యలు తీసుకోకుండా, తమ పార్టీ నాయకులపై మాత్రం పెద్ద సంఖ్యలో కేసులు నమోదు చేసి అరెస్టులు చేశారని విమర్శించారు. ప్రభుత్వం విమర్శలను తట్టుకోలేక సోషల్ మీడియాను లక్ష్యంగా చేసుకుందని అన్నారు.

### చట్టాల అమలుపై విమర్శలు

రావణ్ కేసులో వరుసగా బెయిల్ లభించిన తర్వాతే ఉపా చట్టాన్ని ప్రయోగించడం సరైన విధానం కాదని అంబటి రాంబాబు అన్నారు. తీవ్రవాద కార్యకలాపాలకు ఉపయోగించాల్సిన చట్టాన్ని సాధారణ వ్యక్తులపై అమలు చేయడం తగదని అభిప్రాయపడ్డారు. రావణ్‌కు వైఎస్సార్‌సీపీతో ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. అయితే న్యాయం కోసం సహాయం కోరిన వారికి చట్టబద్ధమైన న్యాయ సహాయం అందించడం తప్పు కాదని పేర్కొన్నారు. టీడీపీ కార్యకర్త అయినా, ఇతర పార్టీ వ్యక్తి అయినా బాధితుడిగా భావిస్తే సహాయం చేస్తామని చెప్పారు.

### శాంతిభద్రతలపై ఆందోళన

రాష్ట్రంలో జరిగిన పలు ఘటనలపై ప్రభుత్వం స్పందించడం లేదని అంబటి ఆరోపించారు. గాదె సాయికృష్ణ లాకప్ మరణం, క్రాంతికుమార్ ఆత్మహత్య, ఇతర వివాదాస్పద సంఘటనలపై కేబినెట్‌లో చర్చ జరగలేదని అన్నారు. పోలీసులపై దాడులు జరిగినా నిందితులపై చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. అధికార పార్టీకి చెందిన వారిపై చట్టం ఒకలా, ప్రతిపక్షాలపై మరోలా అమలవుతోందని ఆరోపించారు. ప్రజల భద్రత కంటే రాజకీయ లక్ష్యాలకే ప్రభుత్వం ఎక్కువ ప్రాధాన్యం ఇస్తోందని అన్నారు.

### డైవర్షన్ రాజకీయాల ఆరోపణ

.
ప్రజల దృష్టిని అసలు సమస్యల నుంచి మళ్లించేందుకు ప్రభుత్వం డైవర్షన్ రాజకీయాలకు పాల్పడుతోందని అంబటి రాంబాబు విమర్శించారు. వ్యక్తిత్వ హననం, సోషల్ మీడియా వివాదాలు, కేసుల రాజకీయాలతో ప్రజా సమస్యలు మరుగున పడుతున్నాయని అన్నారు. కేబినెట్ సమావేశాల్లో సంక్షేమ పథకాలు, ఉద్యోగాలు, పెన్షన్లు, ప్రజా భద్రత వంటి అంశాలపై నిర్ణయాలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజలకు ఉపయోగపడే పాలన అందించడం ప్రభుత్వ బాధ్యత అని గుర్తుచేశారు.

### పవన్ గైర్హాజరు అంశంపై ప్రశ్న

ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పలుమార్లు కేబినెట్ సమావేశాలకు హాజరు కాకపోవడం వెనుక కారణాలు ప్రజలకు తెలియజేయాలని అంబటి డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు తీసుకుంటున్న నిర్ణయాలపై విభేదాలున్నాయా అనే అనుమానాలు వస్తున్నాయని అన్నారు. ప్రభుత్వం రాజకీయ ఆరోపణలకంటే పరిపాలనపై దృష్టి పెట్టాలని సూచించారు. రాజ్యాంగబద్ధంగా పాలన సాగిస్తూ ప్రజా ప్రయోజనాలకు ప్రాధాన్యం ఇవ్వాలని హితవు పలికారు. రాష్ట్ర అభివృద్ధికి ఉపయోగపడే నిర్ణయాలే కేబినెట్ సమావేశాల ప్రధాన లక్ష్యంగా ఉండాలని అంబటి రాంబాబు పేర్కొన్నారు.

# కొడాలి చుట్టూ కేసుల ఉచ్చు

### ఫిర్యాదులతో కొత్త పరిణామం

### రాజకీయ వేడి మరింత పెరుగుతోందా?

మాజీ మంత్రి కొడాలి నాని చుట్టూ రాజకీయ పరిణామాలు వేగంగా మారుతున్నాయి. ఉపా చట్టాన్ని అపహాస్యం చేశారనే ఆరోపణలు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌పై చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో తెలుగుదేశం పార్టీ నాయకులు విజయవాడ వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరారు. ఇదే సమయంలో ప్రభుత్వాన్ని విమర్శించే వారిపై మరింత కఠిన చర్యలు తీసుకోవాలనే అంశంపై రాష్ట్ర కేబినెట్‌లో చర్చ జరిగినట్లు సమాచారం. సోషల్ మీడియా కార్యకలాపాలపై ప్రత్యేకంగా పవర్ పాయింట్ ప్రజెంటేషన్ నిర్వహించారు. అనంతరం ప్రత్యేక టాస్క్ ఫోర్స్ ఏర్పాటు చేయాలని కేబినెట్ నిర్ణయించింది.

### టీడీపీ నేతల తీవ్ర విమర్శలు

కృష్ణా జిల్లా అవనిగడ్డలో జరిగిన మీడియా సమావేశంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కనపర్తి శ్రీనివాసరావు కొడాలి నానిపై తీవ్ర విమర్శలు చేశారు. ప్రశ్న రావణ్ పేరుతో సామాజిక విద్వేషాలను రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేసిన వ్యక్తిని సమర్థించడం సమంజసం కాదని అన్నారు. పవన్ కళ్యాణ్‌పై వ్యక్తిగత దూషణలు చేసిన వారిని కాపాడే ప్రయత్నం జరుగుతోందని ఆరోపించారు. కొడాలి నాని గతంలో కూడా హిందూ దేవతల అంశంపై వివాదాస్పద వ్యాఖ్యలు చేశారని పేర్కొన్నారు. అలాంటి వారిపై వెంటనే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మహిళా ఎస్సై భాగ్యశ్రీకి టీడీపీ నాయకులు అధికారికంగా ఫిర్యాదు సమర్పించారు.

### కొడాలి నాని సమాధానం

ఈ ఆరోపణలపై మాజీ మంత్రి కొడాలి నాని ఘాటుగా స్పందించారు. ప్రశ్న రావణ్ వ్యవహారానికి వైఎస్సార్‌సీపీకి ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. రాజకీయ ప్రయోజనాల కోసమే టీడీపీ తప్పుడు కథనాలు ప్రచారం చేస్తోందని ఆరోపించారు.



2029 ఎన్నికల్లో ప్రజలే ప్రభుత్వానికి రాజకీయంగా సమాధానం చెబుతారని వ్యాఖ్యానించారు. రావణ్‌ను జోసఫ్‌గా చిత్రీకరిస్తూ మతపరమైన కోణం తీసుకొచ్చింది టీడీపీ, ఎల్లో మీడియా అని విమర్శించారు. రావణ్ అసలు పేరు అదే తప్ప జోసఫ్ కాదని, అతను క్రిస్టియన్ కూడా కాదని స్పష్టం చేశారు.

### బెయిల్ అంశంపై ప్రశ్నలు

రావణ్ అరెస్టు తర్వాత జరిగిన పరిణామాలపై కూడా కొడాలి నాని పలు ప్రశ్నలు లేవనెత్తారు. కేసుల్లో బెయిల్ ఎలా లభించిందో ప్రజలకు వివరించాలని డిమాండ్ చేశారు. వైఎస్సార్‌సీపీ నాయకులు ఎవరూ ఫోన్ చేసి బెయిల్ ఇప్పించలేదని స్పష్టం చేశారు. జనసేన ఒత్తిడి పెరిగిన తర్వాతే కఠిన చట్టాలు ప్రయోగించారని ఆరోపించారు. రావణ్ గతంలో పలువురు రాజకీయ నాయకులను విమర్శించిన వీడియోలు పరిశీలిస్తే అసలు నిజాలు బయటపడతాయని పేర్కొన్నారు. చిన్న సోషల్ మీడియా పోస్టులకే అరెస్టులు చేసే ప్రభుత్వం ఈ కేసులో ఆలస్యంగా ఎందుకు స్పందించిందని ప్రశ్నించారు.

### రాజకీయంగా వేడెక్కుతున్న వివాదం

ప్రస్తుతం ఈ వ్యవహారం అధికార కూటమి, వైఎస్సార్‌సీపీ మధ్య మరో రాజకీయ వివాదంగా మారింది. ఒకవైపు టీడీపీ నాయకులు చట్టపరమైన చర్యలు కోరుతుండగా, మరోవైపు కొడాలి నాని తమ పార్టీకి ఈ అంశంతో సంబంధం లేదని చెబుతున్నారు. ప్రజలను మతాల పేరుతో విభజించే ప్రయత్నాలు విజయవంతం కావని ఆయన అన్నారు. రాష్ట్రంలో హిందువులు, క్రిస్టియన్లు కలిసి జీవిస్తున్నారని గుర్తు చేశారు. కేసుల దర్యాప్తు ఏ దిశగా సాగుతుంది, పోలీసుల తదుపరి చర్యలు ఎలా ఉంటాయి, ఈ రాజకీయ ఆరోపణలు ఎలాంటి మలుపు తిరుగుతాయనే అంశాలు ఇప్పుడు రాష్ట్ర రాజకీయాల్లో ఆసక్తికర చర్చకు దారితీస్తున్నాయి.

# మిస్సింగ్ మిస్టరీ

(మొదటి పేజీ తరువాయి..)

పోలీసుల వివరాల ప్రకారం పబ్బా చంద్రశేఖర్, ఆయన భార్య పబ్బా స్వప్న జూన్ 22న స్విట్జర్లాండ్ వెళ్తున్నట్లు కుటుంబ సభ్యులకు చెప్పి ఇంటి నుంచి బయలుదేరారు. ఆ తర్వాత జూలై 8 వరకు కుటుంబ సభ్యులను ఎలాంటి మార్గంలోనూ సంప్రదించలేదు. ఇద్దరి మొబైల్ ఫోన్లు కూడా స్విచ్ఛాఫ్‌లో ఉండటంతో వారి కుమార్తె చెర్లపల్లి పోలీసులను ఆశ్రయించింది. దీంతో పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. దర్యాప్తు కొనసాగుతున్న సమయంలో మరో కీలక విషయం వెలుగులోకి వచ్చింది. దంపతులపై ఇప్పటికే పలువురు బాధితులు పోలీసులకు ఫిర్యాదులు చేసినట్లు తెలిసింది. అధిక వడ్డీ ఇస్తామని, ఆకర్షణీయమైన పెట్టుబడి పథకాల పేరుతో డబ్బులు తీసుకుని సుమారు రూ.50 కోట్ల వరకు వసూలు చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. బాధితుల నుంచి భారీ మొత్తంలో నిధులు సేకరించిన తర్వాత దంపతులు విదేశాలకు వెళ్లి తల దాచుకున్నారని ఫిర్యాదుదారులు ఆరోపిస్తున్నారు.

### ఆర్థిక లావాదేవీలపై దృష్టి

మిస్సింగ్ కేసుకు ఆర్థిక మోసం కేసుకు సంబంధం ఉందా అనే అంశంపై పోలీసులు ప్రత్యేకంగా దృష్టి సారించారు. దంపతులు నిజంగానే స్విట్జర్లాండ్‌కు వెళ్లారా, లేక మరెక్కడైనా ఉన్నారా అనే విషయాన్ని నిర్ధారించే ప్రయత్నాలు కొనసాగుతున్నాయి. వారు దేశం విడిచి వెళ్లే ముందు జరిగిన బ్యాంకు లావాదేవీలు, పెట్టుబడుల పేరుతో సేకరించిన నిధుల వివరాలను అధికారులు పరిశీలిస్తున్నారు. ప్రయాణ రికార్డులు, బ్యాంకు ఖాతాలు, బాధితుల ఫిర్యాదులు, విదేశీ ప్రయాణానికి సంబంధించిన వివరాలను పోలీసులు సేకరిస్తున్నారు.

# రామాలయ విరాళాల కేసు

(మొదటి పేజీ తరువాయి..)

ఈ కేసులో కీలక ఆధారాలు చెరిగిపోకుండా వెంటనే భద్రపరచాలని మరో పిటిషన్ కోరుతోంది. నగదు లెక్కలు, ఖాతా పుస్తకాలు, బ్యాంకు రికార్డులు, యూపీఐ చెల్లింపుల వివరాలు, సీసీటీవీ దృశ్యాలు, ఈమెయిల్లు, సర్వర్లు, ఎలక్ట్రానిక్ పరికరాలు సహా అన్ని డిజిటల్ ఆధారాలను రక్షించాలని సుప్రీంకోర్టును అభ్యర్థించారు. దర్యాప్తు పూర్తయ్యే వరకు ఎలాంటి ఆధారాలు మార్పులకు గురికాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. ట్రస్ట్ ఆర్థిక లావాదేవీలపై స్వతంత్ర సంస్థతో సమగ్ర ఫోరెన్సిక్ ఆడిట్ నిర్వహించాలని కూడా పిటిషన్‌లో విజ్ఞప్తి చేశారు. బ్యాంకు ఖాతాలు, విరాళాల లెక్కలు, ఆర్థిక రికార్డులను పూర్తిగా పరిశీలించి నివేదికను నేరుగా సుప్రీంకోర్టుకు సమర్పించాలని సూచించారు. భవిష్యత్తులో కూడా నిర్దిష్ట వ్యవధిలో విరాళాల లెక్కలను ప్రజలకు వెల్లడించే విధానం అమలు చేయాలని కోరారు.

### తీర్పుపై ఉత్కంఠ

ఈ కేసులో సుప్రీంకోర్టు ఎలాంటి ఆదేశాలు జారీ చేస్తుందనే అంశంపై దేశవ్యాప్తంగా ఆసక్తి నెలకొంది.



సీబీఐ దర్యాప్తుకు అనుమతి ఇస్తుందా, ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని నియమిస్తుందా, లేక ప్రస్తుతం కొనసాగుతున్న ప్రక్రియపై అదనపు మార్గదర్శకాలు జారీ చేస్తుందా అనే అంశాలు విచారణ తర్వాత స్పష్టతకు వచ్చే అవకాశం ఉంది.




# క్షణిక సుఖం కోసం.. బలిపీఠం

## పచ్చని సంసారాల్లో అక్రమ సంబంధాల చిచ్చు

- మాయా మోహం.. మారణ హోమం
- కుటుంబ వ్యవస్థ విచ్ఛిన్నం.. పెరుగుతున్న నేరాలు
- నైతిక విలువల పతనం.. నలిగిపోతున్న బంధాలు

**నేటి యాంత్రిక జీవనశైలిలో మనిషి విలువల కంటే విలాసాలకే ప్రాధాన్యత ఇస్తున్నాడు. పవిత్రమైన వివాహ బంధంలో ప్రేమానురాగాల స్థానంలో మొబైల్ ఫోన్లు, పని ఒత్తిడి చేరడంతో దంపతుల మధ్య దూరం పెరుగుతోంది. ఈ మానసిక అసంతృప్తినే ఆసరాగా చేసుకుని అక్రమ సంబంధాలు పచ్చని సంసారాల్లో చిచ్చు రేపుతున్నాయి. క్షణిక సుఖం కోసం కట్టుకున్న వారిని కాటికి పంపుతూ, సుపారీ ఇచ్చి మరీ హత్యలు చేయించే స్థాయికి దిగజారుతున్నారు. తెలుగు రాష్ట్రాల్లో పెచ్చరిల్లుతున్న ఈ నేర సంస్కృతికి అద్దం పడుతున్నట్టు జాతీయ నివేదికలు ఆందోళన కలిగిస్తున్నాయి. సంస్కృతికి నిలయమైన భారతీయ వివాహ వ్యవస్థ నేడు పాశ్చాత్య పోకడలు, అనైతిక సంబంధాల కారణంగా బీటలు వారుతోంది. తాత్కాలిక ఆనందం వెనుక దాగున్న ఈ మారణహోమంపై సామాజిక విశ్లేషణ.**

ఒకరి భార్య మరొకరికి సోదరితో సమానమని మన పెద్దలు చెప్పిన మాట నేటి కాలంలో నీరుగారిపోతోంది. మారుతున్న కాలంతో పాటు మానవ సంబంధాలు కూడా యాంత్రికంగా మారిపోతున్నాయి. ఒకప్పుడు పవిత్రంగా భావించిన వివాహ బంధం నేడు అమానవీయ పోకడలకు వేదికవుతోంది. భార్య పరాయి వ్యక్తితో అక్రమ సంబంధం నడుపుతుంటే.. భర్త పరాయి స్త్రీ మోహంలో పడి కొత్త లోకాన్ని వెతుక్కుంటున్నాడు. ఇలా ఒకరినొకరు మోసం చేసుకుంటూ, సామాజిక కట్టుబాట్లను తుంగలో తొక్కి విశృంఖలమైన బాట పడుతున్నారు. ఈ క్రమంలో ప్రేమానురాగాలు కనుమరుగై, కేవలం శారీరక వాంఛలకే ప్రాధాన్యత పెరిగిపోతోంది. ఒకరినొకరు ప్రేమగా పలకరించుకునే తీరిక లేని ఈ బిజీ లైఫ్‌లో, మొబైల్ ఫోన్లు మరియు సామాజిక మాధ్యమాలు అక్రమ సంబంధాలకు ప్రధాన కేంద్రాలుగా మారుతున్నాయి. నేటి ఉరుకుల పరుగుల జీవితంలో భార్యాభర్తలు కనీసం మాట్లాడుకునే సమయం కూడా దొరకడం లేదు. ఆఫీసు పని ఒత్తిడి, అర్ధరాత్రి దాకా మొబైల్ స్క్రీన్లతో గడపడం వంటివి దంపతుల మధ్య దూరాన్ని పెంచుతున్నాయి. ఇంటిలో వండుకుని తినే ఓపిక లేక పిజ్జాలు, బర్గర్లు వంటి జంక్ ఫుడ్‌కు అలవాటు పడుతున్నారు. రాత్రివేళల్లో ఎవరికి వారు ఒంటరిగా ఫోన్లు చూసుకుంటూ, అలసిపోయి వెనుదిరిగి నిద్రపోతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో వారి మధ్య ఉండాల్సిన శృంగార జీవితం ప్రశ్నార్థకంగా మారుతోంది. ఈ మానసిక, శారీరక అసంతృప్తే మూడో వ్యక్తి ప్రవేశానికి దారి తీస్తోంది. ఇంటిలో దొరకని ఆదరణను బయట వెతుక్కునే ప్రయత్నంలో అక్రమ సంబంధాలు అనే విషవలయంలో చిక్కుకుపోతున్నారు.

### పచ్చని సంసారాల్లో పరాయి చిచ్చు

అక్రమ సంబంధం అనేది కేవలం ఇద్దరు వ్యక్తుల మధ్య జరిగే వ్యవహారం మాత్రమే కాదు, అది ఒక పచ్చని కుటుంబాన్ని చిన్నాభిన్నం చేసే మంట. కొన్నాళ్ల పాటు రహస్యంగా సాగిన ఈ చాటు సరసాలు ఏదో ఒక సమయంలో బయటపడక తప్పదు. అలా వ్యవహారం బయటపడినప్పుడు పంతాలు, పట్టింపులు మొదలై హత్యల వరకు దారి తీస్తున్నాయి. క్షణిక సుఖం కోసం ఏళ్ల నాటి బంధాన్ని కాలరాస్తూ, అడ్డుగా ఉన్న భర్తను లేదా భార్యను వదిలించుకోవడానికి హంతకులుగా మారుతున్నారు. తమ అక్రమ సంబంధానికి అడ్డు వస్తున్నారనే అక్కసుతో సొంత వారినే చంపడానికి వెనకాడటం లేదు. సుపారీ ఇచ్చి మరీ హత్యలు చేయించే స్థాయికి నేటి సమాజం దిగజారిపోవడం విచారకరం.

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ వంటి తెలుగు రాష్ట్రాలతో పాటు దేశంలోని మెట్రో నగరాల్లో పరిస్థితులు అత్యంత ఆందోళనకరంగా ఉన్నాయి. తాజా గణాంకాల ప్రకారం, వివాహేతర సంబంధాల వల్ల జరిగే హత్యల్లో దేశ రాజధాని ఢిల్లీ అగ్రస్థానంలో ఉండగా, బెంగళూరు రెండో స్థానంలో నిలిచింది. తెలుగు రాష్ట్రాల్లో కూడా ఈ తరహా నేరాలు రోజురోజుకు పెరిగిపోతున్నాయి. సగటున నెలకు 70 నుంచి 80 హత్యలు జరుగుతుంటే, అందులో సుమారు 30 శాతం కేసులు కేవలం లైంగిక అసూయ, అక్రమ సంబంధాల కారణంగానే నమోదవుతున్నాయి. సాంప్రదాయ కుటుంబాల్లో కూడా ఇటువంటి ఘటనలు వెలుగుచూడటం సమాజంలోని నైతిక పతనానికి అద్దం పడుతోంది.

### ఏలూరు నుండి కడప వరకు - ఘోరాలు.. నేరాలు

అక్రమ సంబంధాల కోసం ఎంతటి దారుణానికైనా ఒడిగడుతున్న ఉదంతాలు ఇటీవల పెరిగాయి. ఏలూరు, కడప, కరీంనగర్ వంటి ప్రాంతాల్లో జరిగిన సంఘటనలే దీనికి నిదర్శనం. ప్రియుడిపై మోజుతో భార్య తన భర్తను చంపించడానికి ఏకంగా 10 లక్షల రూపాయల సుపారీ ఇచ్చినట్లు విచారణలో తేలింది. తాజాగా కడప జిల్లా ప్రొద్దుటూరులో ఒక వింత సంఘటన వెలుగుచూసింది. ఒక వివాహిత తన ఆరోగ్య సమస్యల రీత్యా ప్రభుత్వ ఆసుపత్రి ఉద్యోగితో పరిచయం పెంచుకుంది. ఆ పరిచయం కాస్తా అక్రమ సంబంధానికి దారి తీసింది. తన భర్తను వదిలించుకోవడానికి ఆమె తన బంగారు నగలను తాకట్టు పెట్టి డబ్బు తీసుకువచ్చి, అనంతపురం జిల్లాకు చెందిన ఒక కిరాయి ముఠాకు సుపారీ ఇచ్చింది. అయితే, అదృష్టవశాత్తూ పోలీసులు ఆ ప్లాన్‌ను ముందుగానే పసిగట్టి వారిని అరెస్ట్ చేశారు. నేరగాళ్లు ఎంత పకడ్బందీగా ప్లాన్ వేసినా, చట్టం నుండి తప్పించుకోలేరని పోలీసులు నిరూపిస్తున్నారు. ప్రొద్దుటూరు సుపారీ కేసులో పోలీసులు కేవలం 48 గంటల్లోనే నిందితులను పట్టుకుని కటకటాల వెనక్కి పంపారు. భర్త ప్రాణాలను కాపాడటంలో కీలక పాత్ర పోషించారు. వ్యక్తిగత ప్రవర్తనలో లోపాలు, సామాజిక విలువల పట్ల గౌరవం లేకపోవడం, క్షణికావేశానికి లోనుకావడం వంటివి ఈ నేరాలకు ప్రధాన కారణాలుగా పోలీసులు, మానసిక వైద్యులు గుర్తించారు. నేరం జరిగిన తర్వాత ఎంతటి విచారణ చేసినా, పోయిన ప్రాణాలు తిరిగిరావు మరియు విచ్ఛిన్నమైన కుటుంబాలు మళ్లీ అతుక్కోవు అనే నిజాన్ని అందరూ గ్రహించాలి. కొన్ని ఏళ్ల క్రితం కడప జిల్లా మైదుకూరు మండలం మిట్టమానుపల్లెలో జరిగిన ఒక సంఘటన నేటికీ ప్రజల గుండెల్లో వణుకు పుట్టిస్తుంది. తన భార్యను ప్రాణం కంటే ఎక్కువగా ప్రేమించిన ఒక భర్తకు, ఆమె మరొకరితో సంబంధం పెట్టుకుందని తెలిసింది. ఆ వేదనను తట్టుకోలేక, కక్షతో భార్య గొంతు కోసి చంపేశాడు. అంతటితో ఆగకుండా, ఆమె శరీరాన్ని అత్యంత కిరాతకంగా ఛిద్రం చేశాడు. ఘటనా స్థలానికి వెళ్లిన పోలీసు అధికారులు సైతం ఆ దృశ్యాన్ని చూసి కన్నీళ్లు పెట్టుకున్నారంటే పరిస్థితి ఎంత భయంకరంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఇలాంటి ఘటనలు సమాజంలో పెరుగుతున్న హింసా ప్రవృత్తికి నిదర్శనాలు.

నాగర్ కర్నూల్ జిల్లాలో జరిగిన ఒకఉదంతం దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. ప్రియుడి మోజులో పడి భర్తను హతమార్చిన ఒక మహిళ, ఆ స్థానంలో ప్రియుడిని ఉంచాలని ప్లాన్ వేసింది. ప్రియుడి ముఖంపై యాసిడ్ పోసి, అతనికి ప్లాస్టిక్ సర్జరీ చేయించి తన భర్తగా అందరినీ నమ్మించాలని చూసింది. కానీ పోలీసుల చాకచక్యంతో అసలు విషయం బయటపడింది. ఇలాంటి ఘటనలు చూస్తుంటే మనుషుల్లో నైతిక విలువలు ఎంతగా దిగజారిపోయాయో స్పష్టమవుతోంది. ఇలాంటి వికృత చేష్టలు

### మొదటి భర్తను చంపి.. రెండో భర్తగా ప్రియుడు

సమాజంలో భయంకరమైన వాతావరణాన్ని సృష్టిస్తున్నాయి. నేడు ప్రతి ఇంట్లో స్మార్ట్ ఫోన్ ఉండటం అక్రమ సంబంధాలకు ఒక వరంగా మారింది. ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, వాట్సాప్ వంటి మాధ్యమాల ద్వారా తెలియని వ్యక్తులతో పరిచయాలు పెంచుకుంటున్నారు. ఇంట్లో భర్త లేదా భార్యతో మాట్లాడటానికి సమయం లేని వారు, ఫోన్లలో గంటల తరబడి పరాయి వ్యక్తులతో చాటింగ్ చేస్తున్నారు. ఈ పరిచయాలు క్రమంగా వివాహేతర సంబంధాలుగా మారుతున్నాయి. పిల్లల ముందే ఇలాంటి పనులకు పాల్పడటం వల్ల వారిపై కూడా ప్రభావం పడుతోంది. గుంటూరు జిల్లా సత్తెనపల్లిలో తన అక్రమ సంబంధానికి అడ్డుగా ఉన్నాడని తొమ్మిదేళ్ల కుమారుడిని ప్రియుడితో కలిసి చంపిన తల్లి ఉదంతం హృదయవిదారకం.

### ఆరోగ్యంపై వివాహేతర ప్రభావం

కేవలం నేరాలు మాత్రమే కాదు, వివాహేతర సంబంధాలు శారీరక, మానసిక ఆరోగ్యంపై కూడా తీవ్ర ప్రభావం చూపుతాయని పరిశోధనలు చెబుతున్నాయి. న్యూయార్క్ విశ్వవిద్యాలయం నిర్వహించిన ఒక అధ్యయనం ప్రకారం, వివాహేతర సంబంధాల్లో ఉన్న మహిళలు ఎక్కువగా గుండె జబ్బులు, బైపోలార్ డిజార్డర్, స్కిజోఫ్రీనియా వంటి మానసిక రుగ్మతలకు గురవుతున్నారని తేలింది. నిరంతరం దొరికిపోతామనే భయం, అపరాధ భావం, మానసిక ఒత్తిడి వారిని కుంగదీస్తున్నాయి. దీనివల్ల వారి వ్యక్తిగత జీవితం, వృత్తిగత జీవితం రెండూ నాశనమవుతున్నాయి. భార్యాభర్తల మధ్య ఏర్పడే ఈ గొడవలు, అక్రమ సంబంధాల ప్రభావం పసిపిల్లలపై తీవ్రంగా ఉంటుంది. తల్లిదండ్రుల వైఫల్యం పిల్లలకు శాపంగా మారుతోంది. ఇంట్లో ఆప్యాయత లేని వాతావరణంలో పెరిగే పిల్లలు అభద్రతా భావానికి లోనవుతారు. చిన్నతనంలోనే తల్లిదండ్రులు విడిపోవడం లేదా ఒకరినొకరు చంపుకోవడం చూసిన పిల్లలు సున్నితత్వాన్ని కోల్పోతారు. వారు మానసికంగా బలహీనపడి, కాలక్రమేణా మత్తు పదార్థాలకు, మాదక ద్రవ్యాలకు అలవాటు పడే ప్రమాదం ఉంది. తద్వారా వారు కూడా నేరస్థులుగా మారే అవకాశం ఉంటుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

### కుటుంబ వ్యవస్థ బలహీనపడుతున్న తీరు

భారతదేశం అంటేనే సంస్కృతి, సంప్రదాయాలకు పెట్టింది పేరు. ప్రపంచ దేశాలు మన కుటుంబ వ్యవస్థను చూసి గర్విస్తాయి. కానీ నేడు పాశ్చాత్య పోకడల వ్యామోహంలో పడి మన మూలాలను మర్చిపోతున్నాం. ఉమ్మడి కుటుంబాలు పోయి చిన్న కుటుంబాలు వచ్చాయి. ఇప్పుడు ఆ చిన్న కుటుంబాలు కూడా ఈ వివాహేతర సంబంధాల వల్ల ముక్కలవుతున్నాయి. వైఫై మరియు అంతర్జాలం అందుబాటులోకి రావడంతో అశ్లీల సాహిత్యం, వీడియోలు యువతను, దంపతులను తప్పుదోవ పట్టిస్తున్నాయి. సోషల్ మీడియాలో జరిగే పరిచయాలు అపరిచిత వ్యక్తులతో అనైతిక బంధాలకు దారి తీస్తున్నాయి. అక్రమ సంబంధాల కోసం హత్యలు చేసేవారు నేడు టెక్నాలజీని కూడా వాడుకుంటున్నారు. ఇటీవల కడప జిల్లా ప్రొద్దుటూరులో జరిగిన ఒక మర్డర్ కేసు విస్తుపోయే నిజాలను వెలుగులోకి తెచ్చింది. భార్యను వదిలించుకోవడానికి భర్త యూట్యూబ్‌లో వీడియోలు చూసి ప్లాన్ వేశాడు. ప్రియురాలిపై మోజుతో, తన భార్య తనను నిరంతరం అనుమానిస్తోందన్న నెపంతో, పాలకోవాలో విషం కలిపి ఆమెను చంపేశాడు. ఆ విషాన్ని కూడా ఆన్‌లైన్‌లో 80 వేల రూపాయలు పెట్టి కొనుగోలు చేయడం గమనార్హం. కేవలం భార్య లావుగా ఉందనే చిన్న కారణంతో కూడా హత్యకు పాల్పడటం మానవత్వానికే మచ్చ.

### పరిష్కార మార్గాలు - నిపుణుల సలహాలు

ఈ సమస్యకు ప్రధాన పరిష్కారం కోరికలను అదుపులో పెట్టుకోవడం, నైతిక విలువలను పాటించడం. దంపతుల మధ్య ఏవైనా మనస్పర్థలు వస్తే కూర్చుని మాట్లాడుకోవాలి. అవసరమైతే ఫ్యామిలీ కౌన్సిలింగ్ నిపుణుల సలహాలు తీసుకోవాలి. ప్రభుత్వం కూడా ప్రతి జిల్లాలో మానసిక ఆరోగ్య కేంద్రాలను ఏర్పాటు చేసి, దంపతులకు సరైన కౌన్సిలింగ్ ఇచ్చే ఏర్పాటు చేయాలి. తల్లిదండ్రులు తమ పిల్లలకు పెళ్లిళ్లు చేసేటప్పుడు వారి ఇష్టాఇష్టాలను గమనించాలి. బలవంతపు పెళ్లిళ్లు కూడా ఇలాంటి అక్రమ సంబంధాలకు దారి తీసే అవకాశం ఉంది. నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో గణాంకాల ప్రకారం, భారతదేశంలో హత్యలకు ప్రధాన కారణాల్లో వివాహేతర సంబంధాలు రెండో స్థానంలో ఉన్నాయి. ఇటీవల చెన్నై నగరంలోనే ఇలాంటి కారణాలతో 28 హత్యలు జరగడం పరిస్థితి తీవ్రతను తెలియజేస్తోంది. న్యూయార్క్ యూనివర్సిటీ పరిశోధనల ప్రకారం, మెట్రో నగరాల్లో ఇటువంటి ధోరణులు ఎక్కువగా కనిపిస్తున్నాయి. ఆర్థిక ఇబ్బందులు, ఉద్యోగాల్లో ఎదుగుదల కోసం చేసే రాజీలు కూడా కొంతమందిని ఈ దారిలోకి నెడుతున్నాయి. కానీ తాత్కాలిక ఆనందం కోసం చేసే ఇలాంటి పనులు జీవితాంతం కోలుకోలేని దెబ్బ తీస్తాయన్నది నగ్న సత్యం. వివాహేతర సంబంధాలు అనేవి కేవలం క్షణికానందాన్ని మాత్రమే ఇస్తాయి. కానీ వాటి వల్ల కలిగే నష్టాలు మాత్రం చాలా కాలం ఉంటాయి. గరుడ పురాణంలోనూ ఇలాంటి అనైతిక పనులకు కఠినమైన శిక్షలు ఉంటాయని చెప్పారు. నిజమైన సుఖం ఒకరిని ఒకరు గౌరవించుకోవడంలో, నమ్మకంగా ఉండటంలోనే ఉంది. అక్రమ సంబంధాల వల్ల ఏర్పడే ఒత్తిడిని తట్టుకోవడం ఎవరికీ సాధ్యం కాదు. దీనివల్ల కుటుంబాలు విచ్ఛిన్నమై, పిల్లలు అనాథలవుతారు. కాబట్టి సంస్కృతిని కాపాడుకుంటూ, నైతిక విలువలతో కూడిన జీవితాన్ని గడపడమే అందరికీ శ్రేయస్కరం.

### ముప్పులో కుటుంబ వ్యవస్థ

మారుతున్న కాలంలో నైతిక విలువలు నశించి, అక్రమ సంబంధాలు పచ్చని సంసారాలను వల్లకాడుగా మారుస్తున్నాయి. మొబైల్ వ్యామోహం, క్షణిక సుఖాల కోసం పాకులాడటం వల్ల దంపతుల మధ్య విశ్వాసం సడలుతోంది. దీని ఫలితంగా అడ్డుగా ఉన్న భాగస్వామిని సుపారీ ఇచ్చి మరీ అంతమొందించే 'క్రైమ్ కల్చర్' పెరుగుతోంది. ఇది కేవలం ప్రాణాలను తీయడమే కాకుండా, పసిపిల్లల భవిష్యత్తును అంధకారం చేస్తూ, వారిని నేరస్తులుగా మారుస్తోంది. రహస్య బంధాలు తాత్కాలిక ఆనందాన్ని ఇవ్వవచ్చు కానీ, అవి శాశ్వత వినాశనానికి దారి తీస్తాయి. జైలు శిక్షలు, సామాజిక బహిష్కరణ తప్పవు. ఇప్పుడైనా మేల్కొని బంధాలను గౌరవించకపోతే, రేపటి సమాజం మానవత్వం లేని మృగాల నిలయంగా మారుతుంది. మీ కుటుంబాన్ని కాపాడుకోవడం మీ బాధ్యత!

ఏ కుటుంబ వ్యవస్థ అయితే భారతీయ సమాజానికి బలం అని భావిస్తున్నామో అదే వ్యవస్థ చిన్నాభిన్నం అవుతోంది. పచ్చని కాపురాల్లో చిచ్చు పెడుతోంది. వావి వరుసలు లేని విశృంఖల బంధాలకు, విచ్చలవిడి తనానికి దారి తీస్తోంది. నైతిక పతనం భారత సమాజాన్ని రాచ పుండు లా కబళిస్తోంది. అమ్మమ్మ, తాతయ్య ఒక చోట, అమ్మా, నాన్న ఒకచోట, బిడ్డలు ఒక చోట..ఇక పిల్లలకు ఆత్మీయ లాలన ఏది? ఏది మంచి ? ఏది కాదు? అని చెప్పే వాళ్ళు అనాథ ఆశ్రమలకుజ వృద్ధ ఆశ్రమలకు చేరుతున్న దురవస్థ ను చూస్తున్నాం.. 2000సంవత్సరం తర్వాత కొత్త సహస్రాబ్ది తరం వరుస మారుతోంది. ఏ విదేశీయులైతే మన సంస్కృ తీ సంప్రదాయాలను మెచ్చి ఇక్కడికి వస్తున్నారో ...వారే యమా సామాజిక వ్యవస్థకు పట్టిన చీడకు భయపడి ఇక్కడికి రావటానికే ఆలోచనలో పడుతున్నారంటే ఎక్కడికి పోతోంది ఒకనాటి మన విలువల వారసత్వం? ఏమై పోతోంది ఈ దేశం?

# వాట్ నెక్స్ట్

## కోడింగ్‌కు కౌంట్‌డౌన్.. ఏఐదే భవిష్యత్!

## ఐటీలో సమూల మార్పులకు రంగం సిద్ధం



కృత్రిమ మేధస్సు ప్రపంచాన్ని ఊహించని వేగంతో మార్చేస్తోంది. ఒకప్పుడు భద్రమైన ఉద్యోగంగా భావించిన కోడింగ్ రంగం కూడా ఇప్పుడు ఏఐ ప్రభావానికి గురవుతోంది. భవిష్యత్‌లో ముందుగా కోడింగ్ పనులు పూర్తిగా ఆటోమేట్ అవుతాయని, ఆ తర్వాత సాఫ్ట్‌వేర్ ఇంజినీరింగ్‌లోని చాలా బాధ్యతలను కూడా ఏఐ నిర్వహించే స్థాయికి చేరుకుంటుందని ఆంత్రోపిక్ సీఈఓ డారియో అమోడీ పేర్కొన్నారు. అయితే మానవ ఆలోచన, సృజనాత్మకత, నిర్ణయ సామర్థ్యానికి ఇప్పటికీ ప్రత్యేక స్థానం ఉంటుందని స్పష్టం చేశారు. ఏఐతో పోటీ పడటం కంటే దాన్ని సమర్థంగా వినియోగించడం నేర్చుకుంటేనే భవిష్యత్‌లో విజయావకాశాలు ఎక్కువగా ఉంటాయని ఆయన యువతకు సూచించారు.

కృత్రిమ మేధస్సు అభివృద్ధి ప్రపంచ ఉద్యోగ రంగాన్ని వేగంగా మార్చుతోంది. భవిష్యత్‌లో ముందుగా కోడింగ్ పనులనే ఏఐ పూర్తిగా చేపడుతుందని ఆంత్రోపిక్ సంస్థ సీఈఓ డారియో అమోడీ వెల్లడించారు. ఆ తర్వాత సాఫ్ట్‌వేర్ ఇంజినీరింగ్‌లోని ఇతర బాధ్యతలను కూడా ఏఐ నిర్వహించే స్థాయికి చేరుకుంటుందని చెప్పారు. భారతీయ పారిశ్రామికవేత్త నిఖిల్ కామత్ నిర్వహించిన పోడ్‌కాస్ట్‌లో ఆయన ఈ అభిప్రాయాలు వెల్లడించారు. రానున్న కాలంలో ఉద్యోగాల స్వరూపం పూర్తిగా మారే అవకాశం ఉందని పేర్కొన్నారు.

### సాఫ్ట్‌వేర్ ఇంజినీరింగ్‌కు ఇంకా సమయం

కోడింగ్ పనులను ఏఐ త్వరగా ఆటోమేట్ చేసినా పూర్తి స్థాయి సాఫ్ట్‌వేర్ ఇంజినీరింగ్‌కు మరికొంత సమయం పడుతుందని అమోడీ వివరించారు. ఉత్పత్తి రూపకల్పన, వినియోగదారుల అవసరాల అవగాహన, మార్కెట్ డిమాండ్ అంచనా, ఏఐ వ్యవస్థల నిర్వహణ వంటి అంశాల్లో మానవ పాత్ర ఇప్పటికీ కీలకంగానే ఉంటుందని చెప్పారు. మనిషి చిన్న భాగం పని చేసినా మిగిలిన పనిని ఏఐ పూర్తి చేస్తే ఉత్పాదకత అనేక రెట్లు పెరుగుతుందని ఆయన అభిప్రాయపడ్డారు.

### విమర్శనాత్మక ఆలోచనే అసలైన బలం

యువత భవిష్యత్‌కు సిద్ధం కావాలంటే ఏఐతో పోటీ పడే రంగాల కంటే ఏఐకి తోడ్పడే రంగాలపై దృష్టి పెట్టాలని అమోడీ సూచించారు. సెమీకండక్టర్ టెక్నాలజీ, సంప్రదాయ ఇంజినీరింగ్ విభాగాలు, మానవ సంబంధాలకు ప్రాధాన్యం ఉన్న వృత్తులు మంచి అవకాశాలు అందిస్తాయని చెప్పారు. విశ్లేషణాత్మక ఆలోచనతో పాటు వాస్తవ సమస్యలకు పరిష్కారాలు చూపగల సామర్థ్యం ఉన్న వారికి మంచి భవిష్యత్ ఉంటుందని వివరించారు. ఏఐ యుగంలో విమర్శనాత్మక ఆలోచన అత్యంత విలువైన నైపుణ్యంగా మారుతుందని అమోడీ స్పష్టం చేశారు. ఏఐతో నిజమైన చిత్రాలు, వీడియోలు సులభంగా తయారవుతున్న పరిస్థితిలో ఏది నిజం, ఏది నకిలీ అనే విషయాన్ని గుర్తించే సామర్థ్యం ప్రతి ఒక్కరికీ అవసరమని చెప్పారు. సమాచారం నిజస్వరూపాన్ని పరిశీలించే అలవాటు లేకపోతే తప్పుడు ప్రచారానికి ప్రజలు సులభంగా బలయ్యే ప్రమాదం ఉందని హెచ్చరించారు.

### ఏఐపై పూర్తిగా ఆధారపడొద్దు

విద్యార్థులు ప్రతి చిన్న పనికీ ఏఐపై ఆధారపడటం సరైన పద్ధతి కాదని అమోడీ అభిప్రాయపడ్డారు. హోమ్‌వర్క్ మొత్తాన్ని ఏఐతో చేయించడం మోసంతో సమానమని వ్యాఖ్యానించారు. తమ సంస్థ నిర్వహించిన అధ్యయనాల్లో నిర్లక్ష్యంగా ఏఐ ఉపయోగిస్తే నైపుణ్యాలు తగ్గిపోతాయని తేలిందన్నారు. సరైన పద్ధతిలో వినియోగిస్తే మాత్రం వ్యక్తిగత సామర్థ్యాలు మరింత మెరుగుపడతాయని చెప్పారు. కోడింగ్ అనుభవం లేని వారికి ఏఐ సాధనాలు మొదట్లో కాస్త క్లిష్టంగా అనిపించవచ్చని అమోడీ అంగీకరించారు. అందుకే సులభంగా ఉపయోగించగల కొత్త సాధనాలను అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. శిక్షణా కోర్సులు ఉపయోగపడతాయని పేర్కొన్న ఆయన, అసలు నైపుణ్యం మాత్రం నిరంతర సాధన ద్వారానే వస్తుందని వివరించారు. ఏఐను తెలివిగా ఉపయోగిస్తే అది మనిషి సామర్థ్యాన్ని పెంచే శక్తివంతమైన సాధనంగా మారుతుందని ఆయన స్పష్టం చేశారు.

# ఎలక్టోరల్ ఆటోక్రసీ

- ప్రతిపక్షాల వ్యూహంపై చర్చ
- భారత ప్రజాస్వామ్యంపై కొత్త వాదన
- విక్షాలకు యోగేంద్ర యాదవ్ సూచనలు



భారత ప్రజాస్వామ్య వ్యవస్థపై అంతర్జాతీయ స్థాయిలో జరుగుతున్న చర్చలకు తాజాగా రాజకీయ విశ్లేషకుడు యోగేంద్ర యాదవ్ వ్యాఖ్యలు మరింత ప్రాధాన్యం తెచ్చాయి. భారత రాజకీయ పరిస్థితిని కొన్ని అంతర్జాతీయ ప్రజాస్వామ్య పరిశోధనా సంస్థలు 'ఎలక్టోరల్ ఆటోక్రసీ'గా అభివర్ణిస్తున్న నేపథ్యంలో ప్రతిపక్ష పార్టీలు తమ రాజకీయ వ్యూహాలను పూర్తిగా మార్చుకోవాల్సిన అవసరం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. ప్రస్తుతం అమలులో ఉన్న సంప్రదాయ ఎన్నికల రాజకీయాలు మాత్రమే సరిపోవని స్పష్టం చేశారు.

### 'ఎలక్టోరల్ ఆటోక్రసీ' ఏంటి?

'ఎలక్టోరల్ ఆటోక్రసీ' అంటే ఎన్నికలు జరుగుతున్నప్పటికీ అన్ని రాజకీయ పార్టీలకు సమాన అవకాశాలు ఉండవని భావించే రాజకీయ పరిస్థితిని సూచించే పదం. స్వీడన్‌లోని గోతెన్‌బర్గ్ విశ్వవిద్యాలయానికి చెందిన విడెమ్ ఇన్‌స్టిట్యూట్ 2019 నుంచే భారత్‌ను ఈ విభాగంలో చేర్చింది. మరోవైపు కొన్ని అంతర్జాతీయ సంస్థలు భారత్‌ను 'పాక్షిక స్వేచ్ఛ కలిగిన ప్రజాస్వామ్యం'గా కూడా పేర్కొంటున్నాయి. ఈ అంచనాలపై దేశంలో భిన్నాభిప్రాయాలు కొనసాగుతున్నాయి.

### ప్రతిపక్షాలకు యోగేంద్ర యాదవ్ సూచన

యోగేంద్ర యాదవ్ అభిప్రాయం ప్రకారం ప్రస్తుత రాజకీయ పరిస్థితుల్లో ప్రతిపక్షాలు కేవలం ఎన్నికల సమయంలో మాత్రమే చురుకుగా ఉండే విధానాన్ని మార్చుకోవాలి. ప్రజల సమస్యలపై నిరంతర ఉద్యమాలు చేపట్టే రాజకీయ సంస్కృతిని అవలంబించాల్సిన అవసరం ఉందన్నారు. ఎన్నికల పోటీతో పాటు ప్రజాస్వామ్య విలువల పరిరక్షణ కోసం నిరంతర ప్రజా భాగస్వామ్యాన్ని పెంచే ప్రయత్నాలు కూడా చేయాలని సూచించారు. దీనినే ఆయన 'పాలిటిక్స్ ఆఫ్ రెసిస్టెన్స్'గా అభివర్ణించారు.

### ప్రధాన ప్రశ్న ఇదే

ప్రస్తుత పరిస్థితుల్లో ప్రతిపక్ష పార్టీలు ఈ కొత్త రాజకీయ విధానాన్ని అనుసరించేందుకు సిద్ధంగా ఉన్నాయా అనే ప్రశ్నను యోగేంద్ర యాదవ్ లేవనెత్తారు. ఎన్నికల వ్యూహాలకే పరిమితం కాకుండా ప్రజల మధ్య నిరంతరం చైతన్యం కల్పించడం, ప్రజా సమస్యలపై ఉద్యమాలు నిర్వహించడం, ప్రజాస్వామ్య వ్యవస్థపై విశ్వాసాన్ని బలోపేతం చేయడం వంటి అంశాలపై దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందన్నారు. రాజకీయ పోరాటానికి కొత్త రూపం ఇవ్వాల్సిన సమయం వచ్చిందని అభిప్రాయపడ్డారు.

### చర్చకు దారితీసిన వ్యాఖ్యలు

యోగేంద్ర యాదవ్ చేసిన ఈ వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో చర్చకు దారితీశాయి. దేశంలో ప్రజాస్వామ్య వ్యవస్థ పనితీరు, ఎన్నికల నిర్వహణ, రాజకీయ పోటీ, ప్రతిపక్షాల పాత్రపై ఇప్పటికే విస్తృత చర్చ కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో ఆయన చేసిన విశ్లేషణ ప్రతిపక్ష రాజకీయాల భవిష్యత్తుపై కొత్త ప్రశ్నలను ముందుకు తెచ్చింది. అయితే భారత్ ప్రజాస్వామ్య స్థితిగతులపై భిన్న రాజకీయ పార్టీలు, వివిధ పరిశోధనా సంస్థలు, నిపుణుల మధ్య వేర్వేరు అభిప్రాయాలు కొనసాగుతున్నాయి. ఈ కారణంగా 'ఎలక్టోరల్ ఆటోక్రసీ' అనే భావనపై చర్చ మరింత విస్తరించే అవకాశాలు కనిపిస్తున్నాయి.

## కమర్షియల్ వాహనాల నమోదులో వృద్ధి.. కేబినెట్‌లో చర్చ

ఏపీ కేబినెట్ సమావేశంలో కమర్షియల్ వాహనాల నమోదులో నమోదైన వృద్ధిపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఏప్రిల్-జూన్ త్రైమాసికంలో కొత్త కమర్షియల్ వాహనాల నమోదు 33,234 నుంచి 44,212కు పెరిగిందని మంత్రి తెలిపారు. ఎలక్ట్రిక్ వాహనాల కొనుగోళ్లు పెరగడం, ప్రభుత్వ ప్రోత్సాహకాలు, పర్యావరణహిత రవాణాపై అవగాహన పెరగడం ఈ వృద్ధికి ప్రధాన కారణాలని చెప్పారు. భవిష్యత్తులో ఈవీ రంగానికి మరింత ప్రోత్సాహం అందించి రాష్ట్రాన్ని సుస్థిర రవాణా దిశగా ముందుకు తీసుకెళ్తామని మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి వెల్లడించారు.

# దక్షిణ ఏపీ పెట్టుబడుల వేట

### ప్రపంచ ప్రసిద్ధ కంపెనీలతో లోకేశ్ చర్చలు

### సియోల్‌లో ఏపీ పెట్టుబడులపై ప్రచారం

ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడులను భారీ స్థాయిలో ఆకర్షించాలనే లక్ష్యంతో రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ దక్షిణ కొరియా పర్యటనలో దూకుడు ప్రదర్శించారు. సియోల్‌లో నిర్వహించిన సీఐఐ పార్ట్‌నర్‌షిప్ సమ్మిట్ రోడ్‌షోలో పాల్గొని కొరియా పారిశ్రామికవేత్తలకు ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న పెట్టుబడి అవకాశాలను వివరించారు. ఏపీ-కొరియా భాగస్వామ్యం కొత్త దశలోకి అడుగుపెడుతోందని పేర్కొంటూ, పెట్టుబడిదారులతో దీర్ఘకాలిక భాగస్వామ్యాలే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. కియా మోటార్స్ పెట్టుబడి ఏపీపై కొరియా సంస్థలకు ఉన్న విశ్వాసానికి నిదర్శనమని చెప్పారు.



### కొరియా సంస్థలతో కీలక చర్చలు

ఇన్వెస్ట్ కొరియా కమిషనర్ డాక్టర్ కిమ్ టే హ్యాంగ్‌తో నారా లోకేశ్ కీలక సమావేశం నిర్వహించారు. అమరావతి లేదా విశాఖపట్నంలో కోట్రా లేదా ఇన్వెస్ట్ కొరియా కార్యాలయం ఏర్పాటు చేయాలని కోరారు. దక్షిణ భారతదేశంలో మెట్రో నగరాలకు వెలుపల ఏర్పడే తొలి ఉప ప్రాంతీయ కోట్రా కార్యాలయంగా ఇది నిలుస్తుందని వివరించారు. ఏపీఈడీబీలో ఇప్పటికే పనిచేస్తున్న కోట్రా డెస్క్‌ను దశలవారీగా పూర్తి స్థాయి కార్యాలయంగా అభివృద్ధి చేయాలని ప్రతిపాదించారు.

### గ్రీన్ ఎనర్జీపై ప్రత్యేక దృష్టి

దక్షిణ కొరియాకు చెందిన డెల్టా ఎక్స్ సంస్థ ప్రతినిధులతో కూడా లోకేశ్ సమావేశమయ్యారు. మెషిన్ విజన్, ఎడ్జ్ ఏఐ, బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ సిస్టమ్స్ రంగాల్లో ఉన్న అవకాశాలను చర్చించారు. రాష్ట్రంలో 160 గిగావాట్ల గ్రీన్ ఎనర్జీ, 25 గిగావాట్ల బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ ప్రాజెక్టుల లక్ష్యాన్ని వివరించారు. పోర్టు సదుపాయాలు, బలమైన మౌలిక వసతులు ఉన్న ఆంధ్రప్రదేశ్‌లో బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ తయారీ యూనిట్ ఏర్పాటు చేయాలని సంస్థను ఆహ్వానించారు.

### షిప్‌బిల్డింగ్ రంగంపై దృష్టి

హెచ్‌డీ కొరియా షిప్‌బిల్డింగ్ అండ్ ఆఫ్‌షోర్ ఇంజనీరింగ్ సంస్థ ప్రతినిధులతో కూడా లోకేశ్ సమావేశమయ్యారు. ఆంధ్రప్రదేశ్ తీరప్రాంతంలో సముద్ర రవాణా, షిప్‌బిల్డింగ్, ఆఫ్‌షోర్ ఇంజనీరింగ్ రంగాలకు ఉన్న అవకాశాలను వివరించారు. ప్రపంచ స్థాయి పరిశ్రమలు స్థాపించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలు, పారిశ్రామిక విధానాన్ని సంస్థ ప్రతినిధులకు వివరించారు.

### ఎలక్ట్రానిక్స్ పరిశ్రమలకు ఆహ్వానం

షిన్‌హ్యాప్ ఎలక్ట్రానిక్స్ సంస్థ ఛైర్మన్ టేహూ కిమ్‌తో సమావేశమైన లోకేశ్, ప్రింటెడ్ సర్క్యూట్ బోర్డుల తయారీ రంగంలో ఆంధ్రప్రదేశ్‌ను ప్రధాన కేంద్రంగా అభివృద్ధి చేయాలని కోరారు. రాష్ట్రంలో ఎండ్ టు ఎండ్ పీసీబీ క్లస్టర్ ఏర్పాటుకు ప్రభుత్వంతో కలిసి పని చేయాలని విజ్ఞప్తి చేశారు. ఇప్పటికే ఏపీని పెట్టుబడి గమ్యస్థానంగా ఎంచుకున్నందుకు సంస్థకు ధన్యవాదాలు తెలిపారు.

### ఈవీ, గృహోపకరణాల రంగాలకు ఆహ్వానం

మోటివ్ లింక్ సంస్థ ప్రతినిధులతో సమావేశంలో ఎలక్ట్రిక్ వాహనాల విడిభాగాల తయారీ యూనిట్‌ను శ్రీసిటీలో ఏర్పాటు చేయాలని నారా లోకేశ్ కోరారు. అనంతరం కుకూ ఎలక్ట్రానిక్స్ ప్రతినిధులతో సమావేశమై శ్రీసిటీ లేదా తిరుపతిలో గృహోపకరణాల తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని ఆహ్వానించారు. ఇప్పటికే దేశంలో 40 శాతం ఎయిర్ కండీషనర్లు, 35 శాతం టెలివిజన్లు ఆంధ్రప్రదేశ్‌లో తయారవుతున్నాయని గుర్తుచేశారు. దక్షిణ కొరియా పర్యటనలో వరుస సమావేశాల ద్వారా ప్రపంచ స్థాయి కంపెనీలను ఆకర్షిస్తూ, ఆంధ్రప్రదేశ్‌ను పెట్టుబడులకు అత్యంత అనుకూల రాష్ట్రంగా నిలబెట్టే దిశగా నారా లోకేశ్ దూకుడుగా ముందుకు సాగుతున్నారు.

# ఏపీ జేఏసీ ఉద్యమానికి ప్రభుత్వ స్పందన

(మొదటి పేజీ తరువాయి..)

శుక్రవారం జరిగిన తొలి సమావేశం అనంతరం శనివారం ఉదయం 11 గంటలకు రాష్ట్ర సచివాలయంలోని రెండో బ్లాక్‌లో మంత్రుల కమిటీతో అధికారిక చర్చలకు రావాలని ఏపీ జేఏసీ అమరావతి నాయకులను ప్రభుత్వం ఆహ్వానించింది. ఈ సమావేశంలో ఉద్యోగుల ఆర్థిక, సేవా సంబంధిత సమస్యలపై సమగ్రంగా చర్చించి పరిష్కార మార్గాలపై నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉందని సమాచారం. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఉద్యోగుల సమస్యల పరిష్కారంపై సానుకూల దృక్పథంతో ఉన్నారని మంత్రులు జేఏసీ ప్రతినిధులకు వివరించినట్లు వెల్లడించారు.

### ఉద్యమానికి కారణాలివే

ఉద్యోగులు ఎదుర్కొంటున్న ఆర్థిక సమస్యలు చాలా కాలంగా పరిష్కారం కాకపోవడంతోనే ఉద్యమ బాట పట్టాల్సి వచ్చిందని జేఏసీ నాయకులు తెలిపారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు, కాంట్రాక్ట్ సిబ్బంది, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల డిమాండ్ల పరిష్కారం కోసం రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమ సన్నద్ధ సమావేశాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. జిల్లా, డివిజన్ కేంద్రాల్లో బ్యానర్లు ఏర్పాటు చేయడంతో పాటు ప్రజాప్రతినిధులను కలిసి తమ సమస్యలను వివరించినట్లు వెల్లడించారు.

### కొనసాగనున్న ఉద్యమ కార్యాచరణ

ఉద్యమంలో భాగంగా ఈ నెల 12న శ్రీకాకుళంలో తొలి సన్నాహక సభ నిర్వహించాలని జేఏసీ ఇప్పటికే నిర్ణయించింది. ఈ నెల 21న అనంతపురంలో మరో భారీ సమావేశం నిర్వహించేందుకు ఏర్పాట్లు కొనసాగుతున్నాయి. ప్రభుత్వం చర్చలకు ముందుకు రావడాన్ని స్వాగతిస్తున్నప్పటికీ ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లపై స్పష్టమైన హామీలు, నిర్ణయాలు రావాలని జేఏసీ నాయకులు కోరారు. చర్చల ఫలితాల ఆధారంగా తదుపరి కార్యాచరణపై నిర్ణయం తీసుకుంటామని తెలిపారు.



### పరిష్కారంపై ఉద్యోగుల ఆశలు

మంత్రుల కమిటీతో జరిగే సమావేశంలో అన్ని డిమాండ్లను సమగ్రంగా చర్చిస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చినట్లు జేఏసీ పేర్కొంది. ఉద్యోగుల సంక్షేమానికి సంబంధించిన అంశాలపై సానుకూల నిర్ణయాలు వెలువడుతాయని ఉద్యోగ సంఘాలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నాయి. ప్రభుత్వ స్పందనతో చర్చలకు మార్గం సుగమం కావడం సానుకూల పరిణామంగా భావిస్తున్నట్లు నాయకులు తెలిపారు. శనివారం జరిగే సమావేశంలో ఉద్యోగుల ఆర్థిక, సేవా సమస్యలపై కీలక నిర్ణయాలు వెలువడతాయా అనే అంశంపై రాష్ట్రవ్యాప్తంగా ఆసక్తి నెలకొంది.

# రావణ్‌కు వైసీపీ సపోర్ట్

(మొదటి పేజీ తరువాయి.)

రావణ్ స్నేహితుడు గగన్ ఇటీవల వైసీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని కలిశారని మంత్రి తెలిపారు. రావణ్‌కు సహాయం చేయాలని వైసీపీ నేత దేవినేని అవినాశ్‌కు జగన్ సూచించారని ఆరోపించారు. జడ శ్రావణ్ కుమార్ వెనుక కూడా అదే పార్టీ ఉందని పేర్కొన్నారు. ఈ పరిణామాలన్నీ యాదృచ్ఛికం కాదని, ఒక ప్రణాళిక ప్రకారమే జరుగుతున్నాయని మంత్రి అభిప్రాయపడ్డారు. రాష్ట్రంలో మత ఘర్షణలను రెచ్చగొట్టి శాంతిభద్రతలకు విఘాతం కలిగించే ప్రయత్నాలు జరుగుతున్నాయని కందుల దుర్గేశ్ ఆరోపించారు. ఈ కుట్రలకు తాడేపల్లి కేంద్రంగా మారిందని వ్యాఖ్యానించారు. దళితులు, క్రైస్తవుల పేరుతో నిర్వహించిన సభల్లో ప్రజా సమస్యల కంటే రాజకీయ విమర్శలకే ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చారని విమర్శించారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌ను లక్ష్యంగా చేసుకుని మాట్లాడటం వెనుక రాజకీయ ఉద్దేశం ఉందని అన్నారు.

### ప్రకాశ్ రాజ్, జడ శ్రావణ్ ప్రస్తావన

నటుడు ప్రకాశ్ రాజ్, జడ శ్రావణ్ కుమార్ పేర్లను కూడా మంత్రి ప్రస్తావించారు. జడ శ్రావణ్ గతంలో తాను రూ.25 కోట్లు ఖర్చు చేశానని చెప్పిన విషయాన్ని గుర్తుచేస్తూ, ఆ నిధులు ఎక్కడి నుంచి వచ్చాయో ప్రజలకు వివరించాలని డిమాండ్ చేశారు. ప్రకాశ్ రాజ్ కూడా ఈ వ్యవహారంలో వైసీపీకి అనుకూలంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఈ అంశాలపై సమగ్ర విచారణ జరగాలని కోరారు. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌ను రాజకీయంగా ఎదుర్కోలేకే ఆయనపై వ్యక్తిగత విమర్శలు చేస్తున్నారని మంత్రి దుర్గేశ్ అన్నారు. కూటమి ప్రభుత్వం బలపడటం, పవన్ కళ్యాణ్‌కు ప్రజల్లో పెరుగుతున్న ఆదరణను చూసి కొందరు ఉద్దేశపూర్వకంగా దుష్ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. హిందూ దేవతలను కించపరిచే వ్యాఖ్యలు చేసిన వారిపై ప్రభుత్వం చట్టపరమైన చర్యలు తీసుకుంటుందని స్పష్టం చేశారు.



# దటీజ్ విజయ్

### కరూర్‌లో సీఎం భావోద్వేగం..

### జననాయగన్ చారిత్రాత్మక నిర్ణయం

### ఉద్యోగాలు, స్మారక చిహ్నం ప్రకటన

### హైకోర్టు గ్రీన్ సిగ్నల్‌తో ఉద్యోగాల పంపిణీ

తమిళనాడు ముఖ్యమంత్రి, తమిళగ వెట్రి కళగం అధ్యక్షుడు సి. జోసెఫ్ విజయ్ కరూర్ పర్యటనకు ముందు కీలక న్యాయ పరిణామం చోటుచేసుకుంది. 2025లో కరూర్ తొక్కిసలాటలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబ సభ్యులకు ప్రభుత్వ ఉద్యోగ నియామక పత్రాలు అందజేసే కార్యక్రమానికి మద్రాస్ హైకోర్టు మదురై ధర్మాసనం అనుమతి ఇచ్చింది. ఈ ఉద్యోగాలు తాత్కాలిక ప్రాతిపదికన మాత్రమే ఉంటాయని, తుది న్యాయ నిర్ణయానికి లోబడి అమల్లో ఉంటాయని స్పష్టం చేసింది. ప్రభుత్వం కరుణా నియామకాల మార్గదర్శకాలపై పూర్తి నివేదిక సమర్పించాలని కూడా ఆదేశించింది.

### బాధిత కుటుంబాలకు ఉద్యోగాల పంపిణీ

హైకోర్టు అనుమతి అనంతరం కరూర్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన ప్రభుత్వ కార్యక్రమంలో ముఖ్యమంత్రి విజయ్ 31 మంది బాధిత కుటుంబ సభ్యులకు ప్రభుత్వ ఉద్యోగ నియామక పత్రాలు అందజేశారు. 2025 సెప్టెంబర్‌లో టీవీకే రోడ్‌షో సందర్భంగా జరిగిన తొక్కిసలాటలో 41 మంది ప్రాణాలు కోల్పోయారు. ఆ ఘటన తర్వాత తొలిసారిగా ముఖ్యమంత్రి హోదాలో కరూర్‌కు వచ్చిన విజయ్, బాధిత కుటుంబ సభ్యులను కలుసుకుని వారికి ధైర్యం చెప్పారు. అట్లాస్ కళైఅరంగంలో నిర్వహించిన బహిరంగ సభలో విజయ్ భావోద్వేగంగా ప్రసంగించారు. కరూర్ తొక్కిసలాట తన జీవితంలో ఎప్పటికీ మానని గాయమని పేర్కొన్నారు. ఆ ఘటనలో మరణించిన 41 మంది జ్ఞాపకార్థం తమిళగ వెట్రి కళగం తరఫున స్మారక చిహ్నం నిర్మిస్తామని ప్రకటించారు. ప్రజలకు సేవ చేయడమే తన రాజకీయ లక్ష్యమని పునరుద్ఘాటించారు. బాధిత కుటుంబాల పట్ల ప్రభుత్వం ఎప్పటికీ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు.

### డీఎంకేపై విజయ్ విమర్శలు

ప్రసంగంలో డీఎంకే ప్రభుత్వంపై విజయ్ తీవ్ర విమర్శలు చేశారు. డీఎంకేను అవినీతికి ప్రతీకగా అభివర్ణిస్తూ ఘాటు వ్యాఖ్యలు చేశారు. తమ ప్రభుత్వంలో ఒక్క పైసా లంచం కూడా తీసుకోవడం లేదని చెప్పారు. ప్రభుత్వ కార్యాలయాల్లో అవినీతి తగ్గిందని పేర్కొన్నారు. కావేరి జలాల అంశంలో గత ప్రభుత్వ వైఖరిపై కూడా ప్రశ్నలు లేవనెత్తారు. తాను ఎక్కువగా మాట్లాడటం కంటే పని చేయడానికే ప్రాధాన్యం ఇస్తానని అన్నారు.

### తొక్కిసలాటపై పోలీసుల పాత్ర ప్రస్తావన

కరూర్ ఘటనను గుర్తు చేసుకుంటూ ఆ రోజు భారీగా జనం తరలివస్తున్నారని తెలిసినా పోలీసులు తగిన భద్రత కల్పించలేదని విజయ్ వ్యాఖ్యానించారు. అవసరమైతే సభను నిలిపివేసే అధికారం కూడా పోలీసులకు ఉందని చెప్పారు. ఆ రోజు జరిగిన విషాదాన్ని రాజకీయ అంశంగా మార్చారని ఆరోపించారు. ఆ ఘటనలో ప్రాణాలు కోల్పోయిన ప్రతి ఒక్కరిని తాను ఎప్పటికీ మరచిపోలేనని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా కరూర్ జిల్లాలో భారీ భద్రతా ఏర్పాట్లు చేపట్టారు. దాదాపు ఐదు వేల మంది పోలీసులను మోహరించారు. సభా ప్రాంగణాల్లో ప్రత్యేక ప్రవేశ మార్గాలు, నిష్క్రమణ మార్గాలు ఏర్పాటు చేశారు. జనసమ్మర్థం నియంత్రణ, ట్రాఫిక్ నిర్వహణ, అత్యవసర సేవల కోసం ప్రత్యేక బృందాలను నియమించారు. కోర్టు అనుమతితో జరిగిన ఈ కార్యక్రమం రాజకీయంగా, న్యాయపరంగా ప్రాధాన్యం సంతరించుకుంది. ఉద్యోగాల పంపిణీ తాత్కాలికంగా అమల్లోకి వచ్చినప్పటికీ, వాటి శాశ్వతతపై తుది నిర్ణయం న్యాయస్థానం విచారణ అనంతరం వెలువడనుంది.

# ఉపా కేసుపై విపక్ష పోరు

- ప్రశ్న రావణ్‌పై కేసు రద్దు చేయాలి
- ఐక్య ఉద్యమాలకు విపక్షాల పిలుపు
- రౌండ్‌టేబుల్‌లో ఏకగ్రీవ డిమాండ్

ప్రశ్న యూట్యూబ్ ఛానల్ నిర్వాహకుడు ప్రశ్న రావణ్‌పై నమోదు చేసిన ఉపా చట్టం కేసును వెంటనే ఉపసంహరించాలని విజయవాడలో జరిగిన రౌండ్‌టేబుల్ సమావేశంలో విపక్ష పార్టీలు, ప్రజాసంఘాలు, పౌరహక్కుల నాయకులు డిమాండ్ చేశారు. సీపీఐ రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశానికి సీపీఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య అధ్యక్షత వహించారు. ప్రజాస్వామ్యంలో ప్రశ్నించే గొంతుకలను అణచివేసే ప్రయత్నాలను అడ్డుకోవాలని సమావేశంలో పాల్గొన్న నాయకులు పిలుపునిచ్చారు. జూలై 17లోగా ప్రభుత్వం ఉపా కేసును ఉపసంహరించుకోవాలని హెచ్చరించారు.

### భావ ప్రకటనా స్వేచ్ఛపై చర్చ

రాష్ట్రంలో విమర్శించే వారిపై వరుసగా కేసులు నమోదు చేయడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. ప్రశ్న రావణ్ వ్యవహారాన్ని ప్రజా సమస్యల నుంచి దృష్టి మళ్లించే రాజకీయ ప్రయత్నంగా అభివర్ణించారు. భావ ప్రకటనా స్వేచ్ఛను పరిరక్షించడం ప్రభుత్వ బాధ్యత అని పేర్కొన్నారు. ప్రశ్నించే స్వరాలను నిర్బంధ చట్టాలతో అణచివేయడం ప్రమాదకర పరిణామాలకు దారితీస్తుందని హెచ్చరించారు. రిటైర్డ్ ఐపీఎస్ అధికారి ఏబీ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఎవరైనా చట్టాన్ని ఉల్లంఘిస్తే సంబంధిత చట్టాల ప్రకారం చర్యలు తీసుకోవచ్చని, కానీ ఉపా వంటి కఠిన చట్టాలను ప్రయోగించడం సమంజసం కాదన్నారు. రిటైర్డ్ ఐఏఎస్ అధికారి శ్రీనివాసులు కూడా ఈ కేసుపై ఆందోళన వ్యక్తం చేశారు. భవిష్యత్తులో మరిన్ని ఇలాంటి కేసులకు ఇది మార్గం కావొచ్చని అన్నారు. రిటైర్డ్ ఐపీఎస్ అధికారి పీవీ సునీల్ కుమార్ మాట్లాడుతూ తాను ఎఫ్ఐఆర్‌ను పరిశీలించానని, ఉపా చట్టం వర్తించే అంశాలు అందులో కనిపించలేదని అభిప్రాయపడ్డారు.

### విపక్ష నేతల విమర్శలు

సీపీఐ జాతీయ నాయకుడు డాక్టర్ కె. నారాయణ మాట్లాడుతూ ప్రశ్న రావణ్‌పై నమోదు చేసిన ఉపా కేసును తక్షణమే ఉపసంహరించాలని డిమాండ్ చేశారు.



ప్రజా సమస్యల నుంచి దృష్టి మళ్లించేందుకే ఈ కేసు నమోదు చేశారని ఆరోపించారు. సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు పి. మధు కూడా ఇదే అభిప్రాయం వ్యక్తం చేశారు. మాజీ మంత్రి అంబటి రాంబాబు మాట్లాడుతూ ప్రశ్న రావణ్‌పై నమోదైన కేసు అన్యాయమని పేర్కొన్నారు. ఈ కేసులో న్యాయపరమైన పోరాటానికి తమ పార్టీ అండగా ఉంటుందని చెప్పారు.

### ఉద్యమ హెచ్చరిక

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య మాట్లాడుతూ జూలై 17లోగా ప్రభుత్వం ఉపా కేసును ఉపసంహరించుకోకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఐక్య ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. ఉపా చట్టాన్ని దుర్వినియోగం చేయడం ప్రజాస్వామ్యానికి ప్రమాదకరమని అన్నారు. ప్రశ్న రావణ్‌కు వరుసగా బెయిల్ వచ్చిన తర్వాత కూడా కొత్త కేసులు నమోదు చేయడం సరైన విధానం కాదని విమర్శించారు. ఉపా చట్టం రద్దు కోసం కూడా ఉద్యమాన్ని విస్తరిస్తామని ప్రకటించారు. ఈ సమావేశంలో వామపక్ష పార్టీలు, కాంగ్రెస్, వైఎస్సార్‌సీపీ ప్రతినిధులు, ఆమ్ ఆద్మీ పార్టీ నాయకులు, పౌరహక్కుల సంఘాలు, మహిళా సంఘాలు, విద్యార్థి సంఘాలు, జర్నలిస్టులు, రిటైర్డ్ అధికారులు పాల్గొన్నారు. ప్రశ్న రావణ్‌పై నమోదు చేసిన ఉపా కేసును ఉపసంహరించాలని కోరుతూ తీర్మానాన్ని ఏకగ్రీవంగా ఆమోదించారు. ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ కోసం రాజకీయ భేదాలను పక్కనపెట్టి ఉమ్మడి పోరాటం కొనసాగించాలని సమావేశం నిర్ణయించింది.



# ఘోర పరాభవం

## »భారత జట్టుపై శశి థరూర్ ఆగ్రహం!
## »వరుస ఓటములతో విమర్శల వెల్లువ

భారత టీ20 జట్టు వరుస పరాజయాలతో తీవ్ర విమర్శలు ఎదుర్కొంటోంది. ఐర్లాండ్ పర్యటనలో సిరీస్‌ను కోల్పోయిన జట్టు, ఇప్పుడు ఇంగ్లండ్‌తో జరిగిన ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లో కూడా మరో మ్యాచ్ మిగిలి ఉండగానే ఓటమిని అంగీకరించింది. బ్రిస్టల్ వేదికగా జరిగిన నాలుగో మ్యాచ్‌లో భారత్ తొమ్మిది వికెట్ల తేడాతో ఘోరంగా ఓడిపోయింది. ఈ పరాజయంతో జట్టు ప్రదర్శనపై అభిమానులతో పాటు మాజీ క్రికెటర్లు, రాజకీయ ప్రముఖులు కూడా తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

### శశి థరూర్ తీవ్ర వ్యాఖ్యలు

క్రికెట్‌పై మంచి అవగాహన ఉన్న కాంగ్రెస్ సీనియర్ ఎంపీ శశి థరూర్ భారత జట్టు ప్రదర్శనపై ఘాటుగా స్పందించారు. తాను పూర్తిగా షాక్‌కు గురయ్యానని, ఇది మరో ఘోర అవమానమని సామాజిక మాధ్యమం ఎక్స్‌లో వ్యాఖ్యానించారు. ఈ పరిస్థితిపై చెప్పడానికి మాటలు కూడా లేవని పేర్కొన్నారు. తన పోస్టులో బీసీసీఐతో పాటు ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్, చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్‌లను కూడా ట్యాగ్ చేయడం చర్చనీయాంశంగా మారింది.

### శ్రేయస్ అయ్యర్‌కు కఠిన పరీక్ష

ఇండియన్ ప్రీమియర్ లీగ్ ముగిసిన తర్వాత టీ20 ప్రపంచకప్ విజేత కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ స్థానంలో శ్రేయస్ అయ్యర్‌కు కెప్టెన్సీ బాధ్యతలు అప్పగించారు. రెండున్నర సంవత్సరాల తర్వాత టీ20 జట్టులోకి తిరిగి వచ్చిన అయ్యర్ బ్యాటింగ్‌లో మంచి ప్రదర్శన చేస్తున్నా జట్టుకు విజయాలు అందించలేకపోతున్నారు. ఆయన నాయకత్వంలో భారత్ ఇప్పటివరకు ఆరు మ్యాచ్‌లు ఆడగా ఐదు మ్యాచ్‌ల్లో ఓడిపోయింది. మరో మ్యాచ్ ఫలితం లేకుండానే ముగిసింది. ఈ గణాంకాలు జట్టు పరిస్థితిని స్పష్టంగా తెలియజేస్తున్నాయి.

### జట్టుపై పెరుగుతున్న ఒత్తిడి

వరుస పరాజయాలు భారత జట్టు నిర్వహణపై ప్రశ్నలు లేవనెత్తుతున్నాయి. జట్టు ఎంపిక, వ్యూహాలు, కెప్టెన్సీపై ఇప్పటికే చర్చ మొదలైంది. అభిమానులు కూడా జట్టులో మార్పులు అవసరమని అభిప్రాయపడుతున్నారు. చివరి మ్యాచ్‌లో గెలిచి పరువు నిలబెట్టుకోవాలన్న లక్ష్యంతో భారత్ బరిలోకి దిగనుంది. అయితే భవిష్యత్ టోర్నీలను దృష్టిలో పెట్టుకుని జట్టు నిర్వహణ కీలక నిర్ణయాలు తీసుకోవాల్సిన అవసరం ఉందని క్రీడా విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

# గంభీరమైన నిర్ణయం

## వరుస పరాజయాలతో బీసీసీఐ అలర్ట్

ఇంగ్లండ్‌తో జరిగిన టీ20 సిరీస్‌లో భారత జట్టు ఘోరంగా విఫలమైన నేపథ్యంలో భారత క్రికెట్ నియంత్రణ మండలి కీలక నిర్ణయానికి సిద్ధమైనట్లు సమాచారం. బ్రిస్టల్‌లో జరిగిన నాలుగో టీ20లో తొమ్మిది వికెట్ల తేడాతో ఓడిపోయిన భారత్, మరో మ్యాచ్ మిగిలి ఉండగానే సిరీస్‌ను చేజార్చుకుంది. ఈ పరాజయం తర్వాత ఆటగాళ్ల ప్రదర్శనతో పాటు కోచింగ్ సిబ్బంది పనితీరును కూడా బీసీసీఐ సమీక్షించనున్నట్లు తెలుస్తోంది. వరుస వైఫల్యాల కారణంగా జట్టు భవిష్యత్ ప్రణాళికలపై బోర్డు దృష్టి సారించింది.

### గంభీర్‌పై పెరిగిన ఒత్తిడి

భారత ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్ పదవీకాలం 2027 వరకు ఉన్నప్పటికీ తాజా ఫలితాల కారణంగా ఆయన పనితీరు కూడా పరిశీలనలోకి వచ్చినట్లు సమాచారం. జట్టు వ్యూహాలు, ఆటగాళ్ల ఎంపిక, మ్యాచ్‌లలో తీసుకున్న నిర్ణయాలపై బీసీసీఐ అంతర్గతంగా చర్చలు ప్రారంభించినట్లు వార్తలు వస్తున్నాయి. జట్టులో ఆశించిన స్థాయి ప్రదర్శన కనిపించకపోవడంతో కోచింగ్ వ్యవస్థపై కూడా ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

### కెప్టెన్ మార్పు తర్వాత వరుస వైఫల్యాలు

టీ20 ప్రపంచకప్ విజేత సూర్యకుమార్ యాదవ్ స్థానంలో శ్రేయస్ అయ్యర్‌కు కెప్టెన్సీ అప్పగించిన తర్వాత భారత జట్టు వరుసగా రెండు సిరీస్‌లు కోల్పోయింది. ముందుగా ఐర్లాండ్ చేతిలో 20 తేడాతో సిరీస్‌ను చేజార్చుకుంది. ఆ తర్వాత ఇంగ్లండ్ పర్యటనలో కూడా ఆశించిన ఫలితాలు సాధించలేకపోయింది. ఐర్లాండ్‌పై భారత్ తొలిసారి టీ20 సిరీస్‌ను కోల్పోవడం కూడా విమర్శలకు కారణమైంది. కెప్టెన్సీ మార్పు సరైన నిర్ణయమా అనే చర్చ ఇప్పుడు మరింత వేగంగా సాగుతోంది. ఇప్పుడు చివరి మ్యాచ్‌లో గెలిచి పరువు నిలబెట్టుకోవాలన్న లక్ష్యంతో భారత్ బరిలోకి దిగనుంది. అదే సమయంలో సమీక్ష తర్వాత బీసీసీఐ ఎలాంటి నిర్ణయాలు తీసుకుంటుందన్న అంశం కూడా ఆసక్తికరంగా మారింది.




## • వైట్‌వాష్ అంచున భారత్
## • పరువు కాపాడుకునే పోరాటం!

ఇంగ్లండ్‌తో జరుగుతున్న ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లో భారత జట్టు క్లిష్ట పరిస్థితిని ఎదుర్కొంటోంది. ఇప్పటికే సిరీస్‌ను కోల్పోయిన టీమిండియా ఇప్పుడు చివరి మ్యాచ్‌లో ఓడిపోతే 40 తేడాతో అవమానకరమైన వైట్ వాష్‌ను చవిచూడాల్సి వస్తుంది. తొలి మ్యాచ్ వర్షం కారణంగా రద్దు కాగా మిగిలిన మూడు మ్యాచ్‌ల్లో ఇంగ్లండ్ పూర్తి ఆధిపత్యం ప్రదర్శించింది. నేడు సౌతాంప్టన్‌లో జరిగే చివరి టీ20లో గెలిచి కనీసం పరువు నిలబెట్టుకోవాలనే లక్ష్యంతో శ్రేయస్ అయ్యర్ సారథ్యంలోని జట్టు బరిలోకి దిగుతోంది.

### కెప్టెన్ అయ్యర్‌పై భారీ ఒత్తిడి

టీ20 కెప్టెన్‌గా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి శ్రేయస్ అయ్యర్‌కు ఇప్పటివరకు ఒక్క విజయం కూడా దక్కలేదు. భారత పురుషుల టీ20 చరిత్రలో ఇది అత్యంత సుదీర్ఘ విజయరహిత పరంపరగా నమోదైంది. బెల్‌ఫాస్ట్‌లో ప్రారంభమైన ఈ పర్యటన డర్హామ్ మీదుగా ఇప్పుడు సౌతాంప్టన్‌కు చేరుకున్నా భారత జట్టు అదృష్టం మాత్రం మారలేదు. వరుస పరాజయాలు కెప్టెన్‌పై తీవ్ర ఒత్తిడిని పెంచాయి. చివరి మ్యాచ్‌లో విజయం సాధించి విమర్శలకు సమాధానం చెప్పాలని అయ్యర్ భావిస్తున్నారు.

### బ్యాటింగ్ వైఫల్యమే ప్రధాన సమస్య

ఈ సిరీస్‌లో భారత బ్యాటింగ్ తీవ్ర నిరాశ కలిగించింది. ముఖ్యంగా నాటింగ్హామ్ మ్యాచ్‌లో కేవలం 76 పరుగులకే ఆలౌట్ కావడం జట్టు బలహీనతను బయటపెట్టింది. బ్రిస్టల్ మ్యాచ్‌లో కూడా కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ ఒంటరి పోరాటం చేసినా మిగిలిన బ్యాటర్లు విఫలమయ్యారు. ఇంగ్లండ్ వేగ బౌలర్లు జోఫ్రా ఆర్చర్, జోష్ టంగ్ విసిరిన వేగవంతమైన బంతులను భారత బ్యాటర్లు సమర్థంగా ఎదుర్కోలేకపోయారు. సామ్ కరన్ నెమ్మదిగా విసిరిన బంతులు కూడా భారత బ్యాటర్లను ఇబ్బంది పెట్టాయి.

### బౌలింగ్ విభాగంలోనూ ఇబ్బందులు

బౌలింగ్ విభాగంలో కూడా భారత జట్టు ఆశించిన స్థాయిలో రాణించలేదు. హామ్‌స్ట్రింగ్ గాయాల కారణంగా వరుణ్ చక్రవర్తి, హర్షిత్ రాణా దూరమయ్యారు. మరోవైపు రవి బిష్ణోయ్ కీలక సమయంలో భారీగా పరుగులు సమర్పించడంతో జట్టు ఇబ్బందుల్లో పడింది. ప్రత్యామ్నాయ బౌలింగ్ ఎంపికలు కూడా పరిమితంగానే ఉండటంతో జట్టు యాజమాన్యం ఆందోళన చెందుతోంది. ఇంగ్లండ్ స్పిన్నర్లు విల్ జాక్స్, ఆదిల్ రషీద్, లియామ్ డాసన్ అద్భుతంగా బౌలింగ్ చేసి భారత బ్యాటర్లపై ఒత్తిడి తీసుకొచ్చారు.

### జట్టులో మార్పులపై చర్చ

యువ ఆటగాడు వైభవ్ సూర్యవంశీకి వరుస అవకాశాలు ఇస్తున్నా ఆశించిన ఫలితం రావడం లేదు. అయినప్పటికీ భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని అతడికి మరిన్ని అవకాశాలు ఇవ్వాలని పలువురు అభిప్రాయపడుతున్నారు. మరోవైపు సంజూ శాంసన్‌ను తుది జట్టులోకి తీసుకోకపోవడంపై విమర్శలు వినిపిస్తున్నాయి. తిలక్ వర్మ స్థానంలో సంజూకు అవకాశం ఇవ్వాలనే అభిప్రాయాలు కూడా వ్యక్తమవుతున్నాయి. అయితే అలాంటి మార్పులు బ్యాటింగ్ క్రమంపై ప్రభావం చూపే అవకాశం ఉంది.

### గెలిస్తే పరువు.. ఓడితే చరిత్ర

ఇంగ్లండ్ బ్యాటర్లు ఫిల్ సాల్ట్, జోస్ బట్లర్, హ్యారీ బ్రూక్, జేకబ్ బెతెల్ ఈ సిరీస్‌లో భారత బౌలర్లపై పూర్తి ఆధిపత్యం చెలాయించారు. స్వదేశ పరిస్థితులను చక్కగా ఉపయోగించుకుంటూ వరుస విజయాలు సాధించారు. ఇప్పుడు చివరి మ్యాచ్‌లో కూడా గెలిచి చారిత్రక 40 విజయాన్ని నమోదు చేయాలని ఇంగ్లండ్ భావిస్తోంది. భారత్ మాత్రం ఈ మ్యాచ్‌ను గెలిచి పరువు నిలబెట్టుకోవాలని చూస్తోంది. ఓటమి ఎదురైతే కొత్త కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ నాయకత్వంలోనే అరుదైన వైట్ వాష్ నమోదు కావడం భారత క్రికెట్‌కు మరో పెద్ద ఎదురుదెబ్బగా మిగిలిపోతుంది.

# భారత్‌కు ఇంగ్లండ్ హెచ్చరిక

## వైట్‌వాష్‌తో నెంబర్ వన్ లక్ష్యం!

భారత్‌పై ఇప్పటికే టీ20 సిరీస్‌ను కైవసం చేసుకున్న ఇంగ్లండ్ ఇప్పుడు మరో అరుదైన ఘనతపై దృష్టి పెట్టింది. ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో ఇప్పటికే 30 ఆధిక్యంలో ఉన్న ఇంగ్లండ్, చివరి మ్యాచ్‌లో కూడా గెలిచి భారత్‌ను 40తో వైట్ వాష్ చేయాలని భావిస్తోంది. అదే సమయంలో ఐసీసీ టీ20 ర్యాంకింగ్స్‌లో ప్రపంచ నంబర్‌వన్ స్థానాన్ని కూడా దక్కించుకోవాలని లక్ష్యంగా పెట్టుకుంది. సౌతాంప్టన్‌లో జరిగే చివరి మ్యాచ్ ఇంగ్లండ్‌కు చారిత్రకంగా మారే అవకాశముంది.





# లెనిన్ టీమ్‌కు సమంత విషెస్

అక్కినేని అఖిల్ హీరోగా తెరకెక్కిన 'లెనిన' చిత్రం ప్రేక్షకుల ముందుకు రావడంతో సినీ పరిశ్రమ నుంచి ఆయనకు శుభాకాంక్షలు వెల్లువెత్తుతున్నాయి. ఈ సందర్భంగా స్టార్ హీరోయిన్ సమంత చేసిన సోషల్ మీడియా పోస్ట్ ఇప్పుడు ప్రత్యేక ఆకర్షణగా మారింది. సినిమా విడుదల రోజునే 'లెనిన' ట్రైలర్‌ను షేర్ చేస్తూ చిత్ర బృందానికి ఆమె బెస్ట్ విషెస్ తెలియజేయడం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. సమంత తన పోస్ట్‌లో.. ఇప్పటికే బ్లాక్‌బస్టర్ వైబ్స్ కనిపిస్తున్నాయి. మొత్తం టీమ్‌కు ఆల్ ది బెస్ట్ అంటూ శుభాకాంక్షలు తెలిపింది. ముఖ్యంగా అఖిల్‌కు కూడా విజయాన్ని ఆకాంక్షిస్తూ ఆమె చేసిన ఈ పోస్ట్ అభిమానుల్లో ఆసక్తిని రేకెత్తించింది.



# రోషన్ కనకాల కొత్త మూవీ ప్రారంభం

టాలీవుడ్ యువ నటుడు రోషన్ కనకాల కథానాయకుడిగా ఓ వినూత్నమైన భారీ ప్రాజెక్ట్ అధికారికంగా పట్టాలెక్కింది. గత చిత్రాలకు పూర్తి భిన్నంగా, సరికొత్త సైన్స్ ఫిక్షన్ రొమాంటిక్ కామెడీ కథాంశంతో తెరకెక్కనున్న ఈ చిత్రం హైదరాబాద్‌లో అత్యంత ఘనంగా పూజా కార్యక్రమాలతో ప్రారంభమైంది. వైవిధ్యభరితమైన కథలను వెండితెరపై ఆవిష్కరించడంలో దిట్ట అయిన ప్రముఖ దర్శకుడు వి.ఐ. ఆనంద్ ఈ క్రేజీ ప్రాజెక్ట్‌కి కథ, స్క్రీన్‌ప్లే అందించడమే కాకుండా, స్వయంగా సమర్పకుడిగా వ్యవహరిస్తుండటం విశేషం. ఈ చిత్రంతో విజయ్ కె. కమిశెట్టి దర్శకుడిగా టాలీవుడ్‌కి పరిచయం అవుతున్నారు. సైన్స్ ఫిక్షన్, ఫాంటసీ, ప్రేమ, వినోదం వంటి అన్ని రకాల వాణిజ్య అంశాలను కలగలిపి ప్రేక్షకులను ఒక సరికొత్త ఊహాజనిత ప్రపంచంలోకి తీసుకెళ్లేలా ఈ కథను సిద్ధం చేశారు. ఈ చిత్రంలో రోషన్ కనకాల సరసన గహాజీ కథానాయికగా నటిస్తోంది. ఇక అత్యంత వైభవంగా జరిగిన ఈ ముహూర్తపు వేడుకకు టాలీవుడ్ ప్రముఖులు హాజరై చిత్ర యూనిట్‌కు బెస్ట్ విషెస్ తెలియజేశారు.

# కొత్త కథనంతో వచ్చిన లెనిన్




## అఖిల్ నటనా తీరు అద్భుతం

టైటిల్ ప్రకటించిన నాటి నుంచీ అఖిల్ 'లెనిన' సినిమాపై అంచనాలు మొదలయ్యాయి. అఖిల్ రగ్గడ్ గెటప్, కథా నేపథ్యం, ప్రచార చిత్రాలు, విడుదలైన పాటలు.. ఇవన్నీ సినిమాపై ఆసక్తిని పెంచాయి. అక్కినేని నాగార్జున, సూర్యదేవర నాగవంశీ నిర్మాతలు కావడంతో కచ్చితంగా సినిమా బావుంటుందని ఆడియన్స్ ఫిక్సయిపోయారు. అఖిల్ కెరీర్‌లో 'లెనిన'కి వచ్చినంత హైప్ మరే సినిమాకూ రాలేదన్నది నిజం. ఎట్టకేలకు ఈ శుక్రవారం 'లెనిన'గా అఖిల్ థియేటర్లలోకి అడుగపెట్టాడు.
ఇది రాయలసీమలోని రామాపురం అనే గ్రామం పగలకు, ప్రతీకారాలకు దూరంగా ఉంటుంది. రక్తం ఆ నేలను అప్పటివరకూ తాకలేదు. ఆ ఊరిలో సంప్రదాయ జాతర జరుగుతుండగా, ఓ పదేళ్ల పిల్లాడు ఆ ప్రాంతంలోకి అడుపెట్టాడు. అ పిల్లాడి పేరు 'లెనిన'. అమ్మానాన్న లేని అనాథ అయిన లెనిన్‌ని ఆ ఊరి పెద్దావిడ(ఈశ్వరీరావు) అక్కున చేర్చుకుంది. ఆమె కొడుకైన వసంత్(ప్రమోద్ పంజు)తో లెనిన్‌కి బలమైన స్నేహబంధం ఏర్పడింది. వసంత్‌తో పాటు లెనిన్ కూడా ఆ ఇంట్లోనే పెరిగి పెద్దయ్యాడు.. కట్ చేస్తే.. కొన్నేళ్ల తర్వాత లెనిన్ జైలు నుంచి విడుదలయ్యాడు. ఆ ఊరిలోకి అడుగుపెట్టి ఆ ఊరి జనాలైన వందమందిని నరికి చంపాడు. చివరకు తన ప్రాణస్నేహితుడైన వసంత్‌ని కూడా అతి దారుణంగా పొడిచి చంపాడు. అసలు లెనిన్ జైలుకి ఎందుకెళ్లాడు? రక్తం రుచే తెలియని ఆ నేలపై రక్తపాతం ఎందుకు సృష్టించాడు? ప్రాణ స్నేహితుడైన వసంత్ ప్రాణాన్ని ఎందుకు బలి తీసుకున్నాడు? ఈ ప్రశ్నలకు సమాధానమే అసలు కథ.
పరువు, ప్రేమ, స్నేహం, నమ్మకద్రోహం నేపథ్యంలో సాగే కథ ఇది. కథకుడు, దర్శకుడు మురళీకిశోర్ అబ్బూరి ఈ కథను నడిపించిన తీరు బావుంది. ఇదొక విభిన్నమైన స్క్రీన్‌ప్లే. ప్రథమార్థం ఇదేదో పరువు కోసం ప్రాణాలు తీసే వ్యక్తుల చుట్టూ తిరిగే కథగానే అంతా భావిస్తారు. కానీ సెకండాఫ్‌లో ఈర్ష్యా, ద్వేషం, నమ్మకద్రోహం కోణాలు కథలో బహిర్గతమవుతాయి. ఈర్ష్యా, ద్వేషం అనేవి పవిత్రమైన స్నేహాన్ని సైతం నిర్వీర్యం చేస్తాయని ఈ కథ ద్వారా మురళీకిశోర్ అబ్బూరి తెలిపారు. అనాథగా ఆ ఊరు వచ్చిన లెనిన్ 'నా' అనుకున్న వారందర్నీ సంపాదించుకున్నానని భ్రమ పడతాడు. తాను ఎప్పటికీ అనాథనేనని తెలుసుకుకోవడంతో కథ ముగుస్తుంది. స్నేహానికీ, ప్రేమకీ లొంగిపోయే లెనిన్ నమ్మకద్రోహానికి బలైపోయాడు. అదే ఈ సినిమా కథ. చాలా సీరియస్ సబ్జెక్ట్ ఇది. క్షణక్షణానికి మారుతున్న వ్యక్తులు మనస్తత్వాలను ఈ సినిమాలో చూడొచ్చు. మంచి వాళ్లుగా కనిపిస్తున్న మేకవన్నె పులుల మధ్య జీవితాన్ని సాగించి, సర్వం కోల్పోయిన లెనిన్‌ని ఈ సినిమాలో చూడొచ్చు. ప్రథమార్థం చివరి ఇరవై నిమిషాల్లో సినిమాలోని అసలు కథ మొదలైంది. కథలోకి వెళ్లడం ఆలస్యం కావడం వల్ల కథనం నిదానించినట్టు అనిపిస్తుంది. ద్వితీయార్థం ఆద్యంతం ఊహించని మలుపులతో ఆసక్తికరంగా సినిమా సాగింది. మొత్తంగా దర్శకుడు మురళీకిశోర్ వైవిధ్యమైన కథనంతో ఈ కథను నడిపించి సినిమాను నిలబెట్టారు.
ఇక 'లెనిన'గా కొత్త అఖిల్‌ని ఈ సినిమాలో చూస్తారు. ఇప్పటివరకూ ఆయన చేసిన సినిమాలన్నీ ఒకెత్తూ, 'లెనిన' ఒకెత్తు. అమాయకత్వం, మంచి తనం, మూర్ఖత్వం కలగలిసిన ఈ పాత్రలో అఖిల్ జీవించాడనే చెప్పాలి. అతనిలోని పరిపూర్ణమైన నటుడ్ని 'లెనిన'లో చూడొచ్చు. ముఖ్యంగా ద్వితీయార్థంలో అఖిల్ అద్భుతంగా నటించాడు. అతని కెరీర్‌లో బెస్ట్ పెర్‌ఫార్మెన్స్‌గా 'లెనిన'ని చెప్పొచ్చు. ఇక భాగ్యశ్రీబోర్సే తనదైన అందచందాలతోపాటు చక్కటి అభినయంతో కూడా ఆకట్టుకున్నది. ఈ సినిమాలో ప్రత్యేకంగా చెప్పుకోవాల్సిన వసంత్‌గా నటించిన ప్రమోద్ పంజు గురించి. తనది ఇందులో మేకవన్నె పులి లాంటిపాత్ర. మంచివాడిగా కనిపిస్తూ ఉన్నట్టుండి దుర్మార్గుడిగా ఎస్టాబ్లిష్ అయ్యే పాత్ర అది. ఆ పాత్రలో తన నిజంగా అదరహో అనిపించాడు. ఈ సినిమాతో అతనికి మంచి పేరు రావడం ఖాయం. ఇక శివాజీ, ఈశ్వరీరావు, రాంకీ.. ఇలా అంతా పరిధిమేర పాత్రలకు న్యాయంచేశారు.

# ఒత్తిడి నుంచి రెస్ట్

## యూరప్ టూర్ వెళ్లనున్న ప్రభాస్

పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ ప్రస్తుతం వరుస క్రేజీ ప్రాజెక్టులతో ఫుల్ బిజీగా ఉన్న సంగతి తెలిసిందే. సందీప్ రెడ్డి వంగా దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'స్పిరిట', హను రాఘవపూడి డైరెక్షన్‌లో వస్తున్న 'ఫౌజీ' చిత్రాలతో పాటు బ్లాక్‌బస్టర్ హిట్స్ 'సలార', 'కల్కి 2898' సీక్వెల్స్ కూడా ఆయన చేతిలో ఉన్నాయి. అయితే.. బ్యాక్ టు బ్యాక్ షూటింగ్‌లతో తీరిక లేకుండా గడుపుతున్న ప్రభాస్, త్వరలోనే కాస్త బ్రేక్ తీసుకోబోతున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ప్రభాస్ హైదరాబాద్‌లో 'స్పిరిట' సినిమా షూటింగ్‌లో పాల్గొంటున్నారు. హీరో ప్రభాస్ మరియు హీరోయిన్ త్రిప్తి డిమ్రి పై కొన్ని కీలక సన్నివేశాలతో పాటు యాక్షన్ సీక్వెన్స్ చిత్రీకరిస్తున్నారు. ఇక స్పిరిట్ లేటెస్ట్ షెడ్యూల్ పూర్తయిన వెంటనే ప్రభాస్ ఒక చిన్న విరామం తీసుకోనున్నారు. సుమారు పదిరోజుల పాటు వెకేషన్ కోసం ఆయన యూరప్ వెళ్లనున్నట్లు సమాచారం. యూరప్ టూర్ ముగించుకుని తిరిగొచ్చిన తర్వాత, ప్రభాస్ తన పూర్తి ఫోకస్‌ను 'ఫౌజీ' సినిమాపై పెట్టనున్నట్టుగా తెలుస్తోంది. హను రాఘవపూడి దర్శకత్వంలో పీరియాడిక్ లవ్ స్టోరీగా రాబోతున్న ఈ చిత్రంతో ఇమాన్వి హీరోయిన్‌గా పరిచయమవుతోంది. ఇప్పటికే షూటింగ్ చివరి దశకు చేరుకోగా.. బ్యాలెన్స్ షూటింగ్‌ను కంప్లీట్ చేసే ప్లానింగ్‌లో ఉన్నాడు డార్లింగ్. ఆ తర్వాత స్పిరిట్ పూర్తి చేసి.. కల్కి 2 సెట్స్‌లో జాయిన్ అవనున్నాడు. ఇక ఆ తర్వాత సలార్ 2 సెట్స్ పైకి వెళ్లనుంది. ప్రస్తుతానికి ప్రభాస్ ఈ భారీ లైనప్‌తో బిజీగా ఉన్నాడు. అందుకే.. ఒక స్మాల్ బ్రేక్ తీసుకుంటున్నాడని చెప్పొచ్చు.



This newspaper is Owned and Published by KANTIPUDI RAVENDRA from **H. NO. 319, 2ND FLOOR, BHAGATHSINGH NAGAR, PHASE 1, SARDAR PATEL NAGAR, NEAR SRADHA SCHOOL, VENKATESWARA SWAMY TEMPLE KPHB, KUKATPALLY, MEDCHAL MALKAJGIRI, TELANGANA - 500072.** Editor: KANTIPUDI RAVENDRA, Printed by BANDLA SAIBABU from PLOT NO. A-22/1, ROAD NO. 14, INDUSTRIAL PARK, NACHARAM, HYDERABAD, MEDCHAL MALKAJGIRI, TELANGANA - 500076. PRGI REGD No.: TGTEL/26/A4986. Phone: 9392666319. Email ID: prabhathakiranam@gmail.com.
Corporate Office: HIG 79, VNR RESIDANCY ,VENKATARAMANA COLONY, KUKATPALLY ,HYDERABAD, 500085